


RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in








EDITOR: BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME: 18 ISSUE: 122 MONDAY, OCTOBER 12, 2026 PAGES: 12 COST: 2 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి : 18 సంచిక : 122 సోమవారం, అక్టోబర్ 12, 2026, పేజీలు : 12 వెల : 2/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI


### చలికాలంలోనూ చెమటలు పట్టించే

# ఉక్కపోత..!

**ఎండ తీవ్రతతో ఉక్కిరిబిక్కిరి.. మారుతున్న వాతావరణంతో ప్రజల ఆందోళన..!**



**తెలంగాణ ప్రత్యేక ప్రత్యేక కథనం వరంగల్ జిల్లా:** చలికాలం వచ్చిందంటే చల్లని గాలులు పలకరిస్తాయని, వాతావరణం ఆహ్లాదకరంగా మారుతుందని ప్రజలు ఆశిస్తారు. కానీ అందుకు భిన్నంగా ఉక్కపోత అనుభవంలోకి వస్తే పరిస్థితి ఏమిటి? ఉదయం నుంచి సాయంత్రం వరకు వేడి వాతావరణం, గాలిలో తేమ, ఉక్కిరిబిక్కిరి చేసే ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. కాలం మారుతున్నా వాతావరణంలో ఆశించిన మార్పు కనిపించకపోవడంతో జనం అసౌకర్యానికి గురవుతున్నారు. సాధారణంగా చలికాలంలో ఉష్ణోగ్రతలు తగ్గి చల్లదనం పెరగాలి. అయితే వాతావరణ పరిస్థితులు, గాలిలో తేమ, పగటి ఉష్ణోగ్రతల్లో మార్పుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో చలికాలంలోనూ ఉక్కపోత అనిపించవచ్చు. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో వాతావరణం ఒకేలా ఉండకపోవడం ప్రజలను అయోమయానికి గురిచేస్తోంది. ఎండలో బయటకు వెళ్లాలన్నా ఇబ్బందే, ఇంట్లో ఉన్నా ఉక్కపోత తప్పడం లేదనే భావన కొందరిలో వ్యక్తమవుతోంది. రోడ్లపై తిరిగే చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, కూలీలు, రైతులు, ఇతర రోజువారీ కార్మికులకు వాతావరణ మార్పులు అదనపు భారంగా మారవచ్చు. బయట ఎక్కువ సేపు గడపాల్సినవారు వేడి, చెమట, అలసటతో ఇబ్బందులు పడే పరిస్థితులు ఎదుర్కొంటారు. వ్యవసాయ పనులు చేసేవారికి వాతావరణాన్ని బట్టి పని వేళలను సర్దుబాటు చేసుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. కాలానుగుణంగా ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటుచేసుకోవడం సహజమే అయినప్పటికీ, అనుభవిస్తున్న ఉక్కపోతకు అసలు కారణాలేమిటన్నది స్థానిక వాతావరణ పరిస్థితులు, ఉష్ణోగ్రతలు, గాలిలో తేమ వివరాల ఆధారంగా నిర్ధారించాలి. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో వాతావరణ శాఖ అంచనాలు, హెచ్చరికలను గమనించడం అవసరం. వేడి వాతావరణంలో తగినంత నీరు తాగడం, వీలైనంత వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే సమయాల్లో బయట తిరగకుండా చూసుకోవడం, శరీరాన్ని చల్లగా ఉంచుకోవడం ముఖ్యం. తీవ్రమైన నీరసం, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్య సహాయం తీసుకోవాలి. చలికాలంలో చల్లదనాన్ని ఆశించే ప్రజలకు ఉక్కపోత ఎదురైతే అసౌకర్యం కలగడం సహజం. అయితే ఇది తాత్కాలిక వాతావరణ పరిస్థితుల ప్రభావమా, లేక దీర్ఘకాలిక మార్పుల్లో భాగమా అన్నది నిర్ధారించడానికి వాస్తవ ఉష్ణోగ్రతల రికార్డులు, వాతావరణ శాఖ సమాచారం అవసరం. ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించడం, వాతావరణ హెచ్చరికలపై అవగాహన కల్పించడం ఇప్పుడు కీలకం.

# 22ఏ ఉచ్చు.. తొలగని చిచ్చు

- భూముల రక్షణ కోసం పెట్టిన నిబంధన.. రికార్డుల తప్పులతో పట్టాదారులకూ చిక్కులు
- ప్రభుత్వం సడలింపులు ఇచ్చినా.. క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న అడ్డంకులు
- ప్రభుత్వ లెక్కల ప్రకారం 3.95 లక్షల ఎకరాల ప్రైవేటు వ్యవసాయ భూములు 22ఏలో
- క్షేత్రస్థాయిలో చూస్తే... అంతకు ఎక్కువగానే నిషేధిత జాబితాలో...
- ఒకే సర్వే నంబర్.. ప్రభుత్వ, పట్టా భూములు వేర్వేరు.. కలిస్తే మొత్తం బ్లాక్
- పాత రికార్డులు.. డిజిటల్ డేటా తేడాలే అసలు సమస్య..
- హైకోర్టులో 28,611కేసులు




**హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం 22ఏలోని భూముల రిజిస్ట్రేషన్లోని సమస్యలను ఒక్కొక్కటిగా తొలగిస్తున్నామని చెబుతోంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. జీఓ 118లోని భూములు, యూఎల్‌సీ, వ్యవసాయ భూముల్లో నాలా కన్వర్షన్ లేకుండా నిర్మించుకున్న వాటి క్రమబద్ధీకరణ, పట్టణాభివృద్ధి సంస్థలు, డీటీసీపీ, జీహెచ్ఎంసీ మంజూరు చేసిన లే అవుట్‌లలోని ప్లాట్లు, ఫ్లాట్లు, తాజాగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని నిర్మించుకున్న 500 చదరపు గజాలలోపు స్థలాల్లోని వాటిని జీఓ 59 కింద పారదర్శకంగా క్రమబద్ధీకరణకు ఉత్తర్వులు ఇచ్చామని స్పష్టం చేస్తోంది అయితే పట్టా భూములు సీలింగ్, అసైన్డ్, దేవాలయ, వక్ఫ్ భూములంటూ 22ఏలో పెట్టిన వాటిపై నిర్ణయం ఇంకా వెలువడలేదు. అధికారుల పొరపాటు వల్ల ఆ భూములను అమ్ముకుందామనుకున్నా, అమ్ముకోలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 22ఏలోని భూములను తాము రిజిస్ట్రేషన్ చేసే సమస్యే లేదంటున్నారు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు. రైతుల పొరపాటు లేకపోయినా.. ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వస్తే తప్ప ఏమీ చేయలేమంటూ చేతులెత్తేస్తున్నారు. వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సెప్టెంబర్ 27 నుంచి గురువారం వరకు 22ఏ కింద 122 దరఖాస్తులు రాగా 82 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ఇందులో పట్టాభూములు సైతం సీలింగ్, అసైన్డ్ భూముల ఖాతాలో ఉండటమే. ఇదే సమస్యతో కాజీపేట మండలం రాంపూర్‌కు చెందిన ఇద్దరు అన్నదమ్ముల రిజిస్ట్రేషన్ను కూడా రద్దు చేశారు.

**ఒకే సర్వే నంబర్... రెండు రకాల భూములు**

ఒకే సర్వేనంబర్‌లో కొంత ప్రభుత్వ భూమి.. మిగిలినది పట్టా భూమి ఉన్నా దానిని 22ఏ జాబితాలో చేర్చారు. దీంతో ఆ సర్వే నంబర్ మొత్తం నిషేధితంగా నమోదైంది. దీంతో పట్టాదారు భూమికీ రిజిస్ట్రేషన్ ఆగింది.

## గజ్వేల్ తహసీల్దారుపై సస్పెన్షన్ వేటు

**గజ్వేల్:** భూ పరిహారం సమస్య పరిష్కరించాలని వచ్చిన ఓ రైతుపై బాధ్యతారాహిత్యంగా వ్యాఖ్యలు చేసిన సిద్దిపేట జిల్లా గజ్వేల్ తహసీల్దారు చిట్టంపల్లి స్వామిపై సస్పెన్షన్ వేటు పడింది. గజ్వేల్ మండలం మక్తమాసాన్‌పల్లికి చెందిన రైతు ఏసు.. ఆయన బంధువుల భూములను ప్రభుత్వం ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి సేకరించింది. ప్రభుత్వం పంపిణీ చేసిన పరిహారం వాటాల విషయంలో రైతుకు, ఆయన బంధువులకు మధ్య వివాదం తలెత్తింది.

# ఎమర్జెన్సీని ప్రత్యక్షంగా చూశాం

- మోదీ ప్రధానిగా ఉండడం దేశానికి అవమానకరం
- సీజేపీ నేతలు దీప్కే, సౌరవ్‌దాస్, రాంకా, షిండే
- సీఈసీ రాజీనామా చేసేదాకా ఉద్యమం ఆగదని వెల్లడి
- ఏడాదిపాటు నిరసనల్లో పాల్గొనబోమని కోర్టుకు వీరు బాండ్ రాసిచ్చినట్లు ప్రచారం..
- అదేం లేదన్న దీప్కే

**న్యూఢిల్లీ:** ప్రధాని మోదీ పాలనలో దేశం మొత్తం ఎమర్జెన్సీని తలపిస్తోందని సీజేపీ నేతలు దీప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా, అజింక్య షిండే ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం ఢిల్లీలో ఎమర్జెన్సీని ప్రత్యక్షంగా చూశామన్నారు. శనివారం నిరసనల సందర్భంగా దీప్కే, సౌరవ్‌దాస్, అశుతోష్ రాంకాలను అరెస్టు చేసిన పోలీసులు.. ఆదివారం వారిని విడుదల చేశారు. అనంతరం దీప్కే తన నానమ్మ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు స్వగ్రామం హింగోలీకి వెళ్లగా మిగతావారు మీడియాతో మాట్లాడారు. పోలీసుల నిర్బంధం నుంచి విడుదల కాగానే దీప్కే ఎక్స్ వేదికగా మోదీపై విమర్శలు గుప్పించారు. 'మోదీ ప్రధానిగా ఉండటం దేశానికి అవమానకరం. దేశం ఇప్పటివరకు ఇలాంటి ద్రోహిని, పిరికిపందను, నియంతను చూడలేదు' అని మండిపడ్డారు. జ్ఞానేశ్‌కుమార్ సీఈసీ పదవి నుంచి తప్పుకొనేవరకు తమ పోరాటం ఆగదని అజింక్య షిండే ప్రకటించారు. ఇదిలా ఉండగా,



పోలీసుల నిర్బంధం నుంచి విడుదలయ్యేందుకు ఏడాదిపాటు ఎలాంటి నిరసనల్లో పాల్గొనకుండా, శాంతికి విఘాతం కలిగించకుండా ఉంటామని సీజేపీ నేతలు కోర్టుకు బాండు సమర్పించారన్న వార్తలపై దీప్కే స్పందించారు. తాము ఎలాంటి బాండుపై సంతకం చేయలేదని స్పష్టంచేశారు. కాగా, శనివారం అరెస్టు చేసిన ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్‌రాఠీని కూడా పోలీసులు ఆదివారం విడుదల చేశారు.

## ఓటు కోల్పోయిన వారందరిని తీసుకొస్తా

**తేదీ, సమయం చెప్పండి**

**మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్:** తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు వ్యాఖ్యలపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్)లో తప్పులు జరిగితే సరిదిద్దుదామని, బీజేపీ కార్యకర్తలు కూడా అర్హుల ఓటు హక్కును కాపాడాలని పిలుపునిస్తే బాగుండేదన్నారు. 'ఓటు కోల్పోయిన వారు ఎవరైనా ఉన్నారా?' అని ప్రశ్నించడం సరికాదన్నారు. 'పోలీసులతో అరెస్టులు చేయించడం కాదన్నారు. "మీరు తేదీ, సమయం చెప్పండి. ఓటు హక్కు కోల్పోయామని ఆందోళన చెందుతున్న బాధితులను ఆధారాలతో సహా మీ ముందుకు తీసుకొస్తాను" అని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు.

# సర్‌తో గట్టెక్కేందుకు కమలం కుట్ర

- గోవాలో భూములు అన్యాక్రాంతం
- అభివృద్ధిని గాలికొదిలేశారు
- బీజేపీతో విసిగిపోయిన ప్రజలు :సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్:** గోవాలో రెండు సార్లు అధికారంలోకి వచ్చిన బీజేపీ పాలనతో అక్కడి ప్రజలు విసిగిపోయారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. ఆ రాష్ట్రంలో నైస్, ఐస్ బీజేపీ ఫ్రంటల్ ఆర్గనైజేషన్ గా పని చేసి రెండు సార్లు అధికారంలోకి తెచ్చాయనీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని చెప్పారు. దీంతో ఓట్లను తొలగించటం ద్వారా మూడోసారి అధికారంలోకి రావడానికి కమలం పార్టీ ప్రయత్నిస్తున్నదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలు, దళితులు, మైనారిటీలు, ఆదివాసీల ఓట్లు తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గోవా కాంగ్రెస్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం అక్కడి చీఫ్టెన్స్ స్మారకం నుంచి కున్కోలిమ్ బస్టాండ్ వరకు నిర్వహించిన పాదయాత్రలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ గోవాలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే అక్కడి ప్రజలు పరాయివారవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా నిర్దేశించుకున్న షెడ్యూల్ ప్రకారం గోవాకు రాహుల్ గాంధీ రావాల్సి ఉన్నప్పటికీ ఢిల్లీలో నిరసన కార్యక్రమాల నేపథ్యంలో రాలేకపోయారనీ, ఆయన ప్రతినిధిగా తాను వచ్చానని రేవంత్ రెడ్డి చెప్పారు. బీజేపీ



పాలనలో గోవా భూములు అన్యాక్రాంతమవుతున్నాయనీ, అభివృద్ధిని పక్కన పెట్టిన గోవా సీఎం స్థానిక ఆస్తులను ఇతరులకు అప్పగించే పనిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. యువతను డ్రగ్స్‌కు బానిసలుగా మార్చి గోవా ను డ్రగ్స్ సోర్స్, డ్రగ్స్ పెడ్లర్స్ అడ్డాగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నషా ముక్త్ భారత్ అంటున్న పీఎం, కేంద్ర హోంశాఖ మంత్రి గోవాలో ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. గోవా పేరు చెడిపోవద్దన్నదే కాంగ్రెస్ ఆకాంక్ష అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. యువత డ్రగ్స్ బానిక కావద్దని కోరారు. గోవాలో కాంగ్రెస్ పార్టీకి కాకుండా ఏ పార్టీకి వేసిన ఆ ఓటు బీజేపీకే పోతుందని అప్రమత్తం చేశారు. డ్రగ్స్ లార్డ్స్, ల్యాండ్ మాఫియా గోవాలో రాజ్యమేలకుండా చూసుకోవాలని సూచించారు. రెండు సార్లు బీజేపీని నమ్మి మోసపోయారనీ, మూడోసారి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ అంటే రావణుడనీ, కాంగ్రెస్ పార్టీ అంటే రాముడనీ, ఇద్దరి మధ్య పోరాటం జరుగుతుందని రేవంత్ రెడ్డి తెలిపారు. రావణుడిని ఓడించాలంటే ప్రజలు రామునికి మద్దతుగా నిలబడాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ దేశాన్ని ఏకం చేయడానికి ప్రయత్నిస్తున్నారనీ, భారత్ జోడో యాత్ర చేశారని గుర్తుచేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ విభజించడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. గోవా ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావాల్సిన అవసరముందని తెలిపారు. మాన్‌సూన్ లో గోవాలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందని చెప్పారు.

# గుండెల్లో గిరిజన బిడ్డ బాధ

**ఒక్క ట్వీట్‌కే కదిలిన కేటీఆర్ పెద్ద మనసు రెండేళ్లలో వచ్చేది మన ప్రభుత్వమే..**

**అన్ని విధాలా ఆదుకుంటాం.!**



**తెలంగాణ పత్రిక ప్రతినిధి ములుగు జిల్లా:** అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి స్పందించే నాయకుడు కేటీఆర్ మరోసారి తన పెద్ద మనసును చాటుకున్నారు. ఎక్స్ వేదికగా ములుగు జిల్లా వీరాపూర్ నిరుపేద గిరిజన విద్యార్థిని శృతి చేసిన చిన్న విజ్ఞప్తిపై వెంటనే స్పందించి, ఆమె చదువుకు కొండంత అండగా నిలవడం ఆయన ప్రజా సంక్షేమ దీక్షకు నిదర్శనం. కొడంగల్ అగ్రికల్చరల్ కాలేజీలో B.Sc. సీటు వచ్చినా, రోజువారీ కూలి పనులు చేసుకునే కుటుంబం కావడంతో ఫీజులు కట్టలేక సతమతమవుతున్న శృతి పరిస్థితిని చూసి కేటీఆర్ వెంటనే చలించిపోయారు. కేటీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు స్వయంగా వెళ్లి రూ. 50,000 ఆర్థిక సాయం అందజేశారు. అంతేకాకుండా కేటీఆర్ స్వయంగా ఫోన్ చేసి శృతితో మాట్లాడి, "ఏం భయం లేదుమ్మా, నీ చదువు బాధ్యత నాది.. ధైర్యంగా ముందుకు వెళ్ళు, బాగా చదువుకో" అని ఓ కన్నతండ్రిలా ఆప్యాయంగా ఓదార్చారు. దఝితీఎ౧రెండేళ్ల తర్వాత వచ్చేది మన ప్రభుత్వమే.. ఆ తర్వాత నిన్ను, నీ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం అని కేటీఆర్ ఇచ్చిన భరోసా ఆ కుటుంబంలో నూతన ఉత్సాహాన్ని నింపింది. క్క చిన్న ట్వీట్‌కు స్పందించి తమ బిడ్డ బంగారు భవిష్యత్తుకు మార్గం సుగమం చేసిన ఆపద్బాంధవుడు కేటీఆర్, ఆర్థిక సాయం అందజేసిన జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ బాబులకు శృతి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమవుతూ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కేటీఆర్ చూపుతున్న ఈ మానవతా దృక్పథంపై ప్రజలంతా ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

## ఎల్‌నినో ఎఫెక్ట్.. యాసంగి పంటలు వేయొద్దు

**నీరు ఇవ్వలేం: మంత్రి పొంగులేటి**



**ఖమ్మం:** ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశాలు తక్కువగా ఉన్నాయని, దీంతో రానున్న రోజుల్లో సాగునీటితో పాటు తాగునీటి సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉందని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గ పర్యటన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

## రేపు సుప్రీంకోర్టుకు కాంగ్రెస్ మార్చ్

**రాహుల్ గాంధీ**



**న్యూఢిల్లీ:** ఓట్ల చోరీకి వ్యతిరేకంగా, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్రమాలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ రేపు(సోమవారం) ఢిల్లీలో నిరసన కార్యక్రమాలు చేపట్టనుంది. అందులో భాగంగా సుప్రీంకోర్టు వరకు మార్చ్ నిర్వహించి, భారత ప్రజల తరపున ప్రధాన న్యాయమూర్తికి వినతిపత్రం సమర్పిస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారు.

# అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలి

**పట్టభద్రుల ఓటరు నమోదు అవగాహన సదస్సులో**

**మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**

**చిలుకూరు మండల కేంద్రంలో**

**బీఆర్ఎస్ నాయకులతో సమావేశం**



**చిలుకూరు, అక్టోబర్ 11 (తెలంగాణ పత్రిక) జిల్లా ప్రతినిధి భట్టు సంతోష్ తోళా నాయక్ :** ఖమ్మం వరంగల్‌నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను పార్టీ నాయకులు సమన్వయంతో చేపట్టాలని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం చిలుకూరు మండల కేంద్రంలో మండల పార్టీ నాయకులతో కలిసి పట్టభద్రుల ఓటరు నమోదు ప్రాధాన్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ.. ఓటరు నమోదు అనేది కేవలం ఒక ప్రక్రియ మాత్రమే కాదని, ప్రజాస్వామ్యంలో తమ హక్కులను వినియోగించుకోవడానికి, తమ అభిప్రాయాలను వ్యక్తపరచడానికి పట్టభద్రులకు లభించిన కీలకమైన అవకాశమని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలని సూచించారు. యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రైవేటు రంగంలో పనిచేస్తున్నవారు, వివిధ వృత్తుల్లో ఉన్న పట్టభద్రులు ఓటరు నమోదు విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. నిరుద్యోగ సమస్యలు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, విద్యారంగ సమస్యలు, ఉద్యోగుల హక్కులు, పట్టభద్రుల భవిష్యత్తుకు సంబంధించిన అంశాలపై ప్రజాస్వామ్య వేదికల్లో తమ అభిప్రాయాలను వినిపించేందుకు ఎన్నికల్లో చురుకుగా పాల్గొనడం అవసరమని తెలిపారు. గ్రామాల వారీగా, వార్డుల వారీగా అర్హులైన పట్టభద్రులను గుర్తించి, ఇప్పటికే ఓటరుగా నమోదైనవారిని, ఇంకా నమోదు కానివారిని వేర్వేరుగా గుర్తించాలని నాయకులకు సూచించారు. చివరి క్షణం వరకు వేచి చూడకుండా ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన వారు ఎవరూ మిగిలిపోకుండా సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. ఖమ్మంవరంగల్ నల్గొండ ఉమ్మడి జిల్లాల పరిధిలో కోదాడ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీ సాధించే లక్ష్యంతో పార్టీ శ్రేణులు పనిచేయాలని కోరారు. ప్రతి గ్రామంలో పట్టభద్రులను కలిసి, ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించి, నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని బాధ్యతగా చేపట్టి, అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే అవకాశంపై అవగాహన కల్పించాలని బొల్లం మల్లయ్య యాదవ్ పేర్కొన్నారు.

## దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణరావు దంపతులు



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి: (తెలంగాణ పత్రిక ) అక్టోబర్, 11:** జయశంకర్ భూపాలపల్లి నియోజక వర్గం గణపురం మండలంలోని బుద్ధారం గ్రామంలో శ్రీ పర్వత వర్ధిని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో దుర్గామాత దేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి పూజా కార్యక్రమంలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తన సతీమణి గండ్ర పద్మ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు దుర్గామాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గాంధారిలోఏటీఎం ధ్వంసం

భారీగా నగదు చోరీ



**కామారెడ్డి, అక్టోబర్ 11, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి నిజామాబాద్ జిల్లాలో ఇటీవల దొంగతనాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దొంగతనాలను అరికట్టడానికి జిల్లా పోలీసు ఉన్నత అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినప్పటికీ, వారి కళ్ళు కప్పి దొంగతనాలకు పాల్పడుతున్నారు. సులువుగా దొంగతనాలు చేయడానికి ఏటీఎంలను లక్ష్యంగా పెట్టుకున్నారు దొంగలు. ఇప్పటికే బిచ్కుంద, రుద్రూర్, పిట్లం మండల కేంద్రంలో ఏటీఎం లను ధ్వంసం చేసి పెద్ద ఎత్తున నగదుకు చోరీకి పాల్పడ్డ దొంగలను ఇప్పటివరకు పోలీసులు పాట్టుకోలేకపోయారు గాంధారి మండల కేంద్రంలోని ఏటీఎంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎంలో చొరబడి ధ్వంసం చేసి అందులోని నగదు దూసుకెళ్లినట్టు తెలిసింది. అర్ధరాత్రి సందర్భంగా ఆ ప్రాంతంలో ఎవరు లేకపోవడంతో ఈ చోరీ జరిగినట్టు స్థానికులు తెలిపారు.

## బతుకమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గండ్రసత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి:( తెలంగాణ పత్రిక) అక్టోబర్ 11:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం భూపాలపల్లి నియోజకవర్గంలోని శాయంపేట మండలం కొప్పుల గ్రామంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో సద్దుల బతుకమ్మ, దసరా పండుగలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి,ఐక్యతకు,ప్రకృతితో ముడిపడిన జీవన విధానానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. గ్రామాల్లో బతుకమ్మ విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించడం మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంలో భాగమని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న పండుగల విశిష్టతను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామాల్లో ప్రజలందరూ కలిసిమెలిసి, సుఖసంతోషాలతో ఉత్సవాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలను ఐకమత్యంతో నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఇట్టి కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలపై ఆందోళన

12 ఏళ్ల బాలిక కళ్యాణి మృతి ఘటనతో వైద్య సేవలపై చర్చ

సమగ్ర విచారణకు ప్రజల డిమాండ్



**సూర్యాపేట / అక్టోబర్ 10 / తెలంగాణ పత్రిక / జిల్లా ప్రతినిధి భట్టు సంతోష్ తోళా నాయక్ /:** హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో 12 ఏళ్ల బాలిక కళ్యాణి మృతి చెందిన ఘటన నేపథ్యంలో ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఘటనతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నిర్వహణ, సిబ్బంది కొరత, వైద్య పరీక్షల్లో జాప్యం వంటి అంశాలపై సమగ్ర పరిశీలన జరపాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. నిరుపేదలకు ప్రభుత్వ ఆసుపత్రులే ప్రధాన వైద్య ఆధారంగా ఉన్న నేపథ్యంలో, అక్కడ అవసరమైన వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉంచి సకాలంలో మెరుగైన వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు. వైద్య పరీక్షలు, చికిత్సలో జాప్యం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. కళ్యాణి మృతి ఘటనకు సంబంధించి వైద్య సేవల్లో ఏవైనా లోపాలు జరిగాయా అనే అంశంపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. బాధ్యుల నిర్లక్ష్యం నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు, అవసరమైన సిబ్బందిని నియమించి వైద్య సేవలను పటిష్ఠం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## యూసుఫ్ పేట ఈశ్వరాలయంలో ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

శ్రీబాలా త్రిపుర సుందరి దేవిగా దుర్గామాత




**పాపన్నపేట, అక్టోబర్ 11:(తెలంగాణ పత్రిక):** పాపన్నపేట మండల పరిధిలోని యూసుఫ్ పేట ఈశ్వరాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రారంభమయ్యాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శరన్నవరాత్రుల్లో మొదటి రోజు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే ఆలయ అర్చకులు రమేష్ శర్మ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు,అలంకరణ, గణపతి పూజ,కలశ స్థాపన శాస్త్రోక్తంగా నిర్వహించారు. దివ్యమైన అలంకారంలో దర్శనమిచ్చిన బాల త్రిపుర సుందరి దేవిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజులపాటు అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. భక్తులందరూ ఈపూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపా కటాక్షాలు పొందాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## అనుమతులు లేని పాఠశాలలపై, అక్రమాలకు పాల్పడుతున్న లిటిల్ స్కాలర్స్ లాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



**కామారెడ్డి ,అక్టోబర్ 11, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** అఖిల్ భారతీయ విద్యార్థి పరిషత్ కామారెడ్డి నగర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కామారెడ్డిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లిటిల్ స్కాలర్స్ పాఠశాలలో గత రెండు నెలల క్రిందట ఎంఈఓ సీజ్ చేసినటువంటి పుస్తకాల గదిని అనుమతి లేకుండా తెరిచారు అని గత కొద్ది రోజుల కిందట ఎంఈవో గారికి తెలియజేస్తే వారు నిమ్మకు నీరెత్తినట్టు వ్యరించడం సరైన పద్ధతి కాదు అలాగే అదే పాఠశాలకు చెందిన ఉద్యోగికి జీతం ఇవ్వట్లేదు అని విన్నవించుకున్న ఎవరు పాటింకోకపోవడం ఇది మోమటికి సిగ్గు చేటు అలగే నారాయణ పాఠశాలకు 9,10 వ తరగతులకు అనుమతులు లేకపోయినా ఎంఈఓ గారు ఇప్పటికీ వారి పై కఠిన చర్యలు తీసుకోకపోవడం వారికి ఎంత వాటా ఉన్నదో వారు తెలియజేయాలి మాకు ప్రభుత్వం పై నమ్మకంతో ఎన్నో వినతి పత్రాలు ఇచ్చిన వృధా అవుతున్నాయి కానీ న్యాయమైతే ఎక్కడ కనిపించడం లేదు కాబట్టి ఇప్పటికైనా కలెక్టర్ గారు చర్యలు తీసుకోవాలని తెలియజేస్తున్నాం ఈ కార్యక్రమంలో రాజశేఖర్, జయరాజ్, జీవన్,కార్తీక్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

## నవదుర్గ సేవా సమితి అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న మాజీ జెడ్పి చైర్ పర్సన్ దావసంత సురేష్



**జగిత్యాల అక్టోబర్ 11 (తెలంగాణ పత్రిక):** జగిత్యాల పట్టణంలో నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపు కార్యక్రమంలో నాయకులు భక్తులతో కలిసి జగిత్యాల జిల్లా మాజీ జడ్పి చైర్పర్సన్ దావ వసంత సురేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్ రావు ఆనంద్ రావు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం ప్రియాంక, అనురాధ గంగిపెల్లి వేణు మాధవ్ నవదుర్గ సేవ సమితి ట్రస్ట్ సభ్యులు భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక అక్టోబర్ 11:** అక్టోబర్ 12 వ తేదీ, సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని ఆయన సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ కార్యాలయం భద్రాచలం ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, అదేవిధంగా జిల్లాలోని అన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆయన అన్నారు. కావున ప్రజలు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## శ్రీ శరన్నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లింగారావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి



**కల్వకుర్తి ప్రతినిధి అక్టోబర్ 11 తెలంగాణ పత్రిక:** కల్వకుర్తి నియోజకవర్గం లో ఉన్న ప్రజలందరికీ అమ్మవారిదివ్య ఆశీస్సులతో మీకు, మీ కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఆ జగన్మాత దుర్గాదేవి కరుణాకటాక్షాలు అందరిపై ఉండాలని, ప్రతి ఇంటా సిరిసంపదలు, సంతోషాలు వెల్లివిరియాలని ప్రార్థిస్తూ... మీకు, మీ కుటుంబ సభ్యులకు శ్రీ శరన్నవరాత్రి శుభాకాంక్షలు! తెలిపారు తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగారావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి గారు

## నోబెల్ యూత్ అధ్యక్షులుగా నరేష్



**రేగోడు ,తెలంగాణ పత్రిక అక్టోబర్ 11 :** రేగోడు నోబుల్ యూత్ అధ్యక్షులుగా నరేష్ , ప్రధాన కార్యదర్శిగా వడ్ల సుమన్, ఉపాధ్యక్షులుగా సతీష్ , వీర ప్రసాద్, కోశాధికారిగా లక్ష్మీకాంత్ , జాయింట్ సెక్రటరీగా భోగశీ అనిల్ , ఆర్గనైజేషన్ సెక్రటరీగా రాజు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా శేఖర్, అడిషనల్ సెక్రటరీగా వంశి, ఈసీ నెంబర్లుగా సిద్ధప్ప, హరీష్, నవీన్, విజయ్, నవీన్ కుమార్, వంశీ, నిఖిల్, లీగల్ అడ్వైజర్ గా దుద్యాల జగదీష్ ఎన్నికయ్యారు, ఈ సందర్భంగా నోబుల్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన అధ్యక్షులు నరేష్ మాట్లాడుతూ సమాజ సేవ లక్ష్యంగా పనిచేస్తానని ఆయన అన్నారు.

# ఆమనగల్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలలో పాల్గొన్న ప్రముఖ సంఘ సేవకుడు

## ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు కౌన్సిలర్ పాపిశెట్టి రామన్న







**కల్వకుర్తి ప్రతినిధి అక్టోబర్ 11 తెలంగాణ పత్రిక:** ఆమనగల్ మున్సిపల్ పట్టణంలోని గాంధీ చౌక్ చౌరస్తా వద్ద శ్రీ దుర్గాభవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. మహిళలు సాంప్రదాయ వస్త్రధారణలో అందంగా ముస్తాబై, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ గుంపులుగా చేరి ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ పాటలు ఆలపిస్తూ, సంప్రదాయ నృత్యాలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. దీంతో గాంధీ చౌక్ పరిసరాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమానికి ప్రముఖ సంఘ సేవకుడుఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు కౌన్సిలర్ పాపి శెట్టి రామన్న పాల్గొన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు..

# రాహుల్ గాంధీ పిలుపు మేరకు 'చలో ఢిల్లీ'

ఓటు చోరీకి వ్యతిరేకంగా భద్రాద్రి జిల్లా యూత్ కాంగ్రెస్ చీకటి కార్తీక్ బృందం



**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక అక్టోబర్ 11:** రాహుల్ గాంధీ పిలుపు మేరకు చేపట్టిన 'చలో ఢిల్లీ' నిరసన కార్యక్రమానికి తెలంగాణ నలుమూలల నుండి యూత్ కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో ఢిల్లీకి తరలివచ్చారు. అందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్ ఆధ్వర్యంలో వారి బృందం ఆదివారం ఢిల్లీలోని యూత్ కాంగ్రెస్ కేంద్ర కార్యాలయం ఏఐసీసీ (ఏఐసీసీ) ప్రధాన కార్యాలయానికి చేరుకుంది. అక్కడ వారు జాతీయ నాయకులను కలిసి సంఘీభావం తెలపడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన గళం విప్పారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో యువత హక్కుల పరిరక్షణ కోసం, దేశ సమగ్రత కోసం భద్రాద్రి జిల్లా యూత్ కాంగ్రెస్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా కార్తీక్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో అసెంబ్లీ అధ్యక్షులు పాల సత్యనారాయణ రెడ్డి, ఎడారి ప్రదీప్, చెరుకుపల్లి నరేందర్, పాలకుర్తి సుమిత్, జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లి ప్రణయ్, మండల అధ్యక్షులు వంకుడోత్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన జగిత్యాల క్రీడాకారులు

అభినందించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



**జగిత్యాల, అక్టోబర్ 11 (తెలంగాణ పత్రిక):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని పొన్నాల గార్డెన్స్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్.జి.ఫ్ ) 202627 సంవత్సరానికి నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జగిత్యాల క్రీడాకారులను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అభినందించారు. జగిత్యాల కేలో ఇండియా బాక్సింగ్ సెంటర్‌కు చెందిన క్రీడాకారులు అండర్14, అండర్17 విభాగాల్లో రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపిక కావడం పట్ల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. క్రీడాకారులను అభినందిస్తూ రాష్ట్ర స్థాయి పోటీలలో కూడ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జగిత్యాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కోచ్ నవీన్ ను ఎమ్మెల్యే అభినందించారు. అండర్ 14 విభాగంలో సి హెచ్. గుణతేజ వి. మిధున్ అసిత్, ఇస్మాయిల్ అండర్17 విభాగంలో ఎల్. కార్తికేయ హృదయ్ సి హెచ్. శ్రీ వైష్ణవి కే. వాసవి ఎస్. స్వరాలి తదితర క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. క్రీడాకారులు కష్టపడి సాధన చేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఖేలో ఇండియా బాక్సింగ్ సెంటర్ ను అందరూ ఉపయోగించుకోవాలి అని చదువుతో పాటు శారీరక దారిద్యం ముఖ్యమే అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బాక్సింగ్ కోచ్ ఆరుముల పవన్ కేలో ఇండియా కోచ్ నల్ల నవీన్ జగిత్యాల సింగిల్ విండో చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాల ముకుందం మాజీ సర్పంచ్ మహేశ్వర్ రావు శరత్ రావు మహేందర్ రావు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్తు కోతలు ఎత్తివేయాలి

24 గంటల కరెంటు ఇచ్చి పంటలను కాపాడాలి

తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గునగంటి రాజన్న



**పాలకుర్తి/తొర్రూర్ (తెలంగాణ పత్రిక ప్రతినిధి పున్నం సారయ్య:** గ్రామాలలో విద్యుత్ కోతలను ఎత్తివేసి పంటలకు 24 గంటల కరెంటు ఇచ్చి రైతాంగాన్ని కాపాడాలని ,తెలంగాణ రైతు సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు గుణగంటి రాజన్న అన్నారు. ఆదివారం రోజు రైతు సంఘం తొర్రూర్ మండల కార్యాలయంలో మండల అధ్యక్షులు మట్టపల్లి కుమార్ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాజన్న హాజరై మాట్లాడుతూ, రాష్ట్రంలో వర్షపాతం తక్కువగా ఉండి రాష్ట్రంలో కరువు నెలకొంది. దీంతోపాటు ఎండలు తీవ్రంగా ఉన్నాయని, దీనివల్లరైతంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే మండలంలో కూడా కరువు పరిస్థితులు ఉన్నప్పటికీ గ్రామాలలో కరెంటు కోతలు ఉన్నటువంటి పరిస్థితుల్లో అనేక వరి పొలాలు ఎండుతున్నాయని, ఇంతకాలం కష్టం చేసి, పెట్టుబడి పెట్టినటువంటి రైతుకు పంటలు ఎండిపోవడం వల్ల రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని వారు సందర్భంగా అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కరెంటు కోతలను ఎత్తివేసి పంటలకు 24 గంటల కరెంటు ఇవ్వాలని వారు అన్నారు. దానితోపాటు ఎరువుల కొరత కూడా ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి రైతులు ఎరువుల కొరతను ఎదుర్కోవాల్సి వస్తుందనీ వారు అన్నారు. యూరియా యాప్ ద్వారా పూర్తిస్థాయిలో యూరియా రైతులకు అందడం లేదని దానివల్ల ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడ్డాయని వారు అన్నారు. వర్షభావం తక్కువగా ఉండటం వల్ల పంటలు పండడంలో కూడా ఇబ్బందులు ఉన్నాయని, ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలని అన్నారు. లేనియెడల తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులందరికనీ కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి బొల్లం అశోక్, తొర్రూరు మండల కార్యదర్శి కొత్త వెంకట్రెడ్డి, సోమిరెడ్డి, తాళ్ల వెంకటేశ్వర్లు గుద్దేటి సాయిమల్లు, నరేడ్ల జితేందర్ రెడ్డి, ఎండి మై పాషా, ఎండి షమీనా తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగం ద్వారా సమానత్వానికి మార్గదర్శి

బిజెపి మాజీ జగిత్యాల అసెంబ్లీ కన్వీనర్ సిరికొండ శ్రీనివాస్



**జగిత్యాల, అక్టోబర్ 11 (తెలంగాణ పత్రిక):** అంబేద్కర్ భావజాలాన్ని విస్తరించాలి డిక్కీ జిల్లా కో–ఆర్డినేటర్ నల్ల శ్యామ్ జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ కార్యవర్గ సభ్యుడు డిక్కీ జిల్లా కో–ఆర్డినేటర్ నల్ల శ్యామ్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న అంబేద్కర్ స్మరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి సిరికొండ శ్రీనివాస్ బిజెపి మాజీ జగిత్యాల అసెంబ్లీ కన్వీనర్ ముఖ్య అతిథిగా హాజరై పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంబేద్కర్ సేవలను స్మరించుకుంటూ ఆయన ఆలోచనలు ఆశయాలను సమాజంలో విస్తృతంగా వ్యాప్తి చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిరికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ డా: బాబాసాహెబ్ అంబేద్కర్ భారతదేశానికి అందించిన సేవలు అపారమైనవని అన్నారు. దేశంలోని బడుగు బలహీన వర్గాలకు సమాన హక్కులు కల్పించేందుకు ఆయన జీవితాంతం పోరాటం చేశారని పేర్కొన్నారు. భారత రాజ్యాంగాన్ని రూపకల్పన చేసి ప్రతి పౌరుడికి సమానత్వం స్వేచ్ఛ న్యాయం అందేలా మార్గం చూపిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చిత్తారి ప్రభాకర్ గిద్దె శంకర్ ప్రవీణ్ కుమార్ రుద్ర మనోహర్ కట్ట శ్రీనివాస్ ధూమాల గంగారాం బొల్లం ప్రభాకర్ కండ్ల లక్ష్మణ్ దాసన్న కమలాకర్ రాకేష్ సంకె మహేష్ దాసరి లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# 13న జుక్కల్‌లో ఎల్‌కెఆర్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు 2026




**కామారెడ్డి ,అక్టోబర్ 11,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ వేడుకలను కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం కేంద్రంలో ఈనెల 13న ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం గుంటూరు రోడ్డు లో బతుకమ్మ పోటీలను నిర్వహిస్తున్నాము వారు తెలిపారు. పోటీలలో పాల్గొనే మహిళలకు మొదటి బహుమతి 51,000, రెండో బహుమతి 25000, మూడో బహుమతి 11వేల రూపాయల నగరం అందజేస్తామని వారు తెలిపారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయ పండుగ బతుకమ్మ సంబరాల్లో మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు .

# జాతీయ స్థాయి ఎస్ జి ఎఫ్ ఉషు క్రీడా పోటీలకు కొత్తపల్లి పాఠశాల క్రీడాకారుడు ఎంపిక



**గంభీరావుపేట తెలంగాణ పత్రిక అక్టోబర్ 11:** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామా జెడ్ పి హెచ్ఎస్ పాఠశాల క్రీడాకారుడు బి. సాయి క్రిష్ణ ఎస్ జిఎఫ్ జాతీయ స్థాయి ఉషు క్రీడా పోటీలకు ఎంపిక అయ్యాడని పిఈటి బాను పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు ఆయన మాట్లాడుతూ గత నెల 27 న ఉమ్మడి కరీంనగర్ లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలలో బంగారు పథకం సాధించి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక అయ్యాడు అదే నెలలో 28, 29 జి హెచ్ ఎమ్ సి రెడ్ హిల్స్ నాంపల్లి క్రీడా మైదానం లో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో వెండి పథకం సాధించాడు. ఈ నెల 14 నుండి 18 వరకు జమ్మూకాశ్మీర్ లో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీలలో పాల్గొననున్న సాయి క్రిష్ణ ని డి వై ఎస్ ఓ అజ్మీరా రాందాస్, పాఠశాల హెచ్ ఎమ్ నారాయణ, పి ఈ టి బాను, ఎస్ జి ఎఫ్ కార్యదర్శి రవీందర్, ఉమ్మడి జిల్లా ఉషు కార్యదర్శి విద్య సాగర్, రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి సైమా అకాడమీ కోచ్ విక్రం, ఎమ్ఈ ఒ గంగారాం, సమ్మర్ క్యాంప్ ఫౌండర్ చేరాలా లహరిక –నిఖిల్ గౌడ్, కొత్తపల్లి గ్రామా సర్పంచ్ బాలరాజ్ గౌడ్, ఉప సర్పంచ్, మండల పి ఈ టి ల బృందం, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, గ్రామా ప్రజలు అభినందించారు

# దేవి శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం

మండపాల్లో కొలువుదీరిన అమ్మవారు

దుర్గ దేవికి ప్రత్యేక పూజలు చేసిన భక్తులు



**తానూర్:11అక్టోబర్(తెలంగాణ పత్రిక):** మండల వ్యాప్తంగా ఆదివారం దేవి శరన్నవరాత్రోత్సావాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు దుర్గామాత విగ్రహాలను శోభయాత్రగా తీసుకొచ్చి ప్రత్యేకంగా అలంకరించిన మండపాలో ప్రతిష్టించి వేదమంత్రాల మధ్య భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆయా మండప ప్రాంగణంలో విద్యుత్ కాంతులు మీరు మిట్లు గొలుపుతున్నాయి. ఆదివారం తొలి రోజు అమ్మవారు శ్రీ శైలపుత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కాగా దుర్గామాత మండపాల వద్ద భక్తులు భవాని దీక్షలు చేపట్టారు.



# ఇందిరమ్మ ఇండ్లకు స్లాబులు పూర్తి



**కామారెడ్డి అక్టోబర్ 11,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం సీతారాంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు ఆదివారం స్లాబ్లులూ వేయించామని సర్పంచ్ వెన్నెల బాను శ్రీ సిద్ధ రాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వామి మాజీ సర్పంచ్ నాంపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

# దుర్గ మాతకు పుస్తె మట్టెలు వితరణ



**కామారెడ్డి ,అక్టోబర్ 11,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం భూంపల్లి గ్రామంలోని హిందూ సేన యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టాపించిన దుర్గామాతను. పిఎసిఎస్ పద్మాజీ వాడి సొసైటీ డైరెక్టర్ రుస్తుం మౌనిక నవీన్ రావు పుస్తె మట్టలు వితరణ చేశారు ఈ కార్యక్రమంలో హిందూ యువజన సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా నిజం


# జాతీయ స్థాయి ఎస్‌జిఎఫ్ వూషూ పోటీలకు కరీంనగర్ జిల్లా క్రీడాకారుల ఎంపిక



**తెలంగాణ పత్రిక కరీంనగర్, అక్టోబర్ 11:** జమ్మూకాశ్మీర్‌లో ఈ నెల 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న ఎస్ జి ఎఫ్ జాతీయ స్థాయి వూషూ క్రీడా పోటీలకు కరీంనగర్ జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా ఎస్ జి ఎఫ్ కార్యదర్శి బన్సీలాల్ తెలిపారు. ఈ పోటీలకు సప్తగిరి ప్రభుత్వ పాఠశాల నుంచి శృతి, శాన్వి, డి ఫెన్స్ కళాశాల నుంచి చిట్టిబాబు, మైనారిటీ కళాశాల నుంచి రాంచరణ్ ఎంపికైనట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను బన్సీలాల్ అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని, తద్వారా కరీంనగర్ జిల్లాకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలని సూచించారు. జాతీయ స్థాయికి ఎంపిక కావడం జిల్లా క్రీడారంగానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీమా స్పోర్ట్స్ అకాడమీ కోచ్ బారా విద్యాసాగర్, మణి స్పోర్ట్స్ అకాడమీ కోచ్ మణి, మైనారిటీ కళాశాల వ్యాయామ ఉపాధ్యాయులు (రాజులు) పాల్గొని క్రీడాకారులను అభినందించారు. జాతీయ స్థాయి వూషూ పోటీల్లో పాల్గొంటున్న నలుగురు క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పతకాలతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

# జిల్లాల సంఖ్య పెరిగినా.. ప్రజల బతుకులు మారలే!

సిద్దిపేట జిల్లా ఏర్పాటును 2008లో హరీశ్ రావు అడ్డుకున్నారు

పీసీసీ కార్యదర్శి, నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి



**నంగునూరు, అక్టోబర్ 11(తెలంగాణ పత్రిక):** జిల్లాల సంఖ్య పెరిగినంత మాత్రాన ప్రజల జీవితాల్లో మార్పు రాదని, ప్రజల సమస్యలు పరిష్కారమైనప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పీసీసీ కార్యదర్శి, నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి అన్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణతో ప్రజలకు ఒరిగిందేమిటో బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ 2008లోనే సిద్దిపేట జిల్లా ఏర్పడాల్సి ఉందన్నారు. ఆనాటి ఉప ఎన్నికల సమయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జిల్లా ఏర్పాటుపై హామీ ఇస్తున్నారనే విషయం తెలుసుకున్న హరీశ్‌రావు, రాజకీయ ప్రయోజనాల కోసం ఆ ప్రక్రియను అడ్డుకున్నారని యాదగిరి ఆరోపించారు. కేవీపీ రామచంద్రరావును కలిసి, తాను కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత జిల్లా ఏర్పాటు చేయాలని అప్పట్లో అడ్డుకున్నారని విమర్శించారు. ఇప్పుడు జిల్లాల ఏర్పాటుపై హరీశ్‌రావు చేస్తున్న వ్యాఖ్యలు, విమర్శలు వింతగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. జిల్లాల ఏర్పాటు పరిపాలనా మార్పు మాత్రమేనని, గ్రామాల్లో రహదారులు, తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి రంగాల్లో ప్రజలకు ఎలాంటి ప్రయోజనాలు చేకూరాయో వాస్తవ గణాంకాలతో వెల్లడించాలని కోరారు. రైతులకు గిట్టుబాటు ధరలు, యువతకు ఉద్యోగాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందుతున్నాయా అనే ప్రశ్నలకు బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని అన్నారు. కొత్త కార్యాలయాలు ఏర్పాటు చేయడమే కాకుండా, అవసరమైన సిబ్బందిని నియమించి, ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించడమే సమర్థవంతమైన పాలనకు నిదర్శనమన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా, నాయకులు తమ ఆస్తులను పెంచుకున్నారని ఆరోపించారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణతో ప్రజలకు కలిగిన ప్రయోజనాలు, ఖర్చు చేసిన నిధులు, ఉపాధి, విద్యా, వైద్య రంగాల్లో వచ్చిన మార్పులపై సమగ్ర నివేదిక విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాగు శ్రీకాంత్, ఐలేని యాదగిరి గౌడ్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# దసరా సెలవుల్లో ఇళ్ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

ఇళ్ల భద్రతకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

ఖాళీగా ఉండే ఇళ్లలో దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు

ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్



**మెదక్ జిల్లాప్రతినిది (తెలంగాణ పత్రిక) అక్టోబర్ 11:** దసరా పండుగ సెలవుల నేపథ్యంలో ప్రజలు తమ స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు వెళ్లే సమయంలో ఖాళీగా ఉండే ఇళ్లలో దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, సూచించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ జిల్లా వ్యాప్తంగా పోలీస్ గస్తీని ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడు తూ, దసరా పండుగను దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లే ముందు తలుపులు, కిటికీలకు పటిష్టమైన తాళాలు వేయాలని, వెనుక తలుపులు, బాల్కనీలను కూడా తనిఖీ చేసుకోవాలని సూచించారు. బంగారు ఆభరణాలు, నగదు, ఇతర విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని కోరారు. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లే విషయాన్ని నమ్మకమైన పొరుగువారికి తెలియజేయడంతో పాటు, ఎక్కువ రోజుల పాటు ఇంట్లో ఎవరూ ఉండని సందర్భంలో స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు, భద్రతా అలారం వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో ముందుగానే తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ప్రయాణ వివరాలు, ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో బహిరంగంగా వెల్లడించవద్దని సూచించారు. ఇంటి తాళాలను బయట కనిపించే ప్రదేశాల్లో ఉంచకూడదని స్పష్టం చేశారు. ఇంటి నుంచి బయలుదేరే ముందు అవసరం లేని విద్యుత్ పరికరాలను ఆఫ్ చేయాలని, గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్‌ను మూసివేయాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు, కార్లను సురక్షితమైన ప్రదేశాల్లో పార్క్ చేసి, హ్యాండిల్ లాక్‌తో పాటు ఇతర భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు. దసరా సెలవుల సమయంలో ఇళ్లలో చోరీలు, ద్విచక్ర వాహనాల దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉంటుందని ఎస్పీ తెలిపారు. పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ సహాయం కోసం డయల్ 112కు ఫోన్ చేయాలని సూచించారు. దసరా పండుగ సెలవులను ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకోవడానికి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ నేరాల నివారణలో పోలీసులకు సహకరించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, విజ్ఞప్తి చేశారు.

# సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళ సోదరీ మణులకు చీరల పంపిణీ చేసిన బిజెపి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నారపాక అశోక్





**బీరుపూర్, అక్టోబర్ 11 (తెలంగాణ పత్రిక):** జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని మంగేళ గ్రామానికి చెందిన బీజేపీ ఎస్సీ మోర్చా జగిత్యాల జిల్లా అధ్యక్షుడు నారపాక అశోక్ తన స్వంత ఖర్చులతో సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ఆదివారం మహిళ సోదరీమణులకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తనకు జిల్లా స్థాయి పార్టీ బాధ్యతలు లభించిన సందర్భంగా గ్రామ ప్రజలతో పండుగ సంతోషాలను పంచుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టానని తెలిపారు. ఈ సందర్భంగా నారపాక అశోక్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాలతో జరుపుకుంటారని అన్నారు. అలాంటి పండుగ సందర్భంగా తన అక్కాచెల్లెళ్లకు చీరలు అందించడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని ఇది కేవలం చీరల పంపిణీ మాత్రమే కాదని తనను ఆదరించి ఆశీర్వదించి ఈ స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించిన ప్రజలతో ఆత్మీయతను పంచుకునే కార్యక్రమమని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచి ప్రజా సమస్యలపై స్పందిస్తూ ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటూ తాను రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నానని అశోక్ తెలిపారు. గ్రామం మండలం జిల్లా స్థాయిలో ప్రజలు చూపిన ఆదరాభిమానాలు కార్యకర్తలు అందించిన సహకారం పెద్దల ఆశీర్వాదాలు తన ఎదుగుదలకు పునాదిగా నిలిచాయని అన్నారు. ప్రస్తుతం బీజేపీ ఎస్సీ మోర్చా జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించే అవకాశం రావడం తనకు గౌరవంతో పాటు మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎస్సీ సమాజంలోని పేదలు యువత మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు చేరేలా అవగాహన కల్పించడంతో పాటు ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారపాక దివ్య అశోక్, అద్వైత నారపాక, నారపాక లక్ష్మణ్ మోతె రాజేష్ దాసరి వెంకటేష్ నారపాక హరీష్ మోతె వంశీ దాసరి వినోద్ దాసరి విష్ణు మహిళలు సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

# మండపాలల్లో కొలువుదీరిన దుర్గమాత తల్లి

నేడే దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం

దుర్గ దేవికి ప్రత్యేక పూజలు చేసిన భక్తులు





**గంభీరావుపేట తెలంగాణ పత్రిక అక్టోబర్ 11:** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల వ్యాప్తంగా ఆదివారం దేవి శరన్నవరాత్రోత్సావాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు దుర్గామాత విగ్రహాలను శోభయాత్రగా తీసుకొచ్చి ప్రత్యేకంగా అలంకరించిన మండపాలలో ప్రతిష్టించి వేదమంత్రాల మధ్య భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆయా మండప ప్రాంగణంలో విద్యుత్ కాంతులు మీరు మిట్లు గొలుపుతున్నాయి. ఆదివారం తొలి రోజు అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు కాగా దుర్గామాత మండపాల వద్ద భక్తులు భవాని దీక్షలు చేపట్టారు.

# పట్టభద్రుల ఓటరు నమోదు వేగవంతం చేయాలి

బెక్కం జనార్ధన్



**జగిత్యాల, అక్టోబర్ 11 (తెలంగాణ పత్రిక):** జనగామ జిల్లాలోని జనసేన పార్టీ స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో నియోజకవర్గ పీవోసీలతో జనసేన పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ కో–ఆర్డినేటర్ బెక్కం జనార్ధన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించిన జనసేన పార్టీ ఫామ్ 18 క్యూఆర్ కోడ్ ను ఆవిష్కరించారు. అనంతరం పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై నాయకులతో చర్చించి నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎన్రోల్మెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడ చేపట్టారు.

# బతుకమ్మ ...బతుకమ్మ.. ఉయ్యాలో

వాడవాడలో బతుకమ్మ సంబరాలు

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు, దాండియాలు



**ముధోల్:11అక్టోబర్(తెలంగాణ పత్రిక):** మండల కేంద్రమైన ముధోల్ తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మ హిళలు ఆదివారం బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. మ హిళలంతా ఒకచోటికి చేరి ఉదయాన్నే తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ఉంచి బతుకమ్మ.. బతుకమ్మ.. ఉ య్యాలో ..బంగారు గౌరమ్మ.. ఉయ్యా లో అని ఉయ్యాల పాటలతో మహిళ లు బతుకమ్మను ఆడారు. ఈ సందర్భంగా బతుకమ్మ ఎత్తుకొని ఆయా ప్రధాన వీధుల గుండా దాండియాలు, కోలాటలు ఆడుతూ, పాటలను పాడు తూ ఊరేగింపుగా స్థానిక చెరువుల వద్ద వెళ్లి బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అనంతరం మహిళలు ఒకరినొ కరు వాయినాళాలను ఇచ్చి పుచ్చుకొని సహపంక్తి భోజనాలు చేశారు.

# భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఊరేగింపులు

మహిళల కోలాటాలు.. మంగళహారతులు..

సాంస్కృతిక నృత్యాలతో మార్మోగిన పల్లెలు





**నంగునూరు, అక్టోబర్ 11(తెలంగాణ పత్రిక):** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని నంగునూరు,సిద్ధన్నపేట, గట్ల మల్యాల, పాలమాకుల రాజగోపాలపేట, నర్మెట అంక్షాపూర్, కొనాయిపల్లి, బద్దిపడగ, మగ్దుంపూర్, రాంపూర్, అక్కెనపల్లి, ఖాతా, ఘనపురం, ఖానాపూర్, వెంకటాపూర్, మైసంపల్లి, అప్పలాయ చెరువు, దర్గపల్లి, కొండం రాజు పల్లి, జేపీ తండా, సంతోషనగర్ సీతారాం పల్లి తదితర భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారి ఊరేగింపులతో పల్లెల్లో పండుగ శోభ సంతరించుకుంది. భక్తుల జయజయధ్వానాలు, అమ్మవారి నామస్మరణలతో గ్రామ వీధులు మార్మోగాయి. సంప్రదాయ దుస్తుల్లో మహిళల కోలాటాలు అమ్మవారి ఊరేగింపులో మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి కోలాటాలు ఆడుతూ సందడి చేశారు. గ్రామ పురవీధుల్లోకి అమ్మవారి ఊరేగింపు చేరుకోగానే మహిళలు మంగళ హారతులు ఇచ్చి, కొబ్బరి కాయలు సమర్పించి భక్తితో స్వాగతం పలికారు. భక్తిపాటలు ఆలపిస్తూ అమ్మవారిని దర్శించుకున్నారు. తమ మొక్కులు చెల్లించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందారు. యువతీ యువకులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తుల సందడి, మహిళల ఆటపాటలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. ఐక్యతకు ప్రతీకగా నవరాత్రి వేడుకలు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలకే పరిమితం కాకుండా గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయి. మహిళల కోలాటాలు, మంగళహారతులు, భక్తి గీతాలు తరతరాలుగా వస్తున్న సాంస్కృతిక వారసత్వాన్ని చాటుతున్నాయి. ఉత్సవాల నిర్వహణ గ్రామస్థుల మధ్య ఐక్యతను, పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేస్తోంది. సంప్రదాయ పద్ధతుల్లో నిర్వహించిన అమ్మవారి ఊరేగింపులు గ్రామస్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. లోకకల్యాణం, గ్రామాల అభివృద్ధి, ప్రజల సుఖసంతోషాలు కలగాలని భక్తులు అమ్మవారిని ప్రార్థించారు. మహిళల కోలాటాలు, యువత సాంస్కృతిక ప్రదర్శనలు, భక్తుల నామస్మరణల నడుమ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిమయ వాతావరణంలో కొనసాగుతున్నాయి.

# మాజీ సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



**పాలకుర్తి అక్టోబర్11 (తెలంగాణ పత్రిక):** జనగామ జిల్లా ఆవిర్భావానికి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పాలకుర్తి మండల కేంద్రంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి బైక్ ర్యాలీ ప్రారంభించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు. కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు అనంతరం జనగామ జిల్లాకు బైక్ ర్యాలీ ద్వారా బయలుదేరి వెళ్లారు.

# జాతీయ పారా క్రికెట్ టోర్నమెంట్‌కు మండలవాసి ఎంపిక

తెలంగాణ జట్టు తరపున రాథోడ్ ఉదయ్ కుమార్ ప్రాతినిధ్యం



**తానూర్:11అక్టోబర్(తెలంగాణ పత్రిక):** మండలంలోని ఝరి-(బి) గ్రామానికి చెందిన రాథోడ్ ఉదయ్ కుమార్ జాతీయ పారా క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 23 నుంచి విజయ వాడలో ప్రారంభం కానున్న పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున ఆయనప్రాతినిధ్యం వహించనున్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. శారీరక వైకల్యాన్ని అధిగమించి, తన ప్రతిభతో రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించుకోవడం అతని పట్టుదలకు నిదర్శనం అన్నారు. జాతీయ స్థాయిలో రాణించాలని గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు అభినందనలు తెలిపారు

RNI No. APTEL/2008/23088
తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా విజన్
Epaper.Telanganapatrika.in
సోమవారం
అక్టోబర్ 12, 2026
కరీంనగర్



# ఎర్రజెండా తోనే ప్రజల సమస్యలు పరిష్కారం





**కార్పొరేట్ శక్తులను పెంచి పోషిస్తున్న కేంద్ర ప్రభుత్వం**

**తాళ్లపల్లి ఎంకన్న ప్రథమ వర్ధంతి**

**పురస్కరించుకొని జెండా ఆవిష్కరించి**

**నివాళులర్పించిన సిపిఎం**

**పాలకుర్తి అక్టోబర్11(తెలంగాణ పత్రిక):** దేశంలో రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఎర్రజెంతోనే పరిష్కారం అవుతాయని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న మండల కార్యదర్శి మాచర్ల సారయ్య అన్నారు. ఆదివారం పాలకుర్తి మండలంలోని దర్ద పల్లి గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన తాళ్లపల్లి వెంకన్న ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని వారి స్థూపం దగ్గర సిపిఎం జెండాను ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ వెంకన్న పార్టీ అనుబంధ సంఘం రైతు సంఘం లో చురుకుగా పాల్గొని వారని, పార్టీ నిబంధనలకు కట్టుబడి ఉన్న నాయకుడు అతి చిన్న వయసులో చనిపోవడం బాధాకరమని. పార్టీ నిర్మాణానికి చాలా కృషి చేసేవారని ఏ బాధ్యత అప్పగించిన బాధ్యతగా నిర్వహిస్తూ ఉండేవారని అన్నారు. 2004 నాటి కేంద్ర ప్రభుత్వ సహాయం లో వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ, సమాచార హక్కు చట్టం 2005లో తేవడంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకమైందని, కార్మికులు రైతులు విద్యార్థి యువజన గిరిజన మహిళ హక్కుల కోసం నిరంతరం పోరాడుతుంది సిపిఎం అని స్పష్టం చేశారు, కార్మిక వర్గంపై పెరుగుతున్న పని గంటల పెంపు శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు, భారతదేశంలో కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు, కేంద్ర ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి మతతత్వం. కులతత్వం పెరిగిందని మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆర్ఎస్ఎస్ విధానాలతో దేశాన్ని వెనక్కి నేడుతుందని, ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీరం చేసి దాని స్థానంలో విబిజి గ్రాంజి పథకాన్ని తీసుకువచ్చి గ్రామీణ పేదలను తీవ్ర అన్యాయానికి గురి చేసిందని, రైతుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, రైతు వ్యతిరేక విత్తన విద్యుత్ సవరణ చట్టం పత్తి పంటపై ఉన్న ధీమతి సుంకాలను ఎత్తివేసి విదేశీయుల పత్తికి రెడ్ కార్పొరేట్ పరచడం, కనీస గిట్టుబాటు ధరల చట్టం తీసుకురాలేకపోవడం పంటల బీమా పథకాన్ని రైతులకు అనుకూలంగా మార్చకపోవడం దేశవ్యాప్తంగా రుణ విమోచన చట్టాన్ని తీసుకురావడంలో నిర్లక్ష్యం వ్యవహరిచడం, రైతులను కేవలం ఓట్ల కోసమే ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సోమసత్యం, ఏదునూరి మదార్, మూస్కు ఇంద్రారెడ్డి,బెల్లి సంపత్, సీనియర్ నాయకులు సోమ అశోక్ బాబు, వేల్పుల కొమురయ్య, తోటరాజు, నిమ్మల పెద్దపురం, సాంబాజి, ఓగ్గుల కొమురయ్య, వారి కుటుంబ సభ్యులు తాళ్ల పెల్లి కుమారస్వామి, ఉప సర్పంచ్ బాలవేణి సోమయ్య, గిరగాని నరసయ్య, చిట్యాల మధు, గడ్డి రామచంద్రం, గబ్బెట శ్రీనివాస్, పూజారి రాజయ్య, తాళ్ల పెల్లి రాజు, తాళ్ల పెల్లి మదర్, దుంపల శ్రీను, పి యాకయ్య, వేల్పుల సోమ నరసయ్య, జి కృష్ణ, తాడం వీరన్న, తో పాటు వారి కుటుంబ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు!

**బ్రాహ్మణపల్లి చెక్‌పోస్ట్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు**



**మంగపేట, అక్టోబర్ 11 (తెలంగాణ పత్రిక):** రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణాల రక్షణే లక్ష్యంగా బ్రాహ్మణపల్లి చెక్‌పోస్ట్ వద్ద ఎస్సై టీవీఆర్ సూరి ఆధ్వర్యంలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులను తనిఖీ చేయడంతో పాటు, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల వాహనదారుల ప్రాణాలతో పాటు రహదారిపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం పొంచి ఉంటుందని పోలీసులు హెచ్చరించారు. దసరా పండుగ సందర్భంగా ప్రయాణాలు చేసేవారు రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వాహనదారులు బాధ్యతగా వ్యవహరిస్తూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రయాణాలను సురక్షితంగా సాగించాలని పోలీసులు కోరారు.

## కామారెడ్డి జిల్లా పదేళ్ల ప్రస్థానం చరిత్రలో నిలిచిపోతుంది

**కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్**



**కామారెడ్డి, అక్టోబర్ 11,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** భారత రాష్ట్ర సమితి టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం కామారెడ్డి జిల్లా ఏర్పాటు జరిగి పది సంవత్సరాలు అయిన సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఇంటి వద్ద దశాబ్ది ఉత్సవాల సభను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సభను ఉద్దేశించి కామారెడ్డి మాజీ శాసనసభ్యులు గంప గోవర్ధన్ మాట్లాడుతూ... 14 ఏళ్ల సుదీర్ఘ తెలంగాణ ఉద్యమంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా, తెలంగాణ ప్రజల ఆకాంక్షే తన లక్ష్యంగా ముందుకు సాగి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు దశాబ్దాల తెలంగాణ ప్రజల కలను సాకారం చేసిన అనంతరం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, పరిపాలన వికేంద్రీకరణ, ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ఆయన ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. ఆ చారిత్రాత్మక నిర్ణయంలో భాగంగా కామారెడ్డికి జిల్లా కేంద్రం హోదా లభించింది. కామారెడ్డి జిల్లా కేంద్రంగా ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా 'కామారెడ్డి జిల్లా పదేళ్ల పండుగ' కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కామారెడ్డి మాజీ శాసనసభ్యులు ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గులాబీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగాస్త్ర కామారెడ్డిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయడంలో కేసీఆర్ చూపిన దూరదృష్టిని, ఈ ప్రాంత అభివృద్ధి పట్ల ఆయన తీసుకున్న నిర్ణయాలను స్మరించుకున్నారు. ఒక ప్రాంతం జిల్లా కేంద్రంగా అవతరించడం అంటే కేవలం పరిపాలనా హోదా పొందడం మాత్రమే కాదు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు చేరువ కావడం, పరిపాలనా సేవలు అందుబాటులోకి రావడం, ప్రాంతీయ అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడటం, స్థానిక ప్రజల ఆకాంక్షలకు గుర్తింపు లభించడం కూడా. కామారెడ్డి జిల్లా ఏర్పాటు ఈ ప్రాంత చరిత్రలో అలాంటి ఒక కీలక మైలురాయిగా నిలిచింది. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ గారు మాట్లాడుతూ కామారెడ్డిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసి, ఈ ప్రాంత అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేసిన కేసీఆర్ కృషి చిరస్మరణీయం. జిల్లా ఏర్పాటు వెనుక ఆయనకున్న దూరదృష్టి, ప్రజలకు మెరుగైన పరిపాలన అందించాలనే సంకల్పం ఎంతో గొప్పవి. కామారెడ్డి జిల్లా ఉన్నంతకాలం జిల్లా చరిత్రలో కేసీఆర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ మాజీ శాసనసభ్యులు హనుమంత్ షిండే బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎంకే ముజీబుద్దిన్ కామారెడ్డి మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ కుమార్ మాచారెడ్డి మాజీ జెడ్పిటిసి మిల్కారి రామ్ రెడ్డి కామారెడ్డి పట్టణ అధ్యక్షులు జూకంటి ప్రభాకర్ రెడ్డి కామారెడ్డి మండల ప్రధాన కార్యదర్శి బలరాజ్ పాల్వంచ మండల అధ్యక్షుడు రాజా గౌడ్ మాచారెడ్డి మండల అధ్యక్షుడు బాలచంద్రం దోమకొండ మండల ప్రధాన కార్యదర్శి బొమ్మెర శ్రీనివాస్ రాజంపేట మండల అధ్యక్షులు బలవంతరావు బిక్నూర్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ కామారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కుంబాల రవి యాదవ్ బిఆర్ఎస్ పట్టణ యూత్ అధ్యక్షులు చెలిమెల భాను ప్రసాద్ కౌన్సిలర్లు మామిళ్ల లక్ష్మణ్ ఎజాస్ గరిగంటి స్వప్న బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పోలీస్ కృష్ణాజి రావు జెర్సీ నర్సింలు మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

## నామినేటెడ్ పదవుల్లో ముదిరాజులకు ప్రాధాన్యం ఇవ్వాలి

**డాక్టర్ బట్టు విఠల్ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు**



**కామారెడ్డి ,అక్టోబర్ 11, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి జిల్లాఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఆదివారం ఎల్లారెడ్డి ముదిరాజ్ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు దుద్దుల సాయిరాం అధ్యక్షతన ముదిరాజ్ సంఘం సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు బట్టు విట్టల్ ముదిరాజ్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ముదిరాజులు అనుగదొక్కే ప్రయత్నం చేస్తున్నాయని ముదిరాజులకు నామినేటెడ్ పోస్టుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అదిక జనాభా కలిగిన ముదిరాజ్ సామాజిక వర్గానికి నామినేటెడ్ పదవుల్లో రాజకీయ పార్టీలు అలసత్వం వహిస్తున్నాయని రాజకీయ పార్టీలకు తమ ధోరణి మార్చు కోవాలని లేని పరిస్థితిలో ముదిరాజులు రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెప్తారాని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు గుర్తించి సొసైటీ చైర్మన్ లు కానీ మండల అధ్యక్షులు కానీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు ముదిరాజులను నియమించాలని ఆయా పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ముదిరాజులకు నామినేటెడ్ పదవులు ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని రాజకీయ పార్టీలను హెచ్చరించారు. అధికార పార్టీ నాయకులు చొరవ చూపించి నామినేట్ పదవుల్లో ముదిరాజులకు అవకాశం కల్పించాలని లేనిపక్షంలో రాబోయే రోజుల్లో మేమేంటో సత్తా చూపిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. కామారెడ్డి జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో మండల స్థాయి నామినేటెడ్ పోస్టులు కానీ జిల్లాస్థాయి పోస్టులు కానీ ఇవ్వటం లేదని ఆయా రాజకీయ పార్టీలు ముదిరాజులను అనగాదొక్కే ప్రయత్నం చేస్తున్నాయని ముదిరాజ్ లపై రాజకీయ కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. ముదిరాజులపై కుట్ర చేస్తున్న రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చెప్తామని అన్నారు. ఈ సమావేశంలో మాజీ సొసైటీ చైర్మన్ ఎగుల నర్సింహులు, జక్కుల సంతోష్ కుమార్, మర్రి బాలకిషన్, మర్రి ప్రకాష్,గంట సాయిలు,భాస్కర్, ప్రవీణ్,క్యాస కిష్టయ్య,కన్నెబొయిన రాజు,గౌనె మహేందర్, జక్కుల అశోక్, పరంధాములు, సాయిలు,నిల రవి తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో శరన్నవరాత్రి శోభ

**జీఎం కార్యాలయంలో ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో వేడుకలు**



**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక అక్టోబర్ 11:** సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని గనులు, ఓ పెన్‌కాస్ట్ ప్రాజెక్టులు, వివిధ డిపార్ట్‌మెంట్లలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో జీఎం సీహెచ్ వెంకటరమణ దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కార్మికులు, అధికారులు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించనున్నారు. ఆయా గనులు, కార్యాలయాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా జీఎం సీహెచ్ వెంకటరమణ మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో సింగరేణి సంస్థ అభివృద్ధి చెందాలని, కార్మికులు, అధికారులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాలను అందరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం గోవిందరావు, ఏరియా ఇంజనీర్ రామకృష్ణ, డీజీఎం సివిల్ రామకృష్ణ, మజ్జి మురళి, కమిటీ సభ్యులు సాగర్ ,రామకృష్ణ ,వినయ్ చంద్రావతి, భరత్, రామ్ చందర్ తదితరులు ఉన్నారు.

## కామారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం నూతన అధ్యక్షుడు సిరిగల లక్ష్మీ నరసింహులుకు ఘన సన్మానం

**కామారెడ్డి, అక్టోబర్ 11, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ సభలో జిల్లా పద్మశాలి సంఘం నూతన అధ్యక్షులుగా ఎన్నికైన శ్రీ సిరిగల లక్ష్మి నరసింహులు ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు సిరిగల లక్ష్మి నరసింహులు కి శుభాకాంక్షలు తెలియజేస్తూ, పద్మశాలి సంఘం అభివృద్ధికి, సంఘ సభ్యుల ఐక్యతకు, సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు నూతన కార్యవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రమాణ స్వీకార మహోత్సవం, విజయోత్సవ సభలో, కామారెడ్డి పట్టణ పద్మశాలి అధ్యక్షులు సబ్బాని హరికృష్ణ,కామారెడ్డి జిల్లా సేవాదళ్ అధ్యక్షులు మున్సిపల్ కౌన్సిలర్ గడ్డమీది మహేష్,డిసిసి ఉపాధ్యక్షులు పంపరి లక్ష్మణ్,మాజీ కౌన్సిలర్ పంపరి శ్రీనివాస్,సంఘ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అలంకరణలో చండిక అమ్మవారు



**పాలకుర్తి, అక్టోబర్ 11(తెలంగాణ పత్రిక):** శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉత్సవాల్లో మొదటిరోజు శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అలంకరణలో చండి అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు అమ్మవారికి పంచామృత అభిషేకం,కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న, ఆలయ అర్చకులు,సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం రెండింటికి సమ ప్రాధాన్యత

**రాష్ట మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**ఖమ్మం ప్రతినిధి అక్టోబర్ 10 (తెలంగాణ పత్రిక):** అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇచ్చి పాలన సాగిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి పాలేరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏదులాపురం మునిసిపాలిటీ 23 వ వార్డులో 2 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న గిరిజన భవనం, కూసుమంచి మండలం మంగళితాండ నుండి దుబ్బబండ వరకు రూ. 163.14 లక్షల వ్యయంతో చేపట్టనున్న బిటీ రోడ్డు, జుజ్జుల్ రావు పేట గ్రామంలో రూ. 45 లక్షల వ్యయంతో నిర్మించనున్న 100కేఎల్ ఓ హెచ్ఎస్ఆర్, పైప్ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. మంగళితాండ గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. కూసుమంచి మంత్రి క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన 30 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు మంత్రి చెక్కుల పంపిణీ చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాల లబ్ధి చేకూరుస్తూ, మెరుగైన పాలన అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత కరెంట్, సన్నబియ్యం పంపిణీతో పాటు పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని స్పష్టం చేశారు. ప్రస్తుత కాలంలో ఎల్నినో కారణంగా దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా తాగునీరు, కరెంట్ సమస్య తీవ్రంగా ఎదురవుతుందని, ప్రమాదం అంచున ఉన్నామని తెలిపారు. ముఖ్యంగా విద్యుత్ కొరత వల్ల రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కరంట్ ను యూనిట్ కి 15 రూపాయలు పెట్టి కొనాలన్నా, ఏ ప్లాట్ ఫామ్ లోనూ కరంట్ అందుబాటులో లేదన్నారు. రైతన్నలు ఇబ్బంది పడకుండా, ప్రజా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, మొదటి పంటను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కరెంట్ సాగునీరు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రైతులు రెండవ పంట వెయ్యొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, విద్యాశాఖ ఈఈ బుగ్గయ్య, మిషన్ భగీరథ ఈఈ వాణిశ్రీ, హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఏదలాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, కూసుమంచి మండల తహశీల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లంతకుంటలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



**ఇల్లంతకుంట, అక్టోబర్ 10 తెలంగాణ పత్రిక:** ఇల్లంతకుంట మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో హిందూ వాహిని ఉత్సవ సమితి ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మొదటి రోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ సమితి అధ్యక్షులు ఎర్రోజు సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమం అనంతరం విగ్రహ దాతలైన గ్రీన్ వింగ్స్ యూత్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మామిడి రాజు, ఉప సర్పంచ్ మూగు నాగరాజు శర్మ , వార్డు సభ్యులు, హిందు వాహిని ఉత్సవ సమితి సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.



తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక


## పాఠశాల మౌలిక సదుపాయాలకై ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ చేయూత



**మందమర్రి మండలం (రామకృష్ణాపూర్) తెలంగాణ పత్రిక:** రామకృష్ణాపూర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదివేల రూపాయలను పాఠశాల మౌలిక సదుపాయాల కొరకు అందజేశారు. పాఠశాలలో గత సంవత్సరం 50 మంది విద్యార్థులు ఉండగా ఈ సంవత్సరం వారి సంఖ్య 128 కి చేరింది. అలాగే 17 మంది బాలికలు చేరినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. అయితే మరి కొంతమంది దాతలు విద్యార్థుల మౌలిక వసతులను మెరుగుపరచడానికి తమ వంతు సహాయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుంకరి మల్లేష్ గౌరవ అధ్యక్షుడు సంపత్ సభ్యులు అల్లం కుమార్ కలవల సంపత్ శరత్ బాబు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యం.. ఎమ్మెల్యే బిఎల్ఆర్



**మిర్యాలగూడ ప్రతినిధి, అక్టోబర్ 11:(తెలంగాణ పత్రిక):** రైతులకు నిరంతరంగా 24 గంటలు విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మిర్యాలగూడ మండలం యాద్గార్ పల్లి గ్రామంలో సుమారు రూ.కోటి వ్యయంతో చేపట్టనున్న త్రీఫేస్ విద్యుత్ లైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించాలనే లక్ష్యంతో గ్రామంలో త్రీఫేస్ విద్యుత్ లైన్‌కు సంబంధించిన స్తంభాలను ఏర్పాటు చేసి, విద్యుత్ మౌలిక సదుపాయాలను మెరుగుపరచనున్నట్లు తెలిపారు. ఈ పనుల ద్వారా రైతులకు వ్యవసాయ అవసరాల నిమిత్తం 24 గంటల విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రైతులకు సాగునీటి సౌకర్యంతో పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడం ద్వారా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జోన్నలగడ్డ శ్రీనివాస్ రెడ్డి , సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్ రెడ్డి, మెహబూబ్ అలీ , తలకొప్పుల సైదులు, గ్రామస్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా దుర్గమ్మ ఆగమనం

గ్రామాల్లో కొలువుదీరిన దుర్గామాతలు

బాల త్రిపుర రూపంలో అమ్మవారి దర్శనం, దుర్గమ్మా.. కరుణించమ్మా..



**పెద్దపల్లి, ప్రతినిధి 11అక్టోబర్(తెలంగాణ పత్రిక):** జిల్లాలో దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణాలు, పల్లెలు అనే తేడాలేకుండా భారీ సెట్టింగులతో మండపాలు ఏర్పాటు చేసి దుర్గమ్మ విగ్రహాలను భక్తులు కొలువుదీర్చారు సీతానగర్ శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దుర్గామాత విగ్రహాన్ని పూలతో అందంగా అలంకరించిన పట్టణ పురవీ ధుల గుండా ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. పసుపు చీరలో సింహవాహనంపై కొలువుదీరిన దుర్గమ్మ విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి రాకతో పట్టణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొనగా, యువకులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వాగతం పలికారు. నవరాత్రి ఉత్సవాల ప్రారంభంతో పట్టణంలో పండుగ వాతా వరణం నెలకొంది. బాలా త్రిపురసుందరి.. బుద్ధిని ప్రసాదించే జగజ్జనని.. ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు ఆదివారం ఆధ్యాత్మిక వైభవంతో తెరలేచింది. తొలిరోజు కనకదుర్గమ్మ బాలా త్రిపురసుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఓ చేతిలో అక్షరమాల.. మరో చేతిలో పుస్తకం.. అభయ, వరద హస్తాలతో అనుగ్రహిస్తున్న అమ్మవారి దివ్యమంగళ రూపం భక్తులను పరవశింపజేసింది. తెల్లవారుజాము నుంచే కొండపైకి భక్తుల రాక మొదలై.. ఉదయం దర్శనాలు ప్రారంభమైన తర్వాత క్యూలైన్లు కిక్కిరిశాయి. కుంకుమార్చనలు, బాలాసుహాసిని పూజలు, ప్రత్యేక ఆరాధనలతో ఆలయ ప్రాంగణం భక్తిభావంతో నిండిపోయింది. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శక్తిస్వరూపిణి అమ్మవారి నవరాత్రులు

● తొమ్మిది రోజులు.. తొమ్మిది అవతారాలు! ● భక్తిశ్రద్ధలతో దేవీ ఆరాధన.. విశిష్ట అలంకరణలు ● సంప్రదాయ నైవేద్యాలతో ఆధ్యాత్మిక వైభవం



బ్రహ్మచారిణి దేవి అవతారం



శైలపుత్రి అవతారం



బ్రహ్మచారిణి దేవి అవతారం



చంద్రఘంటా దేవి అవతారం



కూష్మాండ దేవి అవతారం

**నంగునూరు, అక్టోబరు 11 (తెలంగాణ పత్రిక):** శరన్నవరాత్రులు వచ్చాయంటే పల్లెలు, పట్టణాలు భక్తిశ్రద్ధలతో కళకళలాడుతాయి. ఆలయాలు విద్యుద్దీపాల కాంతులతో మెరిసిపోతాయి. పూల అలంకరణలు, మంగళవాయిద్యాలు, భజనలు, ప్రత్యేక పూజలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది. తొమ్మిది రోజులపాటు అమ్మవారిని వివిధ రూపాల్లో ఆరాధించడం ఈ పర్వదినాల ప్రత్యేకత. శక్తి, సంపద, విద్య, ధైర్యం, జ్ఞానం ప్రసాదించాలని భక్తులు జగన్మాతను ప్రార్థిస్తారు. దుర్గాదేవి, లక్ష్మీదేవి, సరస్వతీదేవి రూపాల్లో ఆదిశక్తిని కొలుస్తూ జరుపుకునే ఈ ఉత్సవాలు చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తాయి. భక్తి, ఆధ్యాత్మికతతోపాటు మహిళల గౌరవం, సేవాభావం, సామాజిక సమానత్వం వంటి విలువలను నవరాత్రులు చాటిచెబుతాయి.

**తొమ్మిది రోజులు.. అమ్మవారి తొమ్మిది రూపాలు**

దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు ఆదివారం వాడవాడలా ఘనంగా ప్రారంభం అయ్యాయి. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో కొలుస్తారు.

**మొదటి రోజు శైలపుత్రి దేవి**

హిమవంతుని కుమార్తెగా ప్రసిద్ధి చెందిన శైలపుత్రి దేవి ప్రకృతి శక్తికి, స్థిరత్వానికి ప్రతీక. ఎద్దుపై ఆసీనురాలై త్రిశూలం, కమలాన్ని ధరించిన రూపంలో దర్శనమిస్తుంది. భక్తులు పసుపు లేదా ఎరుపు రంగు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించి, నెయ్యిని నైవేద్యంగా సమర్పించే సంప్రదాయాన్ని కొన్ని ప్రాంతాల్లో పాటిస్తారు.

**రెండో రోజు బ్రహ్మచారిణి దేవి**

తపస్సు, సహనం, పట్టుదలకు ప్రతిరూపమైన బ్రహ్మచారిణి దేవి చేతిలో జపమాల, కమండలంతో దర్శనమిస్తుంది. చక్కెర, పండ్లు వంటి పదార్థాలను నైవేద్యంగా సమర్పిస్తారు. లక్ష్యాన్ని చేరుకోవడానికి ఓర్పు, క్రమశిక్షణ, నిరంతర ప్రయత్నం అవసరమనే సందేశాన్ని ఈ రూపం అందిస్తుంది.

**మూడో రోజు చంద్రఘంటా దేవి**

నుదుటిపై అర్ధచంద్రాకార చిహ్నంతో, సింహవాహనంపై ఆయుధాలను ధరించి దర్శనమిచ్చే చంద్రఘంటా దేవి వీరత్వానికి సంకేతం. పాలు, పాలతో చేసిన మిఠాయిలను సమర్పించే ఆచారం కొన్ని ప్రాంతాల్లో ఉంది. భయాన్ని అధిగమించి ధైర్యంగా ముందుకు సాగాలనే స్ఫూర్తిని ఈ దేవి రూపం కలిగిస్తుంది.

**నాలుగో రోజు కూష్మాండ దేవి**

విశ్వసృష్టికి మూలశక్తిగా కూష్మాండ దేవిని పురాణాలు వర్ణిస్తాయి. ఆమె చిరునవ్వుతో సృష్టికి వెలుగు ప్రసాదించిందనే విశ్వాసం ఉంది. నారింజ లేదా పసుపు రంగు వస్త్రాలతో అలంకరించి, గుమ్మడికాయ వంటకాలు, మాల్పువా వంటి ప్రసాదాలను కొన్ని సంప్రదాయాల్లో సమర్పిస్తారు. సృజనాత్మకత, ఉత్సాహం, సానుకూల దృక్పథానికి ఈ రూపం ప్రతీక.

**ఐదో రోజు స్కందమాత దేవి**

కుమారస్వామిని ఒడిలో ధరించిన స్కందమాత మాతృప్రేమ, కరుణకు ప్రతిరూపం. కమలాన్ని ధరించి సింహవాహనంపై దర్శనమిచ్చే ఈ తల్లికి అరటిపండ్లు, పాయసం వంటి నైవేద్యాలను సమర్పిస్తారు. కుటుంబ బంధాల్లో ప్రేమానురాగాలు, పిల్లల పట్ల ఆదరణ, సమాజంలో మానవీయ విలువల ప్రాధాన్యాన్ని ఈ రూపం గుర్తుచేస్తుంది.

**ఆరో రోజు కాత్యాయనీ దేవి**

దుష్టశక్తులను సంహరించే వీరమాతగా కాత్యాయనీ దేవిని ఆరాధిస్తారు. సింహవాహనంపై ఖడ్గం తదితర ఆయుధాలతో దర్శనమిచ్చే అమ్మవారికి తేనె, పండ్లు లేదా తీపి పదార్థాలను సమర్పించే ఆచారాలు ఉన్నాయి. అన్యాయాన్ని ఎదిరించడం, ధర్మాన్ని కాపాడటం, న్యాయం కోసం నిలబడటం ఈ రూపం అందించే సందేశాలు.

**ఏడో రోజు కాళరాత్రి దేవి**

ఉగ్రరూపంలో దర్శనమిచ్చినా భక్తులకు శుభాలను ప్రసాదించే దేవిగా కాళరాత్రి ప్రసిద్ధి చెందింది. అజ్ఞానం, దుష్టత్వం, భయాలను తొలగించే శక్తిగా ఆమెను కొలుస్తారు. బెల్లం లేదా బెల్లంతో చేసిన పదార్థాలను కొన్ని ప్రాంతాల్లో నైవేద్యంగా సమర్పిస్తారు. కష్టాలను ఎదుర్కొనే ధైర్యం, చీకటిని తొలగించే వెలుగులా ఆశను నిలబెట్టుకోవడం ఈ రూపంలోని అంతరార్థం.

**ఎనిమిదో రోజు మహాగౌరి దేవి**

స్వచ్ఛత, శాంతి, సౌమ్యతకు ప్రతీక మహాగౌరి. తెల్లని వస్త్రాలు, సుగంధ భరితమైన పుష్పాలతో అమ్మవారిని అలంకరించి పూజిస్తారు. కొబ్బరి, పాయసం వంటి పదార్థాలను నైవేద్యంగా సమర్పించే సంప్రదాయం ఉంది. కొన్ని ప్రాంతాల్లో కన్యాపూజ నిర్వహించి బాలికలను గౌరవిస్తారు. పవిత్రమైన మనసు, కరుణ, మానవత్వం ఈ దేవి రూపం అందించే సందేశాలు.

**తొమ్మిదో రోజు సిద్ధి దాత్రి దేవి**

సకల సిద్ధులను ప్రసాదించే ఆదిశక్తిగా సిద్ధిదాత్రిని భక్తులు ఆరాధిస్తారు. కమలంపై ఆసీనురాలై దివ్య చిహ్నాలతో దర్శనమిచ్చే ఈ తల్లికి పాయసం, పండ్లు, శనగలు వంటి పదార్థాలను ప్రాంతీయ సంప్రదాయాల ప్రకారం సమర్పిస్తారు. ఆధ్యాత్మిక పరిపూర్ణత, జ్ఞానం, ఆత్మవిశ్వాసానికి ఈ రూపం ప్రతీకగా నిలుస్తుంది. అలంకరణల్లో ఆధ్యాత్మిక వైభవం నవరాత్రుల సందర్భంగా ఆలయాల్లో అమ్మవారిని పూలు, పట్టు వస్త్రాలు, ఆభరణాలతో విశేషంగా అలంకరిస్తారు. గులాబీలు, బంతిపూలు, చామంతులు, మల్లెలతో ఆలయ ప్రాంగణాలు సుందరంగా మారతాయి. దీపాల కాంతి, మంగళ వాయిద్యాల నాదం, భక్తుల ప్రార్థనలు ఉత్సవాలకు ప్రత్యేక శోభను తీసుకొస్తాయి. కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పారాయణాలు, చండీపారాయణాలు, భజనలు, సామూహిక పూజలు నిర్వహిస్తారు. ప్రతి ప్రాంతానికి ప్రత్యేకమైన ఆచారాలు, అలంకరణ పద్ధతులు ఉండటంతో నవరాత్రుల వేడుకల్లో వైవిధ్యం కనిపిస్తుంది. నవరాత్రుల్లో రోజువారీ వస్త్రాల రంగులు, అమ్మవారి అలంకరణ, ప్రసాదాల విషయంలో ప్రాంతీయ సంప్రదాయాలకు ప్రాధాన్యం ఉంటుంది. వివిధ రంగులు భక్తి, ఉత్సాహం, శుభసంకల్పాలకు ప్రతీకలుగా భావిస్తారు. నైవేద్యాలను భక్తితో సమర్పించి ప్రసాదంగా స్వీకరించడం ఈ ఉత్సవాల్లో ముఖ్యమైన భాగం. అన్నదానం, పేదలకు సహాయం, భక్తులకు ప్రసాద పంపిణీ, సామూహిక ప్రార్థనలు వంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయి.

**స్త్రీశక్తికి గౌరవం.. సమాజానికి సందేశం**

దేవీ నవరాత్రులు స్త్రీశక్తి గొప్పతనాన్ని చాటిచెప్పే పర్వదినాలు. దుర్గాదేవి ధైర్యానికి, లక్ష్మీదేవి సంపదకు, సరస్వతీదేవి జ్ఞానానికి ప్రతీకలుగా భావించబడతారు. ఈ ఆరాధనలోని అంతరార్థాన్ని జీవితంలో అనుసరిస్తూ మహిళలకు గౌరవం కల్పించడం, బాలికల విద్యను ప్రోత్సహించడం, లింగ సమానత్వాన్ని పాటించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత. ఉత్సవాలను పర్యావరణ హితంగా నిర్వహించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, సహజ పుష్పాలు, పునర్వినియోగ అలంకరణ సామగ్రిని ప్రోత్సహించడం అవసరం. ఆధ్యాత్మిక విశ్వాసంతో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే పండుగల సందేశం అర్థవంతమవుతుంది.

**విజయదశమి.. విజయానికి ప్రతీక**

తొమ్మిది రోజులపాటు జగన్మాతను వివిధ రూపాల్లో ఆరాధించిన అనంతరం విజయదశమిని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ పర్వదినం చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం, భయంపై ధైర్యం సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుంది. నవరాత్రులు మనలోని ప్రతికూల ఆలోచనలను తొలగించుకొని సత్ప్రవర్తన, ధైర్యం, కరుణ, సేవాభావాన్ని పెంపొందించుకోవాలని బోధిస్తాయి. అమ్మవారి అనుగ్రహంతో ప్రతి ఇంటా సుఖశాంతులు వెల్లివిరియాలని, సమాజంలో సౌభ్రాతృత్వం, సమానత్వం, మానవత్వం వర్ధిల్లాలని భక్తులు ఆకాంక్షిస్తారు.



స్కందమాత దేవి అవతారం



కాత్యాయనీ దేవి అవతారం



కాళరాత్రీదేవి అవతారం



మహా గౌరీ దేవి అవతారం



సిద్ధి దాత్రి దేవి అవతారం

## ఖో ఖో క్రీడాకారులు ప్రథమ స్థానమే లక్ష్యంగా కృషి చేయాలి

ఉమ్మడి జిల్లా శిక్షణ శిబిరాన్ని సందర్శించిన జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి బన్సీలాల్



**తెలంగాణ పత్రిక కరీంనగర్ అక్టోబర్ 11:** ఉమ్మడి జిల్లా ఖో ఖో క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానమే లక్ష్యంగా కృషి చేయాలని కరీంనగర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ ఎల్ బన్సీలాల్ అన్నారు. జిల్లా కేంద్రంలో గత వారం రోజులుగా జిల్లా ఖో ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జూనియర్ ఖో ఖో క్రీడాకారుల శిక్షణ శిబిరాన్ని ఆయనఅ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఆయన పలు సూచనలు చేశారు. క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో శిక్షణ పొంది పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని అన్నారు. క్రీడల్లో రాణించడంతో మంచి భవిష్యత్తు ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖో ఖో సంఘ అధ్యక్ష కార్యదర్శులు సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, వై మహేందర్ రావు, తెలంగాణ రాష్ట్ర ఖో ఖో సంఘ రెఫరీస్ బోర్డ్ కన్వీనర్ వంగపల్లి సూర్యప్రకాష్, జిల్లా ఖో ఖో సంఘ ఉపాధ్యక్షులు ఆర్ ఐ ఆఫ్ పోలీస్ కుమారస్వామి, ఇంటర్నేషనల్ ఖో ఖో రిఫరీ డాక్టర్ ఏ రవీందర్, అంతర్జాతీయ ఖో ఖో క్రీడాకారులు వెంకటేష్, కట్ట సంతోష్ , ఖో ఖో కోచ్ దప్పు రమేష్,, వ్యాయామ ఉపాధ్యాయులు రేణుక, రాజబాబు సీనియర్ ఖో ఖో క్రీడాకారుడు రాము తదితరులు పాల్గొన్నారు.

## నేడు రైతులకు సీఎం ఫోన్ కాల్

**పాలకుర్తి అక్టోబర్11(తెలంగాణ పత్రిక):** పాలకుర్తి గ్రామ రైతులకు సోమవారం రోజున ఉదయం 10:30 గంటలకు రైతు వేదికలో ముఖ్యమంత్రితో రైతులతో ప్రత్యక్ష కాన్ఫరెన్స్ కాల్ ఏర్పాటు చేయబడింది. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం నడుస్తున్నందున, రాబోయే పంట కాలం పై రైతులను అప్రమత్తం చేయడానికి తగు సూచనలు ఇవ్వడానికి ముఖ్యమంత్రి నేరుగా రైతులతో మాట్లాడనున్నారు. కాబట్టి, రైతులందరూ పాలకుర్తి రైతు వేదిక వద్దకు వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా గ్రామపంచాయతీ వారు కోరుతున్నారు.

## ఢిల్లీలో ఏఐసీసీ తలపెట్టిన ధర్నాకు కల్వకుర్తి ఎమ్మెల్యే కాసిరెడ్డి నారాయణరెడ్డి



**కల్వకుర్తి ప్రతినిధి అక్టోబర్ 11 తెలంగాణ పత్రిక:** ఢిల్లీలో రేపు ఏఐసీసీ ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నా కార్యక్రమంలో పాల్గొనడానికి ఢిల్లీకి బయలుదేరిన కల్వకుర్తి ఎమ్మెల్యే కా సి రెడ్డి నారాయణ రెడ్డి గారు

## రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం



**మందమర్రి మండలం (రామకృష్ణాపూర్) తెలంగాణ పత్రిక:** ఓమ్ని హాస్పిటల్ కూకట్‌పల్లి ఆధ్వర్యంలో సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరాన్ని ఏరియా ఆసుపత్రి డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ (అడ్మిన్) మధు కుమార్ ఆధ్వర్యంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ ఆదేశాల ప్రకారం నిర్వహించడం జరిగిందని అన్నారు. వైద్య శిబిరంలో కార్డియాలజీ, యూరాలజీ, న్యూరాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, నెఫ్రాలజీ విభాగాలకు చెందిన సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులు పాల్గొని సుమారు 118 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు చికిత్సా సూచనలు అందించారు. ఈ కార్యక్రమాన్ని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ సందర్శించి వైద్య శిబిరం నిర్వహణ తీరును పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు వైద్య నిపుణుల భాగస్వామ్యం శిబిరం నిర్వహణ ఏర్పాట్ల గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఎం.డి. మదర్ సాహెబ్, మ్యాట్రన్ విజయలక్ష్మి, ఓమ్ని హాస్పిటల్ వైద్య నిపుణులు, ఏరియా ఆసుపత్రి వైద్యులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఏడు అంతస్తుల భవనంపై చర్యలకు అడ్డంకి ఎవరు?

● ప్లాట్ నంబర్ 2-56/9సి/11లో నిర్మాణంపై ఫిర్యాదులు ● వార్తా కథనాలు.. ఆర్టీఐ దరఖాస్తు.. అయినా చర్యలు ఎందుకు లేవు?




తెలంగాణ పత్రిక
అంతస్తుల నిర్మాణం సాగుతున్నా

**రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి నియోజకవర్గం, అక్టోబర్ 11 (తెలంగాణ పత్రిక):** జీహెచ్ఎంసీ మాదాపూర్ సర్కిల్50 పరిధిలోని అయ్యప్ప సొసైటీ, ఎస్‌బీఐ అధికారుల కాలనీ, సిద్ధి వినాయక నగర్‌లోని ప్లాట్ నంబర్ 2-56/9సి/11లో కొనసాగుతున్న బహుళ అంతస్తుల నిర్మాణంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, మంజూరైన ప్రణాళిక, నిర్మాణంలో ఉన్న అంతస్తులు, నిబంధనల అమలు వంటి అంశాలపై ఫిర్యాదులు, వార్తా కథనాలు వెలువడినప్పటికీ సంబంధిత అధికారులు స్పష్టమైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదన్నది చర్చనీయాంశంగా మారింది.

**చర్యలకు వెళ్లి.. తిరిగి రావడానికి కారణమేంటి?**

నిర్మాణంపై వచ్చిన ఫిర్యాదులు, వార్తా కథనాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ మాదాపూర్ సర్కిల్50 టౌన్‌ప్లానింగ్ విభాగానికి చెందిన అధికారిణి అబ్బేబునిసా నిర్మాణ స్థలానికి వెళ్లిన సమయంలో, కృష్ణారెడ్డి అనే వ్యక్తి నుంచి ఫోన్ వచ్చిన అనంతరం అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత? కృష్ణారెడ్డి నుంచి నిజంగా ఫోన్ వచ్చిందా? వచ్చినట్లయితే ఆ ఫోన్ సంభాషణకు నిర్మాణంపై అధికారుల చర్యలకు ఏమైనా సంబంధం ఉందా? అధికారులు అక్కడి నుంచి ఎందుకు వెనుదిరిగారు? అన్నది జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

**ముఖ్య నేత సోదరుల పేర్లు చెప్పినట్లు ఆరోపణలు**

ఇదిలా ఉండగా, సదరు వ్యక్తి తాను ఓ ముఖ్య నేత సోదరులకు సన్నిహితుడినని, వారి అనుచరుడినని చెప్పుకుంటూ అధికారులపై ప్రభావం చూపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ వాదనలకు అధికారిక ధృవీకరణ ఉందా? సంబంధిత నేతలతో సదరు వ్యక్తికి ఏమైనా అధికారిక సంబంధం ఉందా? అన్నది కూడా స్పష్టత రావాల్సిన అంశమే. ఒక వ్యక్తి తనకు రాజకీయ లేదా ప్రజాప్రతినిధుల పరిచయాలు ఉన్నాయని చెప్పుకోవడం మాత్రమే అధికారుల విధుల్లో జోక్యానికి కారణం కాకూడదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవంగా ఎవరైనా అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లయితే, దానిపై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

**భవనానికి అనుమతులు ఉన్నాయా?.. సమాధానం ఎక్కడ?**

ప్రస్తుతం ప్రధాన ప్రశ్న నిర్మాణానికి సంబంధించిన అధికారిక రికార్డులపైనే ఉంది. భవన నిర్మాణానికి జీహెచ్ఎంసీ అనుమతి ఉందా? అనుమతి ఉంటే ఎన్ని అంతస్తులకు మంజూరు చేశారు? ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఏడు అంతస్తులకు అనుమతి ఉందా? నిర్మాణం మంజూరైన ప్లాన్ ప్రకారమే జరుగుతోందా? టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎప్పుడు తనిఖీ చేశారు? తనిఖీ సమయంలో నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారా? గుర్తించినట్లయితే ఎలాంటి నోటీసులు జారీ చేశారు? నిర్మాణంపై చర్యలు ఎందుకు నిలిచిపోయాయి? ఈ ప్రశ్నలకు సంబంధిత అధికారులు రికార్డుల ఆధారంగా సమాధానం ఇవ్వాల్సి ఉంది. ఆర్టీఐకి నెల రోజులు దాటినా సమాచారం ఏది? భవనానికి సంబంధించిన అనుమతులు, నిర్మాణ వివరాలు, అధికారుల తనిఖీలు, తీసుకున్న చర్యలపై సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసి నెల రోజులు దాటినా సమాచారం అందలేదని దరఖాస్తుదారు చెబుతున్నారు. ఒకవైపు నిర్మాణంపై ఫిర్యాదులు, మరోవైపు వార్తా కథనాలు, ఇంకోవైపు ఆర్టీఐ దరఖాస్తు ఉన్నప్పటికీ అధికారిక రికార్డులను వెల్లడించడంలో ఆలస్యం ఎందుకు జరుగుతోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**డీసీ దృష్టికి తీసుకెళ్లినా..**
**"స్పష్టత లేని సమాధానం"?**

ఈ వ్యవహారాన్ని జీహెచ్ఎంసీ మాదాపూర్ సర్కిల్50 ఉప కమిషనర్ బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పష్టమైన సమాధానం లభించలేదని ఫిర్యాదుదారు పేర్కొంటున్నారు. నిర్మాణం నిబంధనలకు అనుగుణంగా ఉందా లేదా అన్నది ఒకసారి అధికారిక తనిఖీతో తేల్చే అవకాశం ఉన్నప్పటికీ, ఆ ప్రక్రియలో ఎందుకు జాప్యం జరుగుతోందన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

**కవచం"గా ఎవరు?**

అనుమతులు లేకుండా లేదా అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నట్లు అధికారికంగా నిర్ధారణ అయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత విభాగానిదే. అదే సమయంలో నిర్మాణానికి అన్ని అనుమతులు ఉన్నట్లయితే వాటిని కూడా ప్రజలకు స్పష్టంగా వెల్లడించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అందుకే "ఈ నిర్మాణానికి రక్షణగా ఎవరు నిలుస్తున్నారు?" అనే ఆరోపణలకు బదులుగా, "నిర్మాణంపై అధికారిక చర్యలు ఎందుకు నిలిచిపోయాయి? ఎవరి ఆదేశాలతో లేదా ఏ కారణంతో అధికారులు వెనుదిరిగారు?" అనే ప్రశ్నలకు జీహెచ్ఎంసీ సమాధానం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ఉన్నతాధికారుల విచారణ అవసరం**

మాదాపూర్ సర్కిల్50 పరిధిలోని ఈ నిర్మాణంపై వచ్చిన ఫిర్యాదులు, వార్తా కథనాలు, ఆర్టీఐ దరఖాస్తు, అధికారుల క్షేత్రస్థాయి పర్యటన తదితర అంశాలను జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. అధికారుల విధులకు ఎవరైనా ఆటంకం కలిగించారా? అధికారుల నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నం జరిగిందా? నిర్మాణానికి సంబంధించిన అనుమతులు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? ఆర్టీఐ దరఖాస్తుకు సమాధానం ఎందుకు ఆలస్యమైంది? అనే అంశాలపై స్వతంత్రంగా రికార్డు ఆధారిత విచారణ జరిపి వాస్తవాలను బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది. నిర్మాణం అక్రమమైతే చర్యలు ఎవరు అడ్డుకున్నారు? అనుమతులు సక్రమమైతే వాటి వివరాలు వెల్లడించడంలో ఇబ్బంది ఏమిటి? ఇప్పుడు సమాధానం చెప్పాల్సింది అధికారులే..

# టి.ఆర్.పి పార్టీ బలోపేతం పాదయాత్ర ఏర్పాటు పై చర్చ సమావేశం



**జగిత్యాల, అక్టోబర్ 11 (తెలంగాణ పత్రిక):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యాలయంలో పార్టీ బలోపేతం భవిష్యత్ కార్యాచరణ పాదయాత్ర నిర్వహణ నూతన కమిటీల ఏర్పాటు తదితర అంశాలపై సమావేశం రూపొందించారు. ఈ సమావేశంలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం ప్రజా సమస్యలను గుర్తించి వాటిపై పోరాటం చేయడం పార్టీ నాయకులు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం వంటి పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందించడం కమిటీల ఏర్పాటు ద్వారా బాధ్యతలను నాయకులకు అప్పగించడం రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రణాళిక సిద్ధం చేయడం సమావేశ ప్రధాన ఉద్దేశాలుగా పేర్కొనరు. ఈ కార్యక్రమంలో కొలగాని శ్రీనివాస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి తీర్థ వేణుగోపాల్ పట్టణ యూత్ ప్రెసిడెంట్ బూత్కూరి మధు జిల్లా సోషల్ మీడియా గుడ్ల ప్రకాష్ జిల్లా యూత్ అధ్యక్షుడు గుడ్ల తిరుపతి రాష్ట్ర యూత్ కార్యదర్శి, పలగాని మల్లేష్ యాదవ్ సారంగాపూర్ ప్రెసిడెంట్ గోనె మధుకర్ పెగడపల్లి ప్రెసిడెంట్ దూలూరి శ్రీనివాస్ కథలాపూర్ ప్రెసిడెంట్ టి.ఆర్.పి నాయకుడు దశరథం మోరపల్లి కొంక నరహరి శ్రీనివాస్ చిగుర్ల మల్లయ్య శ్రీనివాస్ గంగం జలజ పండుగ శ్రీకాంత్ బక్కశెట్టి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరికీ దేవి శరన్నవరాత్రి ఉత్సవ శుభాకాంక్షలు

తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



**కల్వకుర్తి ప్రతినిధి అక్టోబర్ 11 తెలంగాణ పత్రిక:** శక్తి స్వరూపిణి అమ్మవారి అనుగ్రహంతో కల్వకుర్తి నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త వెలుగులు ఉండాలని భక్తి శక్తి ఆధ్యాత్మికత కు ప్రతీకగా నిలిచే దేవీ నవరాత్రులు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ప్రజలందరికీ శ్రీదేవి నవరాత్రుల శుభాకాంక్షలు తెలిపారు తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దుర్గామాత అమ్మవారి దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అన్నారు.

# బిఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా ఉమెన్స్ అండ్ మెన్స్ వాలీబాల్ టోర్నమెంట్స్ 2026



**మిర్యాలగూడ ప్రతినిధి, అక్టోబర్ 11:(తెలంగాణ పత్రిక):** దసరా పండగ సందర్భంగా బిఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలో ఉమెన్స్ అండ్ మెన్స్ వాలీబాల్ టోర్నమెంట్ 2026 ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ఓపెన్ టు ఆల్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టోర్నమెంట్ కి సంబంధించిన కడపత్రాలను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తమ క్రీడా ప్రతిభను చాటాలని కోరారు. మెన్స్ మొదటి బహుమతి 30 వేల రూపాయలు ప్లేస్ షీల్డ్, రెండో బహుమతి 25 వేల రూపాయలు ప్లస్ షీల్డ్, మూడో బహుమతి 20వేల రూపాయలు ప్లస్ షిల్డ్, నాలుగో బహుమతి 15వేల రూపాయలు ప్లస్ షీల్డ్, ఉమెన్స్ మొదటి బహుమతి 20000 రూపాయలు ప్లస్ షీల్డ్, రెండో బహుమతి 15వేల రూపాయలు ప్లస్ షీల్డ్, ఈరోజు వాలీబాల్ కి సంబంధించిన కడపత్రాన్ని ఓపెన్ చేసిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాజీ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, ఆరో వార్డ్ కౌన్సిలర్ ఆడోత్ అశోక్ 15వ వార్డు మాజీ కౌన్సిలర్ మంత్రాల రుణాల రెడ్డి 35వార్డు కౌన్సిలర్ దైద సోమ సుందర్, 3 వ వార్డు మాజీ కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్, 19వ వార్డు కౌన్సిలర్ బూడిద సైదులు, వాలీబాల్ ప్లేయర్స్ మరియు బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

# నేడు రైతు వేదికల్లో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్

రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలి

జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్

**జగిత్యాల, అక్టోబర్ 11 (తెలంగాణ పత్రిక):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోమవారం నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్లో ఉదయం 11:30 గంటలకు రాష్ట్ర రైతాంగాన్ని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమాన్ని జగిత్యాల జిల్లాలో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కలిగిన అన్ని రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో ముఖ్యమంత్రి ప్రస్తుత పంటలను కాపాడుకునేందుకు చేపట్టాల్సిన చర్యలు రాబోయే యాసంగి సీజన్లో పంటల సాగు ప్రణాళిక ఎల్-నినో ప్రభావంతో తలెత్తే వర్షాభావ పరిస్థితులు మరియు తీవ్ర కరువును ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై రైతులకు మార్గదర్శనం చేయనున్నారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి నిర్వహించడంతో పాటు వారి అభిప్రాయాలను కూడా సేకరించనున్నారు. కావున జగిత్యాల జిల్లాలోని వీసీ సౌకర్యం కలిగిన అన్ని రైతు వేదికల్లో నిర్వహించే ఈ కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో హాజరై పాల్గొనాలని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు శాసన సభ్యులు పార్లమెంట్ సభ్యులు మంత్రులు తదితర ప్రజా ప్రతినిధులకు ఈ కార్యక్రమం గురించి ముందస్తుగా సమాచారం అందించి రైతుల భాగస్వామ్యాన్ని పెంపొందించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ఓటు కోల్పోయిన వారిని తీసుకొస్తా..

రామచందర్‌రావుకు పొన్నం సవాల్



**హైదరాబాద్:** ఓటు కోల్పోయిన ఒక్కరినైనా చూపించగలరా.. అంటూ తెలంగాణ భాజపా చీఫ్ రామచందర్ రావు చేసిన సవాల్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. ఓటు కోల్పోయిన వారిని తీసుకొస్తానని.. తేదీ, సమయం చెప్పాలని సవాల్ విసిరారు 'సర్' పేరుతో దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఓట్లు తొలగించారని ఆరోపించారు. రాష్ట్రంలో 70 లక్షల ఓట్లు, హైదరాబాద్‌లో 40లక్షల ఓట్లు పోయాయన్నారు. ఓటరు జాబితా సమగ్ర ప్రక్షాళనను సరిగా చేయాలని.. అంతేగానీ ఓటు కోసం కొట్లాడేవారిని దూషించడం తగదన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో.. అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగకూడదని పేర్కొన్నారు.

# ఏడుపాయల్లో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన అడిషనల్ కలెక్టర్ నగేష్, ఈఓ మఠం వీరేశం

బాల త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చిన వన దుర్గామాత





**పాపన్నపేట, అక్టోబర్ 11:(తెలంగాణ పత్రిక):** తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన ఏడుపాయల వన దుర్గ మాత ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభంతో ఆలయ పరిసరాలు భక్తుల సందడితో కళకళలాడాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రధాన ఆలయం నుంచి గోకుల్ షెడ్ వరకు భాజభజంత్రీల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేక మంటపంలో ప్రతిష్ఠించారు. అనంతరం నవరాత్రుల ప్రధాన అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి రోజు శ్రీ వన దుర్గ మాత బాల త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో మెదక్ అడిషనల్ కలెక్టర్ నగేష్, ఆలయ ఈఓ మఠం వీరేశం అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. నవరాత్రుల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలు ఏడుపాయలకు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

**భక్తులకు అన్న ప్రసాదం.. పోలీసుల బందోబస్తు**

నవరాత్రి ఉత్సవాలకు విచ్చేసిన భక్తుల కోసం ఆలయ పరిసరాల్లో ఉన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాపన్నపేట ఎస్సై సారా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగంపేట నరేందర్ గౌడ్, మాజీ ఎంపీపీ పి. చందన ప్రశాంత్ రెడ్డి, మాజీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి ఎల్. మల్లప్ప, అప్పాజీపల్లి సర్పంచ్ గజిని, నాయకులు ముశెట్టి కిష్టయ్యతో పాటు ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సాయిబాబా, నరేష్, మహేష్, యాదగిరి, దీపక్ రెడ్డి, బలరాం తదితరులు పాల్గొన్నారు.



# సుజాతనగర్ పోలీసులకు ఘనంగా ఆత్మీయ సన్మానం

ఫ్రెండ్లీ పోలీసింగ్ తో మన్ననలు పొందిన పోలీసులు



**సుజాతనగర్, అక్టోబర్ 9 (తెలంగాణ పత్రిక):** సుజాతనగర్ పోలీస్ స్టేషన్ లో విశేషమైన సేవలు అందిస్తూ, ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజల మన్ననలు పొందిన కుదురుపాక రాఘవులు గారు, రైటర్ షేక్ బాబు జానీ గారు, PC ఉపేందర్ గారు బదిలీపై వెళుతున్న సందర్భంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు రాష్ట్ర ఉపాధ్యక్షులు మెట్టెల సైదుబాబు, బీసీ రాష్ట్ర నాయకులు గూని భద్ర రావు, జక్కుల ఫాల్గుణ, ఉబ్బనపల్లి కాశయ్య, ఆదివాసి రాష్ట్ర అధ్యక్షులు కోరం వెంకటేశ్వర్లు, బీసీ జిల్లా నాయకులు ఉబ్బనపల్లి వినీల్, చల్ది ఉపేందర్, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు వారిని ఘనంగా శాలువాలు, బొకేలతో సత్కరించారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు బయలుదేరిన హాకీ, యోగా, జూడో క్రీడా జట్లు

క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపిన ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బన్సీలాల్



**కరీంనగర్ అక్టోబర్ 11 (తెలంగాణ పత్రిక):** రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య ఎస్ జి ఎఫ్ పోటీల్లో పాల్గొనేందుకు కరీంనగర్ జిల్లా నుంచి హాకీ, యోగా, జూడో క్రీడా జట్లు బయలుదేరాయి. జోగులాంబ గద్వాల జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు హాకీ జట్టు, సిద్ధిపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీలకు యోగా జట్టు, అలాగే రాష్ట్రస్థాయి జూడో పోటీలకు జూడో జట్లకు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బన్సీలాల్ క్రీడాకారులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారులందరూ క్రీడాస్ఫూర్తితో, క్రమశిక్షణతో, ఆత్మవిశ్వాసంతో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. మూడు క్రీడా జట్లు రాష్ట్రస్థాయిలో అద్భుతంగా రాణించి పతకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని బన్సీలాల్ ఆకాంక్షించారు. క్రీడాకారులందరు విజయాలతో తిరిగి రావాలన్నారు.



RNI No. APTEL/2008/23088
తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా విజన్
Epaper.Telanganapatrika.in



# అక్రమ నిర్బంధం చెల్లదు

సీజేపీ అగ్రనేతలు అభిజీత్ దీప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా విడుదల

ఆదివారం కూడా ఢిల్లీలో వందలాది మంది నిర్బంధం

మెట్రో, రైలు, ఇంటర్నెట్ సేవలను సాధారణ స్థితిలో కొనసాగించాలని సుప్రీంకోర్టు ఆదేశం



**న్యూ ఢిల్లీ :** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో దేశ రాజధానిలో కొనసాగుతున్న నిరసనలు ఆదివారం కీలక మలుపు తిరిగాయి. శనివారం వేలాది మంది నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం, మెట్రో, రైల్వే, ఇంటర్నెట్ సేవలపై ఆంక్షలు విధించడాన్ని ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ఆదివారం ప్రత్యేక విచారణ నిర్వహించింది. శాంతియుతంగా, నిరాయుధులుగా సమావేశమయ్యే పౌరులను చట్టబద్ధమైన ప్రక్రియ లేకుండా నిర్బంధించరాదని స్పష్టం చేసింది. ప్రజారవాణా, ఇంటర్నెట్ సేవలను సాధారణ స్థితిలో కొనసాగించాలని, బారికేడ్ల అవసరాన్ని తక్షణమే సమీక్షించాలని అధికారులను ఆదేశించింది. మరోవైపు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్‌రాంకాలను ఆదివారం విడుదల చేశారు. అయినప్పటికీ జంతర్‌మంతర్‌కు చేరుకునేందుకు ప్రయత్నించిన విద్యార్థులు, యువజన సంఘాల కార్యకర్తలను పోలీసులు పలుచోట్ల అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం కూడా వందలాది మందిని నిర్బంధించినట్లు సమాచారం. న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఆదివారం ప్రత్యేకంగా సమావేశమై ఢిల్లీ పోలీసుల చర్యలు, రవాణా ఆంక్షలపై విచారణ జరిపింది. అక్టోబర్ 9న ఇచ్చిన ఆదేశాలను అధికారులు ఉల్లంఘించారని పిటిషనర్లు ఆరోపించారు. మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు, న్యాయవాదులు, జర్నలిస్టుల నిర్బంధం, పౌరుల రాకపోకలపై ఆంక్షలను న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న ధర్మాసనం మెట్రో, రైల్వే సేవలను సాధారణ షెడ్యూల్ ప్రకారం కొనసాగించాలని ఆదేశించింది. శాంతిభద్రతల పరిస్థితి అవసరమైనప్పుడు మాత్రమే చట్టబద్ధమైన, సమంజసమైన పరిమితులు విధించవచ్చని పేర్కొంది. సుప్రీంకోర్టు పరిసరాల్లో భారతీయ నాగరిక సురక్షా సంహిత సెక్షన్ 163 కింద ఆంక్షలను ప్రకటిస్తూ ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించాలని ఆదేశించింది. న్యాయస్థానాలకు వెళ్లే పౌరులు, న్యాయవాదుల రాకపోకలకు ఆటంకం కలగకూడదని స్పష్టం చేసింది. ఇంటర్నెట్ సేవలను సాధారణ స్థితిలో కొనసాగించాలని, నగరంలో బారికేడ్ల అవసరాన్ని పునఃసమీక్షించాలని సూచించింది. జర్నలిస్టులు, న్యాయవాదులు తమ వృత్తిపరమైన విధులను నిర్వర్తించకుండా అడ్డుకోరాదని పేర్కొంది. ప్రభుత్వం, సంబంధిత అధికారులు తమ చర్యలపై వివరణతోపాటు ఆదేశాల అమలు నివేదికను సమర్పించాలని నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ అక్టోబర్ 13, మంగళవారానికి వాయిదా పడింది. ధిక్కరణ ఆరోపణలపై ఇంకా తుది నిర్ణయం వెలువడలేదు. శనివారం ఢిల్లీ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న అభిజీత్ దీప్కే, సౌరవ్ దాస్, అశుతోష్‌రాంకాలను ఆదివారం ఢిల్లీ కంటోన్మెంట్ ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్లు 126, 170 కింద ముందస్తు నిర్బంధ చర్యలు చేపట్టినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఏడాదిపాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించకూడదనే షరతుతో, ఒక్కొక్కరికి రూ. 50 వేల పూచీకత్తుపై విడుదల చేసినట్లు వెల్లడించారు. సీజేపీ న్యాయ వ్యవహారాల బాధ్యురాలు రత్నా సింగ్ ముగ్గురి విడుదలను ధ్రువీకరించారు. అయితే నిరసనలు నిర్వహించకూడదనే ప్రత్యేక నిషేధం విధించలేదని ఆమె వివరించారు. విడుదల అనంతరం దీప్కే మాట్లాడుతూ, తాము నిరసనలు చేయబోమని ఎలాంటి హామీ ఇవ్వలేదని, పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. తన నానమ్మ మరణించిన నేపథ్యంలో మహారాష్ట్రకు తిరిగి వెళు తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు జంతర్‌మంతర్ వద్ద మరోసారి సమావేశం కావాలని సీజేపీ నాయకుడు అజింక్య షిండే పిలుపునిచ్చారు. అయితే పోలీసులు ప్రధాన నిరసన ప్రాంగణానికి వెళ్లే మార్గాల్లో భద్రతను కొనసాగించారు. దీంతో కన్నాట్ ప్లేస్, ఆర్కే ఆశ్రమ్ మెట్రో స్టేషన్, రాజీవ్ చౌక్ తదితర ప్రాంతాల్లో విద్యార్థులు, యువజన సంఘాల కార్యకర్తలు చిన్న బృందాలుగా నిరసనలు నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం పలువురు నిరసనకారులను పోలీసులు వాహనాల్లో తరలించినట్లు తెలుస్తుంది ఐసా అధ్యక్షురాలు నేహా బోరాను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆర్కే ఆశ్రమ్ వద్ద నిరసనలను కవర్ చేస్తున్న నలుగురు జర్నలిస్టులను కొద్దిసేపు నిర్బంధించినట్లు వార్తలు వెల్లడించాయి. వారిలో ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు చెందిన ముగ్గురు జర్నలిస్టులు విడుదలయ్యారు.

## జపాన్‌తో తెలంగాణ బంధం మరింత బలోపేతం!

జపాన్ ఫెస్టివల్2026లో మంత్రి వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్:** హైదరాబాద్, జపాన్‌లోని మియోషి నగరాల మధ్య ఏర్పడిన సిస్టర్ సిటీ సంబంధాలు 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జపాన్‌తో తెలంగాణ బంధాన్ని మరింత బలోపేతం చేస్తామని రాష్ట్ర ఇంధన, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. హైదరాబాద్ హైటెక్ సిటీలో ఆదివారం నిర్వహించిన జపాన్ ఫెస్టివల్2026లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా కార్యక్రమానికి హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ తెలంగాణ జపాన్ మధ్య విశ్వాసం, గౌరవం, సాంకేతిక సహకారమే బలమైన భాగస్వామ్యానికి పునాది అని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. హైదరాబాద్‌మియోషి మధ్య రెండు దశాబ్దాల స్నేహబంధం నగరాలకే పరిమితం కాకుండా ప్రజలు, విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య బలమైన సంబంధంగా ఎదిగిందన్నారు. జపాన్‌లోని కచ్చితత్వం, క్రమశిక్షణ, నాణ్యత తమను ఆకట్టుకున్నాయని చెప్పారు. హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో సహకారానికి సూత్రప్రాయ అంగీకారం కుదిరిందన్నారు. విద్యార్థుల మార్పిడి, అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన విద్యలో భాగస్వామ్యం ఉంటుందని తెలిపారు. కిండాయ్ యూనివర్సిటీ, ఫుకుయామా హయ్యర్ టెక్నికల్ స్కూల్ సందర్శన ద్వారా ఆచరణాత్మక శిక్షణపై విలువైన అవగాహన లభించిందని చెప్పారు. హైదరాబాద్‌లో 400కు పైగా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లలో 3 లక్షల మంది నిపుణులు పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. టీహబ్, టీవర్క్స్, వీహబ్ స్టార్టప్‌లకు ప్రోత్సాహం ఇస్తున్నామని అన్నారు. తెలంగాణలో ఇప్పటికే 169 జపాన్ సంస్థలు పనిచేస్తున్నాయని, ఇది ఆర్థిక సంబంధాలకు నిదర్శనమని చెప్పారు. ఎలక్ట్రానిక్స్, ఈవీ, సెమీకండక్టర్లు, ఆర్‌అండ్‌డీ రంగాల్లో జపాన్ సంస్థలు మరింతగా పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. రాబోయే 5 ఏళ్లలో 45 లక్షల మందికి నైపుణ్య శిక్షణ ఇవ్వడం లక్ష్యమని మంత్రి తెలిపారు. జపాన్ సహకారంతో పాఠ్యప్రణాళిక, అధునాతన శిక్షణ, అంతర్జాతీయ ధ్రువీకరణలో పురోగతి సాధిస్తామన్నారు. టామ్ కామ్ ద్వారా ఇప్పటివరకు 16 దేశాల్లో 14,500 మందికి ఉద్యోగాలు కల్పించామని, జపాన్ పర్యటన అనంతరం అక్కడ 500 మంది కేర్ గివర్లు, డ్రైవర్లకు డిమాండ్ లభించిందని తెలిపారు.

### సాంకేతిక, పారిశ్రామిక రంగాల్లో విస్తృత అవకాశాలు

భారతదేశం, జపాన్ దేశాల మధ్య ఎన్నో ఏళ్ల నుంచి మంచి స్నేహ సంబంధాలు కొనసాగుతున్నాయని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. రెండు దేశాల మధ్య పరస్పర గౌరవం, ప్రజాస్వామ్య విలువలు, ఆర్థిక సహకారం ఆధారంగా దీర్ఘకాలిక స్నేహబంధం కొనసాగుతోందని చెప్పారు. సాంకేతికత, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, విద్య, సాంస్కృతిక మార్పిడి వంటి రంగాల్లో భారత్, జపాన్ మధ్య సంబంధాలు మరింత అభివృద్ధి చెందాయని తెలిపారు. హైదరాబాద్ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీ, పారిశ్రామిక అభివృద్ధి రంగాల్లో ముందు వరుసలో ఉందని పేర్కొన్నారు. భారత్‌జపాన్ దేశాల మధ్య ఉన్న స్నేహబంధాన్ని గొప్పగా భావిస్తున్నామని, మరింత సహకారం, ప్రజల మధ్య సంబంధాలతో బంధాలను ఇంకా బలోపేతం చేసుకోవాలని కోరుకుంటున్నామని స్పీకర్ తెలిపారు.

# గ్రామాల్లో కొలువుదీరిన దుర్గామాతలు

● ఆగమనంతో అమ్మవారికి ఊరేగింపు ● రోజుకో రూపంలో అమ్మవారి దర్శనం







**ముధోల్:11అక్టోబర్(తెలంగాణ పత్రిక):** మండల కేంద్రమైన ముధోల్ తో పాటు మండలంలోని చించాల,అష్ట, బోరిగాం, విట్టోలి, ముద్గల్,చింత కుంట తదితర గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో ఆదివారం దుర్గామాతలు కొలువుదీరాయి. మండల కేంద్రమైన ఆయా యువజన సంఘాల ఆ ధ్వర్యంలో దుర్గాదేవి మాతలను ఆగమన్ తో మహిళలు మంగళ హారతులతో భక్తిశ్రద్ధలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. చైతన్య యూత్ ఆధ్వర్యంలో సర్వశక్తి దుర్గా మాత, కొలిగల్లీలోని పరాశక్తి దుర్గామాత,జై కిసాన్ యూత్ ఆధ్వర్యంలో శ్రీ నవ ఏకాంబిక, గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో త్రిశూల్ వాహిని, వీర్ సావర్కర్ యూత్ ఆధ్వర్యంలో మహా శక్తి దుర్గామాతల వద్ద వేద పండితుల ఆధ్వర్యంలో హారతి కార్యక్రమాన్ని చేప ట్టి దుర్గాదేవికి ఇష్టమైన రవ్వకేసరి,మినపవడలను నైవేద్యాలుగా సమర్పించి ప్రత్యేక పూజలను చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు మాట్లాడుతూ దేవి శరన్న నవరాత్రి ఉత్సవాలు మొద టి రోజు శైలపుత్రి అవతారం లో అమ్మవారు దర్శనమిచ్చినట్లు తెలిపారు. రోజుకో రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దేవి శరన్న నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులు అమ్మవారికి ఉపవాస దీక్షలను చేపట్టనున్నారు. ప్రతి రోజు తొమ్మిది రోజుల పాటు భక్తులు ప్రత్యేక పూజలను చేయనున్నారు. దీంతో వాడవాడలో కొలువుదీరిన దుర్గమాతలతో నవరాత్రి శోభ కనిపిస్తుంది.







## బతుకమ్మ సంబురాలకి వేళాయె...

ఎంగిలి పూల బతుకమ్మతో ఆరంభం.

పూలను దైవంగా ఆరాధించే పండుగ బతుకమ్మ.

తీరొక్క రంగులు. వేర్వేరు రకాలు. వాటన్నింటా సుగంధమే

సద్దుల బతుకమ్మతో ముగింపు



**పెద్దపల్లి, ప్రతినిధి అక్టోబర్ 11 ( తెలంగాణ పత్రిక):** తెలంగాణలోని సంప్రదాయాలకు సంస్కృతికి ప్రతీక బతుకమ్మ. ఈపండుగ వచ్చిందటే ఆడపడుచులకు ఎనలేని ఆనందం. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమికి ముందు వచ్చే అమావాస్యను జానపదులు పెత్రమాస అంటారు. బతుకమ్మ పండుగ పెత్రమాసనాడు ప్రారంభమై మహాష్టమి రోజున సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మగా, తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మగా జరుపుకుంటారు. ఆరో రోజు అర్రెం అంటారు. ఈరోజు బతుకమ్మను పేర్చడం గానీ ఆడడం గానీ చేయరు. బతుకమ్మ అంటే మన గౌరమ్మ, మన ఇంటి ఆడబిడ్డ. తీరొక్క పూలతో రంగు రంగుల శోభితమై, ప్రకృతంతా పరుచుకున్న ప్రకృతి వర్ణ శోభితంపువ్వులను దైవంగా పూజించే బతుకమ్మ సంబురాలు తెలంగాణ సంస్కృతికి చిహ్నం. భాద్రప్రద అమావాస్య అంటే మహాలయ అమావాస్య నుంచి మొదలవుతాయి. చిన్న పెద్ద అనే తేడా లేకుండా జానపద గీతాలతో ఆడుతూ పాడుతూ జరుపుకునే ఈ పండగ నేటి నుంచి మొదలవుతున్నాయి. ఈ నేపథ్యంలో బతుకమ్మ సంబురాల్లో తొలి రోజు జరుపుకునే ఎంగిలిపూల బతుకమ్మ తెలంగాణలో అతిపెద్ద పండుగ బతుకమ్మ పండుగ. ఈ ఏడాది అక్టోబర్ 10పెత్ర అమావాస్య రోజు నుంచి ఘనంగా ప్రారంభం అయ్యి 9 రోజుల పాటు గౌరీదేవిని అత్యంత భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తారు. ఈ నేపథ్యంలో తొలి రోజు ఎంగిలి పూల బతుకమ్మగా అమ్మవారిని పూజిస్తారు. ఈ క్రమంలో ఎంగిలి పూల బతుకమ్మ గౌరీ దేవిని రోజుకో రూపంలో 9 రోజుల పాటు 9 రూపాల్లో పూజిస్తారు. బతుకమ్మ పండుగ లో భాగంగా మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మగా అమ్మవారిని ఆరాధిస్తారు.

### ప్రపంచమంతా పూలతో పూజిస్తే... పూలనే పూజించే గొప్ప సంస్కృతి మనది

ఎంగిలి పూల బతుకమ్మ కోసం ముందు రోజే పూలు తెచ్చి నీళ్లలో వేసుకుని ఉంచుతారు. అలా పూలు నిద్ర చేస్తాయి. అందుకే ఎంగిలి పూలు అంటారు. బతుకమ్మను పేర్చడానికి ముందు రోజే ఆడవాళ్లు పొలాలు, చెట్లు, గట్లు తిరుగుతూ అందమైన రంగు రంగుల పూలను కోసి తీసుకొస్తారు. మొదటి రోజున బతుకమ్మను పేర్చే పూలలో ప్రధానంగా తంగేడు, గునుగు, తామర, చామంతి పూలు, బంతి పూలు, సీత జడలు ఎక్కువగా ఉపయోగిస్తారు. మొదట తంగేడు పూలు అమర్చిన తర్వాత రంగుల ఆధారంగా ఇతర పూలను అమరుస్తారు. అయితే.. ముందు రోజే తెంపుకొచ్చిన ఈ పూలను వాడిపోకుండా నీటిలో వేసి ఉంచుతారు.. ఇలా చేయడం వల్ల పూలు నిద్ర చేస్తాయి. అందుకే వీటితో అమర్చే బతుకమ్మను ఎంగిలి పూల బతుకమ్మ

### తెలంగాణ అస్తిత్వానికి, సాంస్కృతిక జీవనానికి తరతరాల ప్రతీక మన బతుకమ్మ

పూలను, ప్రకృతిని పూజించే గొప్ప పండుగ మన బతుకమ్మ , బతుకమ్మ పండుగలో భాగంగా మొదటి రోజు చేసుకునే వేడుక ఎంగిలి పూల బతుకమ్మ. అయితే.. తొలి రోజు కాబట్టి పెద్దలకు, పూర్వీకులకు నివేదన చేసిన తర్వాత భోజనం చేసిన తర్వాత బతుకమ్మను పేర్చడానికి పూలను సిద్ధం చేసుకుంటారు. ఇలా భోజనం చేయడాన్ని ఎంగిలి పడటం అంటారు. అందుకే ఆ పేరు వచ్చిందని.. కాబట్టి దీన్ని ఎంగిలి పూల బతుకమ్మ అని అంటారు

### బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.బంగారు బతుకమ్మ ఉయ్యాలో

తెలంగాణ ఆడబిడ్డల అందరూ అత్యంత సంతోషంగా జరుపుకునే పండుగ బతుకమ్మ పండుగ. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా పువ్వులనే దేవతగా కొలిచే అరుదైన ఈ పండుగలో పేద, ధనిక తారతమ్యాలు లేకుండా, అన్ని వయసుల వారు పాల్గొంటారు. తంగేడు, గునుగు, కట్ల, చేమంతి, బంతి, మల్లె, మొల్ల, మొగలి, సంపెంగ, కలువ, తామర వంటి పూలతో బంగారు బతుకమ్మను పేర్చి సాంప్రదాయబద్ధంగా గౌరమ్మనుపూజిస్తారు. రాగిపళ్ళెంలో తంగేడు ఆకులు అమర్చి వాటిపై తంగేడు పూల కట్టలు పేర్చి, మధ్య మధ్యలో ఇతర పూలను వినియోగిస్తూ కలర్ ఫుల్ గా బతుకమ్మను పేరుస్తారు.

## గంభీరావుపేటలో ఘనంగా జిల్లా ఆవిర్భావ శతాబ్ది ఉత్సవాలు

కెసిఆర్ కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన మండల బిఆర్ఎస్ నాయకులు

జిల్లా ఏర్పాటు కేసీఆర్ ఘనత

సిరిసిల్ల అభివృద్ధి కేటీఆర్ కృషికి నిదర్శనం



**గంభీరావు పేట తెలంగాణ పత్రిక అక్టోబర్ 11:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా గంభీరావుపేట బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాప గారి వెంకటస్వామి గౌడ్ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు ముందుగా తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కేసీఆర్ కేటీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు అనంతరం అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాను ఏర్పాటు చేసి పాలనను ప్రజలకు చేరువ చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని, సిరిసిల్లను అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు దక్కుతుందని వెంకట స్వామి గౌడ్ అన్నారు.

### ప్రజలకు పాలన చేరువ చేసిన ఘనత కేసీఆర్‌దే

గతంలో ఉమ్మడి జిల్లాలోని మారుమూల ప్రాంతాల ప్రజలు కలెక్టర్, ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులను కలవాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కొనే వారని పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి చేరుకోవడానికి సమయం, డబ్బు ఖర్చు చేయాల్సి వచ్చేదని అన్నారు. ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో 33 జిల్లాలను ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. జిల్లా కేంద్రం ఏర్పాటుతో పరిపాలన, రెవెన్యూ, పోలీస్ తదితర సేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయని పేర్కొన్నారు.

### వైద్య రంగంలో మెడికల్ కాలేజీతో కీలక మార్పు

సిరిసిల్లకు మెడికల్ కాలేజీ రావడం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని అన్నారు. ఏరియా ఆసుపత్రితో పాటు వివిధ వైద్య విభాగాల సేవలు అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు మెరుగైన వైద్యం పొందే అవకాశం ఏర్పడిందని వివరించారు. గతంలో తీవ్ర ప్రమాదాలు, తలకు గాయాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండేదని, ఇప్పుడు స్థానికంగానే మరిన్ని వైద్య సేవలు పొందే అవకాశం పెరిగిందని చెప్పారు

### సిరిసిల్ల రూపురేఖలు మార్చిన కేటీఆర్

కేటీఆర్ నాయకత్వంలో సిరిసిల్ల పట్టణం అభివృద్ధి దిశగా ముందుకు సాగిందని ఒకప్పుడు పరిమిత సౌకర్యాలు, చిన్న రహదారులతో ఉన్న పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం లభించిందని పేర్కొన్నారు. గతంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు ఒకసారి గుర్తు చేసుకోవాలని కోరారు

### విమర్శలు కాదు.. అభివృద్ధి చేసి చూపించాలి

గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే పరిమితం కాకుండా, ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేసి చూపించాలి గతంలో జరిగిన అభివృద్ధిని మించి పనులు చేపట్టి ప్రజల విశ్వాసాన్ని పొందాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని అన్నారు.

### జిల్లా దశాబ్ది ఉత్సవాలు.. బీఆర్ఎస్ అభివృద్ధి ప్రస్థానానికి గుర్తు

రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటు కేవలం పరిపాలనా విభజన మాత్రమే కాదని, ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేయాలనే ఆలోచనకు ప్రతిరూపమని చల్మెడ పేర్కొన్నారు. జిల్లాను ఏర్పాటు చేసిన కేసీఆర్‌కు, సిరిసిల్ల అభివృద్ధికి కృషి చేసిన కేటీఆర్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ నారాయణరావు మండల ఉప సర్పంచల ఫోరం అధ్యక్షులు లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డి యువ నాయకుడు చేరాల నిఖిల్ గౌడ్ కమ్మరి రాజారాం ఎగదండి స్వామి గ్యార దేవరాజు చిలుక ప్రశాంత్ ఎగదండి అర్జున్ నాయకులు కొమిరిశెట్టి లక్ష్మణ్ చేరాల వెంకటస్వామి గౌడ్ సింగారం నాగరాజు గౌడ్ మల్లేశం యాదవ్ చిట్టంపల్లి రాజు చిట్టెంపల్లి బిక్షపతి కళ్యాణ్ కుమార్ ఎగదండి రవి పాపగారి శ్రీనివాస్ గౌడ్ బండ రమేష్ పిట్ల బాబు ధ్యానబోయిన రాజేందర్ రత్నాకర్ కొలనూరి వేణు వీరబోయిన సంజీవ్ తోపాటు ఇతర పాల్గొన్నారు.



# బిఎల్‌వై ఆధ్వర్యంలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

● ముఖ్య అతిథిగా పాల్గొన్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ● బోయిని అనసూయ మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో...





**తెలంగాణ పత్రిక న్యూస్ ప్రతినిధి శేర్లింగంపల్లి నియోజకవర్గం అక్టోబర్ 11:** హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని బి ఎల్ వై హోమ్స్ వద్ద బీజేపీ హఫీజ్‌పేట్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ బోయిని అనుషా మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు గౌరవ శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి హాజరై మహిళలకు, ఆడపడుచులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రకృతిని పూజిస్తూ పూలతో తల్లి బతుకమ్మను ఆరాధించడం ఈ పండుగ ప్రత్యేకత అని పేర్కొన్నారు. మహిళల ఐక్యతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి, మన సాంస్కృతిక వారసత్వానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. మన పండుగలు, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. బి ఎల్ వై హోమ్స్ వద్ద నిర్వహించిన ఈ వేడుకల్లో హఫీజ్‌పేట్‌తో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు, ఆడపడుచులు పాల్గొని తమ బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, మహిళల ఆటపాటలు, సాంస్కృతిక సందడి ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా బతుకమ్మలను తీసుకువచ్చిన మహిళలకు, పోటీల్లో పాల్గొన్న వారికి ప్రోత్సాహకంగా బహుమతులు అందజేశారు. మహిళల భాగస్వామ్యం, ఉత్సాహం, సంప్రదాయాల పట్ల వారికున్న అభిమానం ఈ కార్యక్రమాన్ని మరింత విజయవంతం చేశాయి. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన బోయిని అనుషా మహేష్ యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బతుకమ్మ పండుగను ప్రజలందరి భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ వేడుకలను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించే కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ వేడుకలు హఫీజ్‌పేట్ ప్రాంతంలో పండుగ వాతావరణాన్ని నింపగా, మహిళల ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున శేర్లింగంపల్లి నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు






# కల్తీ... కల్తీ... కల్తీ... మనిషిలో మిగిలింది ఏమిటి.?

● ఆహారం నుంచి ఆలోచనల వరకు... ● సంబంధాల నుంచి విలువల వరకు...! ● డబ్బు, మత్తు, విలాసాల మధ్య మానవత్వం వెనుకబడుతోందా

**కామారెడ్డి, అక్టోబర్ 11,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** ఒకప్పుడు కల్తీ అంటే పాలలో నీళ్లు కలపడం, నూనెలో నాసిరకం పదార్థాలు కలపడం, నకిలీ వస్తువులు విక్రయించడం అని భావించే వాళ్లంకానీ నేడు సమాజం మరో రకమైన కల్తీ గురించి ఆలోచించాల్సిన పరిస్థితి ఉందా.? అనే ప్రశ్న ముందుకొస్తోంది. ఆలోచనల్లో కల్తీసం బంధాల్లో కల్తీప్రేమలో కల్తీనమ్మకంలో కల్తీ జీవన విధానంలో కల్తీ...అని అనిపించేలా కొన్ని సామాజిక పరిణామాలుఎ ఆందోళన కలిగిస్తున్నా యి అయితే ప్రతి కుటుంబాన్ని, ప్రతి సంబంధాన్ని ఒకే కోణంలో చూడటం సరికాదుమంచి సంబం ధాలు, మానవత్వం, పరస్పర సహకారం సమాజంలో ఇప్పటికీ ఉన్నాయి. అయినప్పటికీ విలువలపై జరుగుతున్న చర్చను మాత్రం విస్మరించలేం.

**డబ్బు పెరిగింది బంధం తగ్గిందా?**

ఆర్థికంగా ఎదగాలనే కోరిక తప్పు కాదు. మెరుగైన జీవితం కోసం సంపాదించడం ప్రతి ఒక్కరి హక్కు. కానీ డబ్బు ఒక సాధనం నుంచి జీవితానికి ఏకైక లక్ష్యంగా మారితే..? ఆస్తి, ఆర్థిక ప్రయోజనాలు, వ్యక్తిగత స్వార్థం కారణంగా కుటుంబ సభ్యుల మధ్య వివాదాలు తలెత్తుతున్న ఘటనలు తరచూ వార్తల్లో కనిపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ఘర్షణలు నేరాల వరకు వెళ్లడం మరింత ఆందోళన కలిగించే అంశం. రక్త సంబంధం ఉన్నంత మాత్రాన బంధం బలపడదు. నమ్మకం, గౌరవం, బాధ్యత, మానవత్వం కలిసినప్పుడే బంధం నిలుస్తుంది.

**ప్రేమకు కూడా లెక్కలేనా....?**

ప్రేమ అంటే నమ్మకం, గౌరవం, పరస్పర అవగాహన. కానీ కొన్ని సంబంధాల్లో వ్యక్తిగత ప్రయోజనాలు, ఆర్థిక అంచనాలు, స్వార్థం ముందుకు వస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే కొన్ని ఘటనల ఆధారంగా ప్రతి ప్రేమను, ప్రతి సంబంధాన్ని అనుమానించడం కూడా సమాజానికి పరిష్కారం కాదు.

**ప్రశ్న ఒక్కటే..?**

సంబంధాల్లో ప్రయోజనం కంటే మనిషికి, మనసుకు విలువ పెరుగుతోందా.? మత్తుయువత భవిష్యత్తుకు ముప్పా.? మద్యం, గుట్కా, పొగాకు, గంజాయి తదితర మత్తు పదార్థాల వినియోగంపై సమాజంలో చాలాకాలంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మత్తు పదార్థాల ప్రభావం వ్యక్తిగత జీవితానికే పరిమితం కాకుండా కుటుంబ సంబంధాలు, విద్య, ఉపాధి, ఆర్థిక పరిస్థితులు వంటి అంశాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. యువత చేతుల్లో పుస్తకాలు, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు ఉండాల్సిన సమయంలో మత్తు పదార్థాలు వారి జీవితాల్లోకి చొరబడకుండా చూడాల్సిన బాధ్యత కుటుంబం, విద్యాసంస్థలు, సమాజం, ప్రభుత్వ వ్యవస్థలపై ఉంది. యువతను నిందించడం కాదు వారిని ఆ దిశగా నడిపించే పరిస్థితులను గుర్తించి పరిష్కరించడం ముఖ్యం.

**విలాసం పెరిగింది విలువలు ఎక్కడ.?**

సౌకర్యాలు పెరగడం అభివృద్ధికి సంకేతమే. సాంకేతికత మన జీవితాలను సులభతరం చేసింది. కానీ ఇతరులతో పోల్చుకుని జీవించాలనే ఒత్తిడి, సామాజిక హోదా కోసం అధిక ఖర్చులు, అవసరానికి మించిన విలాస జీవనశైలి కొన్ని కుటుంబాలపై ఆర్థిక ఒత్తిడిని పెంచుతున్నాయి. భవనాలు పెరుగుతున్నాయి... కానీ బంధాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయా..? సాంకేతికత పెరుగుతోంది... కానీ మనిషి మనిషికి దగ్గరవుతున్నాడా.? ఇవే మనం ఆలోచించాల్సిన ప్రశ్నలు.

**మానవత్వం ఎక్కడ...?**

రోడ్డుపై ప్రమాదం జరిగితే సహాయం చేసే చేయి కావాలి. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టే మనసు కావాలి. కష్టాల్లో ఉన్న కుటుంబానికి అండగా నిలిచే బంధం కావాలివృద్ధ తల్లిదండ్రులను ఆదుకునే బాధ్యత కావాలి పిల్లలకు మంచి విలువలు నేర్పే కుటుంబ వాతావరణం కావాలి. ఇవి లేకుండా ఎంత ఆర్థిక ప్రగతి సాధించినా సమాజం సంపూర్ణంగా అభివృద్ధి చెందిందని చెప్పగలమా.?

**రేపటి సమాజం ఈరోజు మన చేతుల్లోనే**

మరో పది, ఇరవై సంవత్సరాల తర్వాత సమాజం ఎలా ఉండబోతుందో ఎవరూ ఖచ్చితంగా చెప్పలేరు. కానీ ఈరోజు మనం పిల్లలకు, యువతకు అందించే విలువలు రేపటి సమాజాన్ని ప్రభావితం చేస్తాయి.

**కుటుంబంలో ప్రేమపాఠశాలలో విలువలు**

సమాజంలో బాధ్యతప్రజా జీవితంలో నిజాయితీ యువతకు సరైన దిశ ఇవి బలపడితేనే సమాజం బలపడుతుంది. కల్తీని కేవలం ఆహార పదార్థాల్లోనే వెతకడం కాదు. మన ప్రవర్తనలో, మన ఆలోచనల్లో, మన సంబంధాల్లోకి స్వార్థం, మోసం, ద్వేషం, బాధ్యతారాహిత్యం చొరబడకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది. కల్తీ ఆహారం ఆరోగ్యాన్ని దెబ్బతీయవచ్చు. మత్తు భవిష్యత్తును దెబ్బతీయవచ్చు. కానీ విలువల క్షీణత ఒక తరాన్నే ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. అందుకే ఇప్పుడు అవసరం కేవలం చట్టాలు కాదు చైతన్యం కూడా. డబ్బు కంటే సంబంధాలకు విలువ ఇవ్వాలి. విలాసం కంటే విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలి. మత్తు కంటే భవిష్యత్తును ఎంచుకోవాలి. స్వార్థం కంటే మానవత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి.

**చివరికి మిగిలేది ఏమిటి...?**

మనిషి ఎంత సంపాదించాడు అన్నది కాదు ఎంత ఆస్తి కూడబెట్టాడు అన్నది కాదు ఎంత విలాసంగా జీవించాడు అన్నది కాదు ఎంత మానవత్వంతో జీవించాడు అన్నదే చివరికి మిగిలేది. అందుకే ప్రశ్న సమాజం ముందుంది..! మన పిల్లలకు ఎలాంటి సమాజాన్ని అందించబోతున్నాం.? కల్తీతో నిండిన సమాజాన్నా...లేక మానవత్వంతో నిండిన సమాజాన్నా.....?

**మనిషి జీవితానికి 27 సూత్రాలు**

1. కల్తీ. కల్తీ. కల్తీ మనిషిలో మిగిలింది ఏమిటి.?
2. డబ్బు పెరిగింది బంధం తగ్గిందా.?
3. మత్తులో యువత మౌనంగా సమాజం.?
4. ప్రేమకు లెక్కలు బంధాలకు బేరాలు.?
5. విలాసం పెరిగింది మానవత్వం ఎక్కడ.?
6. మనిషి ఎక్కడ.?
7. డబ్బు ఉంది... మనశ్శాంతి ఉందా.?
8. సంబంధాలు ఉన్నాయి... ఆప్యాయత ఉందా...?
9. ప్రేమ ఉంది నమ్మకం ఉందా.?
10. అభివృద్ధి ఉంది... మానవత్వం ఉందా.?
11. సాంకేతికత ఉంది... మనిషికి మనిషి దగ్గరగా ఉన్నాడా..?
12. మద్యం, మత్తు పదార్థాలు, జూదం, స్వార్థం, అతివిలాసం వంటి అంశాలు సమాజంలో చర్చకు వస్తున్నాయి.
13. కానీ అసలు ప్రశ్న ఒక్కటే
14. మనిషి మనిషిగా మిగిలే విలువలను మనమే కాపాడుకోగలమా...?
15. మార్పు సమాజంలో మొదలవ్వాలంటే... ముందు మనలోనే మొదలవ్వాలి.
16. విలువలు మిగిలితేనే... మనిషి మిగులుతాడు...!
17. సమాజం మారుతోంది. సాంకేతికత మారుతోంది. జీవనశైలి మారుతోంది. అవసరాలు పెరుగుతున్నాయి. అవకాశాలు విస్తరిస్తున్నాయి.
18. కానీ ఈ మార్పుల మధ్య ఒక ప్రశ్న మాత్రం మనల్ని వెంటాడాలి.!
19. మనిషి విలువలు కూడా మారిపోతున్నాయా.?
20. డబ్బు సంపాదించడం తప్పు కాదు. సౌకర్యవంతంగా జీవించడం తప్పు కాదు. ఆధునికంగా ఉండటం తప్పు కాదు.
21. కానీ డబ్బు కోసం బంధాన్ని, విలాసం కోసం మనశ్శాంతిని, మత్తు కోసం భవిష్యత్తును, స్వార్థం కోసం మానవత్వాన్ని కోల్పోకూడదు.
22. సమాజాన్ని మార్చే శక్తి కేవలం ప్రభుత్వాల దగ్గర లేదు. అది ప్రతి కుటుంబంలో ఉంది. ప్రతి తల్లిదండ్రిలో ఉంది. ప్రతి ఉపాధ్యాయుడిలో ఉంది. ప్రతి యువకుడిలో ఉంది. ప్రతి పౌరుడిలో ఉంది.
23. మనిషిని నిలబెట్టేది సంపద కాదు... సంస్కారం.
24. సమాజాన్ని నిలబెట్టేది భవనాలు కాదు... బంధాలు.
25. భవిష్యత్తును నిలబెట్టేది మత్తు కాదు... మంచి విలువలు.
26. అందుకే కల్తీకి వ్యతిరేకంగా పోరాటం మార్కెట్‌లో మాత్రమే కాదు... మన ఆలోచనల్లోనూ మొదలుకావాలి.
27. మనిషి మనిషిగా మిగిలే సమాజమే నిజమైన అభివృద్ధి చెందిన సమాజం.

## జిబూటి తీరంలో మునిగిన పడవ.. 109 మంది మృతి



**జిబూటి:** ఆఫ్రికా దేశమైన జిబూటి తీరంలో పడవ మునిగింది. ఈ ఘటనలో 109 మంది వలసదారులు మృతి చెందారు. మరణించిన వారిలో 52 మంది పురుషులు, 42 మంది మహిళలు, 15 మంది చిన్నారులు ఉన్నారు. మరో 116 మందికి పైగా గల్లంతయినట్లు అంతర్జాతీయ వలసల సంస్థ ప్రకటించింది. ప్రమాద సమయంలో పడవలో దాదాపు 350 మంది ఉన్నట్లు సమాచారం. జిబూటి నుంచి యెమెన్‌కు వెళ్తుండగా.. గుహెరే ప్రాంతానికి సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. 80 మందికి పైగా ఇథియోపియా పౌరులు ప్రాణాలతో బయటపడినట్లు తెలుస్తోంది. అధికారులు ఘటనాస్థలంలో సహాయక చర్యలు చేపట్టారు.

## బస్సులో ప్రయాణిస్తూ.. గుండెపోటుతో యువకుడి మృతి

**చౌటుప్పల్:** ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తుండగా.. గుండెపోటుతో ఓ వ్యక్తి మరణించిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో చోటు చేసుకుంది. పల్నాడు జిల్లా నాదెండ్ల గ్రామానికి చెందిన గంగవరపు చైతన్య (33) ఐదేళ్ల క్రితం యుకె వెళ్లి మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. రెండు నెలల క్రితం హైదరాబాద్‌కు వచ్చి అద్దె గదిలో ఉంటూ రీసెర్చ్ స్కాలర్‌గా ఉన్నత చదువులు కొనసాగిస్తున్నాడు. ఈ నెల 10న ఉదయం తన అన్న గంగవరపు అవినాశ్‌కు ఫోన్ చేసి, ఛాతి నొప్పితో బాధపడుతున్నానని, ఇంటికి వస్తానని తెలిపాడు. ఆదివారం ఉదయం 11.30కు ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో చిలకలూరిపేటకు బయలుదేరాడు. బస్సు చౌటుప్పల్ పరిధిలోని లక్కారం బ్రిడ్జి వద్దకు చేరుకున్న సమయంలో ఛాతిలో నొప్పి రావడంతో బస్సు హెల్పర్‌కు తెలిపాడు. అతను అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా మధ్యాహ్నం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆ యువకుడు మృతి చెందినట్లు నిర్ధారించారు.

## మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి: సీతక్క

సారస్ మేళా ప్రారంభోత్సవంలో మహిళా సంఘాలకు మంత్రి సూచన



**హైదరాబాద్:** మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు కేవలం పొదుపు చేయడం, రుణాలు పొందడానికే పరిమితం కాకుండా ఉత్పత్తిదారులుగా, వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళల్లో అపారమైన ప్రతిభ, నైపుణ్యం, సృజనాత్మకత ఉన్నాయని, వారికి తగిన శిక్షణ, ఆర్థిక సహకారం, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తే విజయవంతమైన వ్యాపారాలను నిర్వహించగలరని అన్నారు. గ్రామీణ మహిళల ప్రతిభకు, సృజనాత్మకతకు, స్వయం ఉపాధి అవకాశాలకు వేదికగా నిలుస్తున్న సారస్ గ్రామీణ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ మేళాను హెచ్ఎండీఏ గ్రౌండ్‌లో మంత్రి సీతక్క ఆదివారం ప్రారంభించారు. డప్పు చప్పుళ్లు, కోయ నృత్యాలు, కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనల మధ్య మేళా ప్రాంగణానికి చేరుకున్న మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి మేళాను ప్రారంభించిన మంత్రి, తెలంగాణతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలు స్వయంగా తయారు చేసిన హస్తకళా వస్తువులు, చేనేత ఉత్పత్తులు, సంప్రదాయ కళారూపాలు, గృహోపకరణాలు, ఆహార పదార్థాలు, పచ్చళ్లు, చిరుతిళ్లు, చిరుధాన్యాల ఉత్పత్తులను మంత్రి సీతక్క ఆసక్తిగా పరిశీలించారు. ఒక్కో స్టాల్ వద్దకు వెళ్లి మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తుల ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. వాటి తయారీ విధానం, నాణ్యత, ధరలు, విక్రయాలు, వినియోగదారుల నుంచి వస్తున్న స్పందన గురించి మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. వ్యాపార నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లు, ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడంలో ఉన్న ఇబ్బందులు, వ్యాపారాన్ని మరింత విస్తరించుకునేందుకు ఉన్న అవకాశాలపై ఆరా తీశారు.

**మహిళా సంఘాలకు ప్రభుత్వ చేయూత**

మహిళా స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం బ్యాంకు రుణాలు, వడ్డీ రాయితీ ప్రయోజనాలు, నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి కార్యక్రమాలు, వ్యాపార అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తోందని మంత్రి సీతక్క వివరించారు. మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. సంఘాల సభ్యులు సమష్టిగా పనిచేస్తూ ఉత్పత్తి, విక్రయాలు, మార్కెటింగ్ రంగాల్లో తమ సామర్థ్యాన్ని పెంచుకోవాలని తెలిపారు. మహిళల ఉత్పత్తులకు నిరంతర మార్కెట్ అందుబాటులో ఉండేలా ప్రభుత్వ కార్యక్రమాలను ఉపయోగించుకోవాలని చెప్పారు. మహిళల ఆదాయం పెరిగితే కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటమే కాకుండా పిల్లల విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాలు కూడా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. సారస్ మేళాలో మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడంతో పాటు, గ్రామీణ ప్రతిభను ప్రజలకు పరిచయం చేసే వేదికగా నిలుస్తోందని మంత్రి సీతక్క కొనియాడారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, సెర్ప్ డైరెక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మణిపూర్‌లో మళ్లీ నెత్తుటిధార

తొమ్మిది మంది మృతి, 14 ఇళ్లకు నిప్పు



**ఇంఫాల్ :** డబుల్ ఇంజన్ సర్కార్ ఏలుబడిలోని మణిపూర్‌లో నెత్తుటేరులు పారుతూనే ఉన్నాయి. వేర్వేరు ఘటనల్లో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోగా.. నాగా, కుకీ గ్రూపులకు చెందిన సుమారు 14 ఇళ్లను దుండగులు తగలబెట్టారు. రాష్ట్రంలోని కామ్‌జోంగ్, కాంగ్‌పోక్పి మరియు ఉఖ్రుల్ జిల్లాల్లో శుక్రవారం రాత్రి నుంచి ప్రారంభమైన కాల్పులు, దాడులతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మణిపూర్ ముఖ్య మంత్రి వై. ఖేమ్‌చంద్ సింగ్ ఢిల్లీలో ప్రధాని మోడీని కలిశారు. రాష్ట్రంలో శాంతి, సాధారణ పరిస్థితుల పునరుద్ధరణకు అన్ని విధాలా సహకరిస్తామని మోడీ హామీ ఇచ్చినా రాష్ట్రంలో పరిస్థితులు అదుపులోకి రాలేదు. స్థానికుల కథనం ప్రకారం కామ్‌జోంగ్ జిల్లా చస్సాద్ పోలీస్ స్టేషన్‌లో గ్రామ వలంటీర్లను ఇండియా రిజర్వ్ బెటాలియన్ (ఐఆర్‌బి), పోలీసులు ఏకపక్షంగా నిర్బంధించడాన్ని నిరసిస్తూ చస్సాద్‌కు చెందిన మహిళలు శుక్రవారం రాత్రి ఆందోళన చేపట్టారు. ఆ సమయంలో జరిగిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన 42 ఏళ్ల కుకీ మహిళ డోమ్‌ఖోనీ టౌథాంగ్ ప్రాణాలు కోల్పోయింది. పోలీసుల కథనం ప్రకారం.. అక్రమ బంకర్లను తొలగించేందుకు మణిపూర్ పోలీసులు, ఐఆర్‌బి, సరిహద్దు భద్రతా దళం సంయుక్తంగా చేపట్టిన చర్యలను స్థానిక మహిళలు అడ్డుకునేందు కు ప్రయత్నించారు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరపడంతో, భద్రతా దళాలు ఎదురు కాల్పులు జరిపాయి. ఆ ఘటనలో టౌథాంగ్ మరణించినట్లు పోలీసులు చెబుతున్నారు. ఆమెకు ఐదుగురు పిల్లలున్నారు. ఆమె మరణంతో ఇరు గ్రూపుల మధ్య కాల్పులు, దహనకాండ చెలరేగాయి. కనీసం 14 ఇళ్లు తగలబడ్డాయి. శనివారం చస్సాద్‌లో జరిగిన ఘర్షణల్లో 23 ఏళ్ల యువకుడు మైఖేల్ న్గామిన్లెన్ హావోకిప్ మరణించాడు. నాగా తిరుగు బాటుదారుల కాల్పుల్లోనే హావోకిప్ మరణించినట్టు కుకీ మహిళా సంఘం తెలిపింది. శనివారం తెల్లవారుజామున చస్సాద్ పోలీస్ స్టేషన్‌కు నిప్పంటించేందుకు గుర్తుతెలియని వ్యక్తులు ప్రయత్నించడంతో మళ్లీ కాల్పులు జరిగాయి. నింగ్చౌ చింగ్‌డాంగ్ వద్ద ఇద్దరు నాగా గ్రామ రక్షకులు న్గచాన్సో నింగ్షెన్ (30), లీషిషన్ హుంగ్యో (50) హత్యకు గురయ్యారు. మకుయి గ్రామంలో మరో ముగ్గురు నాగా గ్రామ రక్షకులు మచుంగమ్మంగ్, అజిన్‌పా రింగ్‌కంగ్‌మై, రోబార్ట్ మరణించారు. కాంగ్‌పోక్పి జిల్లా టపోన్ గ్రామం వద్ద దాడిలో నాగా గ్రామ వాలంటీర్ మచుంగ్‌వాంగ్‌బౌ (35) మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఉఖ్రుల్ జిల్లాలో జాతీయ రహదారి-202పై కారులో ప్రయాణిస్తున్న సందీప్ రాయ్ (30)ను గుర్తుతెలియని సాయుధులు కాల్చిచంపారు.

## జీఎస్టీ సంస్కరణలతో పన్నుల వ్యవస్థలో కొత్త అధ్యాయానికి నాంది: లంకా దినకర్

**హైదరాబాద్ :** వ్యాపార నిర్వహణను సులభతరం చేసి పన్ను చెల్లింపుదారులకు సౌలభ్యం కలిగించేందుకు కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 తో అనుకూలమైన సంస్కరణలు తీసుకొచ్చిందని భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడు, 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే లక్ష్యంతో తీసుకున్న జీఎస్టీ నిర్ణయాలను స్వాగతిస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీఎస్టీ 2.0 భారత పన్నుల వ్యవస్థలో కొత్త అధ్యాయానికి నాంది కావాలని ఆకాంక్షించారు. జీఎస్టీ చట్టం కింద అధికారులకు ఉన్న అరెస్టు అధికారాలను తొలగించాలని సిఫార్సు చేయడం, పన్ను ఎగవేత కేసుల్లో న్యాయపరమైన చర్యల కనీస పరిమితిని రూ.కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచడం స్వాగతించదగినవని చెప్పారు.

## డిస్కంలకు రూ.2,050 కోట్లు విడుదల

**హైదరాబాద్ :** వ్యవసాయ, ఇతర సబ్సిడీల కింద డిస్కంలకు రూ.2,050.41 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం పాలనాపరమైన ఉత్తర్వులు జారీ చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ మొత్తాన్ని విడుదల చేసినట్లు పేర్కొంది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని డిస్కంల సీఎండీలను ప్రభుత్వం ఆదేశించింది.

## పోలీసు దెబ్బలకు అస్వస్థత..
## పట్టువదలని దీక్షతో యువత

చలో లోక్ భవన్ కార్యక్రమం స్ఫూర్తిదాయకం



**అమరావతి :** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా, ఎస్‌ఐఆర్ రద్దు కోరుతూ విజయవాడలో శనివారం జరిగిన చలో లోక్‌భవన్ కార్యక్రమంలో యువత పెద్ద ఎత్తున కదిలింది. వందలాదిమంది యువకులు ఉత్సాహంగా రోడ్లపైకి వచ్చారు. ఎన్ని నిర్బంధాలు విధించినా, కార్యాలయాలను ముట్టడించినా అనుకున్న సమయానికి లెనిన్ సెంటర్‌కు చేరుకున్నారు. దీంతో వారిని నిలువరించడం పోలీసులకు కష్టమైంది. పట్టిన పట్టు వీడకుండా ఎర్రటి ఎండలోనే రోడ్డుపై కూర్చుని తమ నిరసన వ్యక్తం చేశారు. రోడ్డుపైనే బైఠాయించి నినదించారు. ఈ క్రమంలో పెనుగాటలు జరిగాయి. ఈసారి ఆందోళనలో వందలమంది పోలీసులు ఉన్నప్పటికీ కొద్దిమంది యువతను అదుపులోకి తీసుకోవడానికి శ్రమించవలసి వచ్చింది. ప్రజాస్వామ్య పరిరక్షణకు యువత ముందుకొచ్చి పట్టుబట్టుకు కూర్చున్నారు. ముఖ్యంగా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, పిడిఎస్ఒ తదితర సంఘాల నాయకులు రోడ్లపైకి వచ్చారు. అరెస్టులు చేసే క్రమంలో పోలీసులు దురుసుగా ప్రవర్తించడంతో పలువురు యువతీ, యువకులు గాయపడ్డారు. ఒకవైపు యువత ఆందోళనలో పాల్గొంటే మరోవైపు కొంతమంది జెన్‌జీ యువత వీడియోలు తీస్తూ సమాచారాన్ని చేరవేస్తూ తమవంతు పాత్ర పోషించారు. వ్యాన్లలో ఎక్కించిన తరువాత కూడా కొంత మంది యువత కిందకు దిగి మరలా రోడ్డుపై బైఠాయించారు. అయితే పోలీసులు ఇష్టారాజ్యంగా నెట్టివేయడం, చొక్కాలు, కాళ్లు, చేతులు పట్టుకుని లాగడంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు రవి చేతికి గాయమైంది. అతనికి చికిత్స అందించారు. అలాగే ఏలూరు మండలానికి చెందిన మాధవ్‌ను పోలీసులు గుండెలపై తన్నారు. వారిని అరెస్టు చేసే క్రమంలో ప్రతిఘటించడంతో పోలీసులు వారిపై మోకాళ్లు పెట్టి నొక్కారు. అలాగే మాధవ్‌ను వ్యాను ఎక్కించే సమయంలో ముగ్గురు పోలీసులు నెట్టారు. అప్పటికీ ఆయన ప్రతిఘటించారు. ఈ క్రమంలో అపస్మారక స్థితికి చేరుకున్నారు. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండటంతో వెంటనే సహచరులు అతన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ఇసిజి పరీక్ష నిర్వహించిన వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స చేశారు. అలాగే భీమవరానికి చెందిన ఎస్ఎఫ్ఐ కార్యకర్త వంశీ కూడా అదే పరిస్థితి పోలీసులు బలవంతంగా లాగడం, తన్నిరాని చోట్ల తన్నడంతో తీవ్ర అస్వస్థత పాలయ్యాడు. ఛాతిలో నొప్పి రావడంతో వైద్యులు ఇసిజి చూసి ప్రాథమిక చికిత్స అందించారు. అలాగే రాజమండ్రికి చెందిన జ్యోతి కూడా తీవ్రంగా ప్రతిఘటించింది. ఆమె కూడా అస్వస్థత పాలయ్యారు. కొంతమంది మహిళా పోలీసులు చేతులు పట్టుకుని లాగే సమయంలో ఇంకొందరు పోలీసుల కాళ్లు ఆమె చేతిపై పడ్డాయి. వీరితోపాటు పదుల సంఖ్యలో యువకులు గాయాలపాలయ్యారు. యువత మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయడం కోసం పోలీసులు బూతులు తిట్టారు. ఆందోళనలో పాల్గొంటూనే బూతులు ఎందుకు తిడుతున్నా రంటూ పోలీసు అధికారులను యువత ప్రశ్నించారు.

## సంజీవని సేవలకు సన్నద్ధంకండి..
## కలెక్టర్లకు సీఎస్ సాయిప్రసాద్ ఆదేశం

**అమరావతి :** రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించనున్న 'సంజీవని' ఆరోగ్య సేవల అమలుకు జిల్లాల యంత్రాంగం సన్నద్ధం కావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఆదేశించారు. సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో ఆదివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన మౌలిక సదుపాయాలు, ఐటీ పరికరాలు, ఇంటర్నెట్ కనెక్టివిటీ, వర్చువల్ వైద్య సంప్రదింపుల గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. పేషెంట్ కేర్ కోఆర్డినేటర్ల నియామకం, వైద్య సిబ్బందికి శిక్షణ, ఆరోగ్య కేంద్రాల నమోదు ప్రక్రియలను గడువులోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ప్రతి వారం పనుల పురోగతిని కలెక్టర్లు సమీక్షించాలని ఆదేశించారు. సమావేశంలో వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్, కమిషనర్ చక్రధర్‌బాబు పాల్గొన్నారు.

## ఎస్‌జీఎఫ్‌లో పనిచేసేందుకు
## దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్ :** పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లోని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్)లో అదర్ డ్యూటీ(ఓడి) కింద పనిచేసేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12నుంచి 20వరకు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఎంపిక విధానాన్ని తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు.

## ఆర్అండ్‌బీ ఏఈఈ
## పరీక్షల రీషెడ్యూలుకు వినతి

**హైదరాబాద్ :** స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) జూనియర్ ఇంజినీరింగ్ పరీక్ష నేపథ్యంలో.. నవంబరు 6, 7 తేదీల్లో నిర్వహించనున్న ఆర్అండ్‌బీ ఏఈఈ పరీక్ష తేదీలను రీషెడ్యూలు చేయాలని అభ్యర్థులు టీజీపీఎస్సీకి విజ్ఞప్తి చేశారు. నవంబరు 2 నుంచి 6 వరకు దేశవ్యాప్తంగా ఎస్ఎస్‌సీ పరీక్షలు ఉన్నాయని, అదే సమయంలో రాష్ట్ర ఏఈఈ పరీక్షలు ఉండటంతో అభ్యర్థులు నష్టపోయే ప్రమాదముందని పేర్కొన్నారు. ఈ మేరకు అభ్యర్థులు ఆదివారం టీజీపీఎస్సీ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందించారు. ఏమైనా మార్పులుంటే వెబ్‌నోట్ విడుదల చేస్తామని కమిషన్ అధికారులు తెలిపినట్లు అభ్యర్థులు వెల్లడించారు.

## ఆ అభ్యర్థులకు స్కిల్ టెస్ట్

**హైదరాబాద్:** లాసెట్, ఎడ్‌సెట్ క్రీడా కోటా సీట్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 13న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించే స్కిల్ టెస్ట్‌కు హాజరు కావాలని కన్వీనర్ కృష్ణ ఓ ప్రకటనలో సూచించారు. ఒరిజినల్ క్రీడా సర్టిఫికెట్లు, సంబంధిత ధ్రువపత్రాలతో హాజరు కావాలని, పూర్తి వివరాలు క్యాప్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

## జనసేన ఎన్నికల
## ప్రచారానికి పటిష్ఠ కార్యాచరణ

మంత్రి కందుల దుర్గేష్

**అమరావతి :** 'స్థానిక సంస్థల ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ నాయకత్వంలో జనసేన అభ్యర్థుల గెలుపునకు పటిష్ఠ ప్రచార కార్యాచరణ సిద్ధం చేసుకుని ముందుకు సాగుతాం. ఉప ముఖ్యమంత్రి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంతో పాటు స్థానిక ఎన్నికలపై గట్టి దృష్టి పెట్టారు. ఆయనే స్వయంగా రాష్ట్ర స్థాయి కమిటీలు, లోక్‌సభ స్థానాల వారీగా అడ్‌హక్ కమిటీలు ఏర్పాటు చేశారు.' అని రాష్ట్ర మంత్రి, జనసేన ప్రచార కమిటీ సభ్యుడు కందుల దుర్గేష్ పేర్కొన్నారు. స్పెయిన్ పర్యటనలో ఉన్న ఆయన కొత్తగా నియమితులైన కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ ఆదివారం రాత్రి ఒక వీడియో సందేశం పంపారు. 'ఇప్పటి నుంచే కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు రంగంలోకి దిగి సమైక్యంగా పని చేయాలి. అభ్యర్థులను విజయతీరాలకు చేర్చాలి' అని అందులో పేర్కొన్నారు.

# బతుకమ్మ సంబురాలకి వేళాయె

- ఎంగిలి పూల బతుకమ్మతో ఆరంభం
- పూలను దైవంగా ఆరాధించే పండుగ బతుకమ్మ.
- తీరొక్క రంగులు. వేర్వేరు రకాలు. వాటన్నింటా సుగంధమే
- సద్దుల బతుకమ్మతో ముగింపు





**పెద్దపల్లి, ప్రతినిధి అక్టోబర్ 11 ( తెలంగాణ పత్రిక )** తెలంగాణలోని సంప్రదాయాలకు సంస్కృతికి ప్రతీక బతుకమ్మ. ఈపండుగ వచ్చిందటే ఆడపడుచులకు ఎనలేని ఆనందం. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమికి ముందు వచ్చే అమావాస్యను జానపదులు పెత్రమాస అంటారు. బతుకమ్మ పండుగ పెత్రమాసనాడు ప్రారంభమై మహాష్టమి రోజున సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మగా, తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మగా జరుపుకుంటారు. ఆరో రోజు అర్రెం అంటారు. ఈరోజు బతుకమ్మను పేర్చడం గానీ ఆడడం గానీ చేయరు. బతుకమ్మ అంటే మన గౌరమ్మ, మన ఇంటి ఆడబిడ్డ. తీరొక్క పూలతో రంగు రంగుల శోభితమై, ప్రకృతంతా పరుచుకున్న ప్రకృతి వర్ణ శోభితంపువ్వులను దైవంగా పూజించే బతుకమ్మ సంబురాలు తెలంగాణ సంస్కృతికి చిహ్నం. భాద్రప్రద అమావాస్య అంటే మహాలయ అమావాస్య నుంచి మొదలవుతాయి. చిన్న పెద్ద అనే తేడా లేకుండా జానపద గీతాలతో ఆడుతూ పాడుతూ జరుపుకునే ఈ పండగ నేటి నుంచి మొదలవుతున్నాయి. ఈ నేపథ్యంలో బతుకమ్మ సంబురాల్లో తొలి రోజు జరుపుకునే ఎంగిలిపూల బతుకమ్మ తెలంగాణలో అతిపెద్ద పండుగ బతుకమ్మ పండుగ. ఈ ఏడాది అక్టోబర్ 10పెత్ర అమావాస్య రోజు నుంచి ఘనంగా ప్రారంభం అయ్యి 9 రోజుల పాటు గౌరీదేవిని అత్యంత భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తారు. ఈ నేపథ్యంలో తొలి రోజు ఎంగిలి పూల బతుకమ్మగా అమ్మవారిని పూజిస్తారు. ఈ క్రమంలో ఎంగిలి పూల బతుకమ్మ గౌరీ దేవిని రోజుకో రూపంలో 9 రోజుల పాటు 9 రూపాల్లో పూజిస్తారు. బతుకమ్మ పండుగ లో భాగంగా మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మగా అమ్మవారిని ఆరాధిస్తారు.

**ప్రపంచమంతా పూలతో పూజిస్తే.**
**పూలనే పూజించే గొప్ప సంస్కృతి మనది**

ఎంగిలి పూల బతుకమ్మ కోసం ముందు రోజే పూలు తెచ్చి నీళ్లలో వేసుకుని ఉంచుతారు. అలా పూలు నిద్ర చేస్తాయి. అందుకే ఎంగిలి పూలు అంటారు. బతుకమ్మను పేర్చడానికి ముందు రోజే ఆడవాళ్లు పొలాలు, చెట్లు, గట్లు తిరుగుతూ అందమైన రంగు రంగుల పూలను కోసి తీసుకొస్తారు. మొదటి రోజున బతుకమ్మను పేర్చే పూలలో ప్రధానంగా తంగేడు, గునుగు, తామర, చామంతి పూలు, బంతి పూలు, సీత జడలు ఎక్కువగా ఉపయోగిస్తారు. మొదట తంగేడు పూలు అమర్చిన తర్వాత రంగుల ఆధారంగా ఇతర పూలను అమరుస్తారు. అయితే.. ముందు రోజే తెంపుకొచ్చిన ఈ పూలను వాడిపోకుండా నీటిలో వేసి ఉంచుతారు.. ఇలా చేయడం వల్ల పూలు నిద్ర చేస్తాయి. అందుకే వీటితో అమర్చే బతుకమ్మను ఎంగిలి పూల బతుకమ్మ

**తెలంగాణ అస్తిత్వానికి, సాంస్కృతిక**
**జీవనానికి తరతరాల ప్రతీక మన బతుకమ్మ**

పూలను, ప్రకృతిని పూజించే గొప్ప పండుగ మన బతుకమ్మ బతుకమ్మ పండుగలో భాగంగా మొదటి రోజు చేసుకునే వేడుక ఎంగిలి పూల బతుకమ్మ. అయితే.. తొలి రోజు కాబట్టి పెద్దలకు, పూర్వీకులకు నివేదన చేసిన తర్వాత భోజనం చేసిన తర్వాత బతుకమ్మను పేర్చడానికి పూలను సిద్ధం చేసుకుంటారు. ఇలా భోజనం చేయడాన్ని ఎంగిలి పడటం అంటారు. అందుకే ఆ పేరు వచ్చిందని.. కాబట్టి దీన్ని ఎంగిలి పూల బతుకమ్మ అని అంటారు

**బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..**
**బంగారు బతుకమ్మ ఉయ్యాలో**

తెలంగాణ ఆడబిడ్డల అందరూ అత్యంత సంతోషంగా జరుపుకునే పండుగ బతుకమ్మ పండుగ. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా పువ్వులనే దేవతగా కొలిచే అరుదైన ఈ పండుగలో పేద, ధనిక తారతమ్యాలు లేకుండా, అన్ని వయసుల వారు పాల్గొంటారు. తంగేడు, గునుగు, కట్ల, చేమంతి, బంతి, మల్లె, మొల్ల, మొగలి, సంపెంగ, కలువ, తామర వంటి పూలతో బంగారు బతుకమ్మను పేర్చి సాంప్రదాయబద్ధంగా గౌరమ్మనుపూజిస్తారు. రాగిపళ్ళెంలో తంగేడు ఆకులు అమర్చి వాటిపై తంగేడు పూల కట్టలు పేర్చి, మధ్య మధ్యలో ఇతర పూలను వినియోగిస్తూ కలర్ ఫుల్ గా బతుకమ్మను పేరుస్తారు.

## ఇ-వేస్ట్ విపత్తు!



ఆధునిక మానవాళి వికాసానికి 'డిజిటల్ విప్లవం' బలమైన చోదక శక్తిగా మారింది. స్మార్ట్‌ఫోన్ల విస్తరణ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సర్వర్ల నిర్మాణం, ఆన్‌లైన్ సేవలు మన జీవనశైలిని ఎంతో సులభతరం చేశాయి. వైద్యం నుంచి విద్య వరకు, వ్యవసాయం నుంచి అంతరిక్ష పరిశోధనల వరకు అనేక రంగాల్లో అద్భుతాలను ఆవిష్కరిస్తోంది. కానీ, ఈ సాంకేతిక జిలుగు వెలుగుల వెనుక 'ఈ-వేస్ట్' (ఎలక్ట్రానిక్ వ్యర్థాలు) మానవాళి భవిష్యత్తుకు పెను ముప్పుగా పరిణమించాయి. సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవనశైలిని ఎంతగా సులభతరం చేసిందో, అంతే స్థాయిలో పర్యావరణానికి తీవ్ర సవాలుగా మారింది. కొత్త పరికరాలను కొనుగోలు చేయడంలో చూపుతున్న ఆసక్తి, పాత పరికరాలను బాధ్యతాయుతంగా పారవేయడంలో కనిపించడం లేదు. ఆధునిక యుగంలో 'డిజిటల్ విప్లవం' తెచ్చిన మార్పులు ఒకవైపు వికాసానికి దారితీస్తుంటే, మరోవైపు పేరుకుపోతున్న 'ఈ-వేస్ట్' రాబోయే తరాల మనుగడనే ముప్పులోకి నెడుతోంది. అక్టోబర్ 14న జరుపుకునే అంతర్జాతీయ ఈ-వేస్ట్ దినోత్సవం ఈ విపత్తు తీవ్రతను ప్రపంచానికి మరోసారి గుర్తుచేస్తోంది. వేగంగా విస్తరిస్తున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాల మేఘాలను తొలగించి, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అత్యవసర స్థితిని ఈ రోజు మనకు స్పష్టం చేస్తోంది. ఐక్యరాజ్యసమితి తాజా నివేదికల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా దాదాపు 6.2 కోట్ల మెట్రిక్ టన్నుల ఈ-వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఇది 2010తో పోలిస్తే 82 శాతం అధికం. ప్రస్తుత ధోరణులు కొనసాగితే 2030 నాటికి ఈ పరిమాణం 8.2 కోట్ల టన్నులకు చేరుతుందని నివేదిక అంచనా. అంటే ప్రపంచం ఉత్పత్తి చేస్తున్న ఈ-వేస్ట్ వేగాన్ని తట్టుకునే స్థాయిలో సేకరణ, రీసైక్లింగ్ వ్యవస్థలు అభివృద్ధి చెందడం లేదు. కేవలం 20 శాతానికంటే తక్కువ భాగం మాత్రమే అధికారికంగా సేకరించబడి, సైంటిఫిక్ పద్ధతుల్లో రీసైకిల్ అవుతోంది. మిగిలిన 80 శాతానికి పైగా వ్యర్థాలు ప్రకృతి వనరులలో కలవడం లేదా మురికివాడల్లో అనధికారికంగా కాల్చివేయడం జరుగుతోంది. రోజువారీ జీవితంలో తక్కువ ధరకు లభిస్తున్నాయని మనం కొనుగోలు చేసే యుఎస్‌బి కేబుళ్లు, పవర్ బ్యాంక్‌లు, చార్జర్లు, ఇయర్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు వంటి 'చిన్న పరికరాలు' పాడవగానే పారేస్తున్నాం. ఈ-వ్యర్థాల్లో కేవలం చెత్త మాత్రమే కాదు... బంగారం, వెండి, రాగి, ప్లాటినం, కోబాల్ట్, లిథియం వంటి అత్యంత ఖరీదైన, విలువైన మూలకాలు ఉంటాయి. సరైన రీసైక్లింగ్ లేకపోవడం వల్ల ఏటా వందల కోట్ల రూపాయల విలువైన వనరులు బూడిదలో పోసిన పన్నీరవుతున్నాయి. పరికరాలలో ఉండే సీసం, పాదరసం, కాడ్మియం, బెరీలియం వంటి విషపూరిత రసాయనాలు నేల, నీరు, గాలిలో కలిసి పర్యావరణ వ్యవస్థను నాశనం చేస్తున్నాయి. ఫలితంగా క్యాన్సర్, నాడీ వ్యవస్థ రుగ్మతలు, శ్వాసకోశ సమస్యలు ప్రపంచ జనాభాను వేధిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ ఈ-వేస్ట్ దినోత్సవం-2026 "ఫాస్ట్ టెక్ చెత్తబుట్టలో వేయకండి, అధికారికంగా సేకరించండి!" అనే ఇతివృత్తాన్ని ఎంచుకుంది. అమెరికా, చైనా తర్వాత ప్రపంచంలోనే అతి పెద్ద మూడో ఈ-వేస్ట్ ఉత్పత్తిదారుగా భారతదేశం నిలిచింది. అమెరికా ఏటా దాదాపు 69 లక్షల టన్నుల ఈ-వ్యర్థాలను ఉత్పత్తి చేస్తుండగా, ఒక సగటు అమెరికన్ ఏడాదికి దాదాపు 21.3 కిలోల ఈ-వ్యర్థాలను పారవేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా సగటున ఒక వ్యక్తి ఏటా ఉత్పత్తి చేసే ఈ-వ్యర్థాల పరిమాణం 7.8 కిలోలు. కానీ అమెరికాలో ప్రతి ఒక్కరూ పారవేసే ఈ-వ్యర్థాలు ప్రపంచ సగటు కంటే దాదాపు 3 రెట్లు ఎక్కువ. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ అధ్యయనాల ప్రకారం- భారత్‌లో ఏటా దాదాపు 45 లక్షల టన్నుల ఈ-వ్యర్థాలు నమోదవుతున్నాయి. ఇందులో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు వంటివి 12 లక్షల టన్నులు కాగా, మొబైల్ ఫోన్లు, టెలికాం పరికరాలు 9 లక్షల టన్నుల వ్యర్థాలు నమోదవుతున్నాయి. వీటిని శాస్త్రీయ పద్ధతుల్లో రీసైక్లింగ్ చేయకపోవడం వల్ల తీవ్ర వాయు, జల కాలుష్యం ఏర్పడుతోంది. రసాయన విష ప్రభావంతో ఏటా 12 వేలకు పైగా అకాల మరణాలు సంభవిస్తున్నాయని, లక్ష మందికి పైగా చిన్నారులు సీసం ప్రభావంతో నరాల బలహీనతలకు గురవుతున్నారని అంచనా. 'దేశంలో ఈ-వేస్ట్ నిర్వహణ పర్యావరణ సమస్య మాత్రమే కాదు, సామాజిక ఆరోగ్య అత్యవసర పరిస్థితి కూడా. అనధికారిక రంగంలో పనిచేస్తున్న కార్మికులను సురక్షితమైన, అధికారిక రీసైక్లింగ్ చట్రంలోకి తీసుకురావడం తక్షణ అవసరం' సిఎస్‌ఇ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సునీతా నారాయణ్. 'ఈ-వేస్ట్' అనేది కేవలం వ్యర్థాల సమస్య మాత్రమే కాదు; అది మానవాళి భవిష్యత్తుకు, పర్యావరణ సమతుల్యతకు ఎదురవుతున్న తీవ్రమైన సవాలు. ఈ-వేస్ట్ దినోత్సవం సందర్భంగా మనమందరం-"తక్కువగా కొందాం, పాత వాటిని బాగుచేసి వాడదాం, వ్యర్థాలను బాధ్యతాయుతంగా రీసైకిల్ చేద్దాం!" అనే ప్రతిజ్ఞ తీసుకోవాలి. సాంకేతిక పురోగతి... పర్యావరణ నాశనానికి హేతువు కాకూడదు, మానవ వికాసానికి, హరిత భవిష్యత్తుకు పునాది కావాలి. ఫాస్ట్ టెక్ మాత్రమే కాదు.. భవిష్యత్తు తరాలకు భద్రమైన భూమి కూడా కావాలి!

## జైలర్-2 టికెట్ ధరల పెంపునకు అనుమతి

**హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా జైలర్-2 సినిమాకు వారం రోజుల పాటు టికెట్ల ధరలు పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ చిత్రం ఈ నెల 15న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. సినిమా నిర్మాత కళానిధి మారన్ విజ్ఞప్తి మేరకు నిబంధనలు సడలిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. సింగిల్ స్క్రీన్‌లలో టికెట్ ధరపై రూ. 50, మల్టీప్లెక్స్‌ల్లో రూ. 75 జీఎస్టీతో కలిపి పెంపుదలకు అనుమతి ఇచ్చింది. సినిమా విడుదలైన 15-21 రోజుల వరకు పెంచిన ధరలు అమల్లో ఉంటాయి. రోజుకు ఐదు ప్రదర్శనలకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.

## ఇథనాల్ పెట్రోల్ విధానంపై
## కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలి

వ్యవసాయ రంగంపై ప్రభావాలను సమీక్షించాలి

రైతుల ఆదాయం, ఆహార భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

సెమినార్లో ప్రొఫెసర్ నాగేశ్వర్




**మిర్యాలగూడ ప్రతినిధి, అక్టోబర్ 11: (తెలంగాణ పత్రిక):** పెట్రోల్‌లో ఇథనాల్‌ను కలిపి వినియోగించే విధానంపై కేంద్ర ప్రభుత్వానికి ముందు చూపు లేకనే ఆహార భద్రత విధానంలో ప్రతిష్టంబన ఏర్పడిందని దీనిపై కేంద్ర ప్రభుత్వంపునరాలోచన చేయాల్సిన అవసరం ఉందని ప్రొఫెసర్ నాగేశ్వర్ అభిప్రాయ పడ్డారు. ఆదివారం స్థానిక అనుధితి ఫంక్షన్ హాల్ లో రైతు సంఘం నల్లగొండ జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన భారత దేశంలో ఆహార భద్రతపై ఇథనాల్ విధాన ప్రభావం అనే అంశంపై జరిగిన సెమినార్లో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి సంబంధించిన ఇథనాల్ వినియోగం ద్వారా ముడి చమురు దిగుమతులను తగ్గించడం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటం వంటి లక్ష్యాలు ఉన్నప్పటికీ, ఈ విధానం వల్ల రైతులకు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌కు, ఆహార భద్రతకు కలిగే ప్రభావాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. చెరకు, మొక్కజొన్న వంటి పంటల నుంచి ఇథనాల్‌ను ఉత్పత్తి చేస్తే ఇథనాల్‌కు పెరుగుతున్న డిమాండ్ ఈ పంటలను సాగు చేసే రైతులకు అదనపు మార్కెట్ అవకాశాలను కల్పించ వచ్చారు. అయితే, ఇథనాల్ ఉత్పత్తి కోసం వ్యవసాయ పంటల వినియోగం పెరిగినప్పుడు ఆహార అవసరాలు, పశుగ్రాస లభ్యత, పంటల ధరలు, సాగునీటి వినియోగంపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాని వివరించారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు సాగు ఖర్చులు తగ్గడం, మార్కెట్‌లో స్థిరమైన డిమాండ్ ఉండటం అత్యంత ముఖ్యమని . ఇథనాల్ విధానం వల్ల కలిగే ప్రయోజనాలు రైతులకు ఎంతవరకు చేరుతున్నాయి? ఉత్పత్తిదారులకు, వినియోగదారులకు కలిగే లాభనష్టాలు ఏమిటి? పంటల సాగు విస్తీర్ణంలో మార్పులు చోటుచేసుకుంటే ఆహార ధాన్యాల ఉత్పత్తిపై ఎలాంటి ప్రభావం పడుతుంది? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు అవసర మన్నారు. దేశంలో వ్యవసాయం కోట్లాది కుటుంబాలకు జీవనాధారమని వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేసే ఏ విధానమైనా రైతుల ఆదాయం, ఆహార భద్రత, పర్యావరణ సమతుల్యతను దృష్టిలో ఉంచుకొని అమలు చేయాలన్నారు. ఇథనాల్ ఉత్పత్తి కోసం పంటలను వినియోగించే విధానంలో ఆహార అవసరాలకు విఘాతం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అలాగే, నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో పంటల సాగు, నీటి వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రభుత్వం ఇథనాల్ విధానంపై స్వతంత్ర నిపుణుల కమిటీతో సమగ్ర అధ్యయనం చేయించి, రైతు సంఘాలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు, వినియోగదారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలనిసూచించారు. రైతులకు ప్రయోజనం చేకూర్చేలా, ఆహార భద్రతకు భంగం కలగకుండా, పర్యావరణానికి మేలు చేసే విధంగా విధానంలో అవసరమైన మార్పులు చేపట్టాలని తెలిపారు. రైతుల సంక్షేమం, దేశ ఆహార భద్రత, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత సాధించడమే ప్రభుత్వ విధానాల ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఇంధన అవసరాలను తీర్చే ప్రయత్నంలో వ్యవసాయ రంగ ప్రయోజనాలు విస్మరించబడకుండా ఇథనాల్ పెట్రోల్ విధానాన్ని సమీక్షించాలని అన్నారు.. ఎందుకంటే రైతుల ప్రయోజనాలే దేశ ప్రయోజనాలు పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం అనేది కేవలం ఇంధనానికి సంబంధించిన అంశం మాత్రమే కాదని ఇది వ్యవసాయ ఉత్పత్తి, రైతుల ఆదాయం, ఆహార భద్రత, భూగర్భ జలాలు, పర్యావరణం, దేశ ఆర్థిక వ్యవస్థతో ముడిపడి ఉన్న విధాన మని తెలిపారు. ఆహార పంటల నుంచి ఇంధన పంటల వైపు సాగు మళ్లడం, నీటి వనరులపై ఒత్తిడి పెరగడం, పంటల ధరల్లో మార్పులు రావడం వంటి ప్రమాదాలను కూడా విస్మరించకూడదని చెప్పారు. దేశానికి ఇంధన భద్రత ఎంత ముఖ్యమో, ప్రజలకు ఆహార భద్రత కూడా అంతే ముఖ్యమ ని రైతులకు గిట్టుబాటు ధర, ప్రజలకు సరసమైన ఆహారం, వ్యవసాయానికి అవసరమైన నీరు, పర్యావరణ పరిరక్షణ ఈ నాలుగు అంశాలకు సమాన ప్రాధాన్యం ఇచ్చినప్పుడే ఇథనాల్ విధానం దీర్ఘకాలంలో ప్రయోజనకరంగా మారుతుందని తెలిపారు. రైతు సంఘం జాతీయ నాయకులు జూలకంటి రంగారెడ్డి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేనిసు దర్శన్ మాట్లాడుతూ ఇంధన అవసరాల కోసం వ్యవసాయాన్ని ఉపయోగించుకోవచ్చు. కానీ వ్యవసాయాన్ని కేవలం ఇంధన ముడిపదార్థాల సరఫరా రంగంగా మార్చకుండా, రైతుల జీవనోపాధిని మరియు దేశ ఆహార భద్రతను కాపాడటం ప్రభుత్వ విధానంలో ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు. నవంబర్ 15 నుండి 18వ తేదీ వరకు నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగే జాతీయ రైతు సంఘం మహాసభ జగనున్నదని దేశవ్యాప్తంగా 1000 మంది ప్రతినిధులు ఆ మహాసభలకు హాజరు కానున్నారని మహాసభలను విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, ఆదర్శ రైతు జోనాలగడ్డ మోహన్ రెడ్డి, పాల్గొన్నారు.



# రాకేష్ రెడ్డిని గెలిపించి కేసీఆర్‌కు విజయ కానుకగా ఇద్దాం

- పట్టభద్రుల ఓటర్ల నమోదుపై బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టి సారించాలి
- మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు
- ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకుడు రాకేష్ రెడ్డి: ఉప్పల వెంకట రమణ
- పదవి కోసం కాదు.. ప్రజా సమస్యల పరిష్కారమే నా లక్ష్యం: ఏనుగుల రాకేష్ రెడ్డి






**తెలంగాణ పత్రిక దమ్మపేట అక్టోబర్ 11:** అశ్వారావుపేట నియోజకవర్గంలో పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేసే లక్ష్యంతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆదివారం దమ్మపేటలోని వినాయక ఫంక్షన్ హాలులో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియ ఇన్‌చార్జి ఉప్పల వెంకట రమణ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన నాయకులు, బాధ్యులు, కార్యకర్తలు పాల్గొని ఎన్నికల కార్యాచరణపై చర్చించారు.



**పట్టభద్రుల ఓటర్ల నమోదును ఉద్యమంలా చేపట్టాలి**

ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఓటర్ల నమోదు ప్రక్రియ కీలకమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను నాయకులు, కార్యకర్తలు సమష్టిగా తీసుకోవాలని సూచించారు. ఐదు మండలాల్లోని పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ఓటర్ల నమోదును వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో ఏనుగుల రాకేష్ రెడ్డిని గెలిపించి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజయ కానుకగా అందించాలని అన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ఎన్నికల లక్ష్య సాధనకు క్రమశిక్షణతో కృషి చేయాలని స్పష్టం చేశారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు ఉప్పల వెంకట రమణ మాట్లాడుతూ ప్రజల్లో బీఆర్ఎస్ పట్ల ఆదరణ పెరుగుతోందని, రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ నాయ కత్వం రావాలని పలువురు ఆకాంక్షిస్తున్నారని అన్నారు. ప్రజల సమస్యలపై అవగాహనతో పాటు వాటి పరిష్కారం కోసం పోరాడే నాయకులు శాసనమండలిలో ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాకేష్ రెడ్డి నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కా రం కోసం కృషి చేస్తున్న నాయకుడని కొనియా డారు. పార్టీ నాయకులు వ్యక్తిగత విభేదాలకు తావి వ్వకుండా ఐక్యంగా పనిచేయాలని, పట్టభద్రుల ఓటర్ల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ వహించి రాకేష్ రెడ్డి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**ప్రజల సమస్యల పరిష్కారమే నా ప్రధాన లక్ష్యం**

ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందనే నమ్మకం తనకు ఉందని తెలిపారు. గత ఎన్నికల్లో ఓటమి ఎదురైనప్పటికీ ప్రజలకు దూరం కాకుండా వారి మధ్యే ఉంటూ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నానని చెప్పారు. పదవుల కోసం కాకుండా ప్రజల సమస్యలను శాసనమండలి వేదికగా బలంగా వినిపించి, వాటి పరిష్కారానికి కృషి చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ప్రత్యర్థులకు అధికార, ఆర్థిక బలం ఉన్నప్పటికీ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్లక్ష్యానికి తావివ్వకుండా క్షేత్రస్థాయిలో పనిచేయాలని కోరారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడి పేరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నాయకులందరూ సమన్వయంతో ముందుకు సాగితే విజయం సాధించడం సాధ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ మండల అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, ఐదు మండలాల నాయకులు, పార్టీ బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆడపిల్లల స్వేచ్ఛ, సమానత్వం కోసం ఉద్యమిద్దాం

బర్కత్ పురా శ్రీ ఆకాశ్ కాలేజీలో ఘనంగా ఎస్ఎఫ్ఐ బతుకమ్మ వేడుకలు

బతుకమ్మ బతుకుల పండుగ..ఆడబిడ్డలకు భరోసా కల్పిద్దాం

దాడులు, వివక్షను ధైర్యంగా తిప్పికొట్టాలి : ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపు




**హైదరాబాద్:** సమాజంలో ఆడపిల్లల స్వేచ్ఛ, సమానత్వం, భద్రత కోసం మహిళలు, విద్యార్థినిలు సంఘటితమై పోరాడాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపు నిచ్చారు. బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, అది ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, బతుకులకు భరోసా కల్పించే పండుగ అని ఆమె స్పష్టం చేశారు. ఎస్ఎఫ్ఐ (స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బర్కత్‌పురాలోని శ్రీ ఆకాశ్ కాలేజీలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన మల్లు లక్ష్మి విద్యార్థినిలతో కలిసి బతుకమ్మ ఆడి వారిలో ఉత్తేజాన్ని నింపారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. సమాజంలో నిత్యం మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపులు, వివక్షకు వ్యతిరేకంగా గళమెత్తాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉంటూ తమ హక్కులను తామే కాపాడుకోవాలని సూచించారు. సావిత్రిబాయి పూలే, వీరనారి చిట్యాల ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి వంటి పోరాట యోధులను ఆదర్శంగా తీసుకొని, అన్యాయాలను ధైర్యంగా ఎదుర్కోవాలని విద్యార్థినిలకు సూచించారు. సమాజంలో ప్రతి ఆడపిల్లను పుట్టనివ్వాలని, స్వేచ్ఛగా బతకనివ్వాలని, ఆమె ఉన్నత చదువులు చదువుకొని ఎదిగేందుకు సమాన అవకాశాలు కల్పించాలని లక్ష్మి డిమాండ్ చేశారు. మహిళలకు, విద్యార్థినిలకు ఎలాంటి సమస్య వచ్చినా ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా నిలుస్తాయని భరోసా ఇచ్చారు. దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు బాధ్యతాయు తంగా వ్యవహరించాలని, మహిళా రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు.

**హక్కులపై అవగాహన కోసమే ఈ వేడుక**

ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. కేవలం సంబరాలకే పరిమితం కాకుండా మహిళల హక్కులు, సమానత్వం, భద్రతపై విద్యార్థినిల్లో చైతన్యం తీసుకురావడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఆడబిడ్డల హక్కుల పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు . ఈ కార్యక్రమంలో ఆకాశ్ కాలేజీ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెనిన్ గువేరా, జిల్లా ఉపాధ్యక్షులు రజనీకాంత్, ప్రవీణ్, అర్జున్, జిల్లా కమిటీ సభ్యులు భరత్, అశ్వక్, నాయకులు నిలోత్పల్, కిరణ్, చింటూ, డెన్జిల్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బోర్ల కింద ఎట్టిపరిస్థితుల్లో వరి వేయొద్దు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**సత్తుపల్లి:** ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో బోర్ల కింద వరిని ఎట్టిపరిస్థితుల్లో వేయవద్దని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. కొద్దిపాటి నీటి సదుపాయం ఉంటే ఆయిల్‌పామ్‌తో పాటు కూరగాయలు, పశువుల మేత వేసుకుని జీవాలను రక్షించుకోవాలన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహాన్ని ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం సభలో తుమ్మల మాట్లాడారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ ఎంత కీర్తి ప్రతిష్ఠలు పొందారో తెలంగాణ సాధనలో కొండా లక్ష్మణ్ బాపూజీది అంతే పాత్ర ఉందని కొనియాడారు. 'ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా తీవ్రమైన ప్రకృతి వైపరీత్యం రాబోతోంది. భూగర్భ జలాలు లోతుకుపోతున్నాయి. ఏ రిజర్వాయర్‌లోనూ విద్యుత్తుకు అవసరమైన నీళ్లు లేవు. తాగునీటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుంటే తీవ్రమైన కష్టాలు ఉంటాయి. సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలి. గోదావరి ఎండిపోయేలోపు దేవుడి దయతో నీటిని తెచ్చి ఈ ప్రాంతాన్ని కాపాడుకుంటాం' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పురచైర్‌పర్సన్ ఎండీ రెహానాబేగం, సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నీరా ప్రాజెక్టుపై నిర్లక్ష్యం

నందనంలో తుప్పుపడుతున్న యంత్రాలు..

ప్రారంభించాలని కోరుతున్న గీత కార్మికులు..కొత్త విధానాల పాలసీ రూపకల్పన అమలు ఎప్పుడు ?



**భువనగిరి:** రాష్ట్రంలో గీత కార్మికులకు అండగా నిలిచేందు కు ఏర్పాటైన నీరా పాలసీ, నీరా ప్రాసెసింగ్ ప్లాంట్లు, నీరా కేఫ్‌ల నిర్వహణ తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. గత ప్రభుత్వంలో అట్టహాసంగా నీరా ప్రాజెక్టును ప్రారంభించినా ఆ తర్వాత అనుకున్నంత వేగంగా ముందుకు అడుగులు పడలేదు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటై నీరాను హెల్త్ డ్రింక్‌గా మార్చి స్టార్ హోటల్స్‌కు లింక్ చేసి కొత్త విధానాల రూపకల్పనకు ఏర్పాట్లు చేస్తామని ప్రకటన చేసింది. ప్రారంభంలో ఉన్న ఉత్సాహం ఆ తర్వాత చూపలేదన్న విమర్శలు ఉన్నాయి. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో గత బీఆర్ఎస్ హయాంలో నీరా కేఫ్ ప్రారంభం అయింది. రాష్ట్రవ్యాప్తంగా నీరా కేఫ్‌ను సరఫరా చేయడానికి భువనగిరి జిల్లా నందనం, రంగారెడ్డి జిల్లా ముద్విన్, సంగారెడ్డి జిల్లా మునిపల్లి, నల్లగొండ జిల్లా సర్వేల్‌లో నీరా సేకరణ కేంద్రాలు, ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళికలు జరిగాయి. అయినా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఈ నేపథ్యంలో రూ. 12 కోట్లతో నందనంలో ఏర్పాటు చేసిన ప్రాసెసింగ్ యూనిట్ వినియోగంలోకి రాకముందే అందులో ఉన్న యంత్రాలు తుప్పుపట్టాయి. ఇది పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా నిలుస్తోంది. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలే ఇందుకు కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**నీరా ప్రాజెక్టు నేపథ్యం**

భువనగిరి మండలంలోని నందనం గ్రామం లో నీరా ప్లాంట్ ఏర్పాటు చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం ఎన్నో ఏండ్లుగా పోరాడుతూ వచ్చింది. దీంతో నీరా ప్లాంట్ ఏర్పాటుకు గత ప్రభుత్వం సంకల్పించింది. ఆ మేరకు నందనంలో నాలుగు ఎకరాల్లో భవనం నిర్మించేందుకు రూ. 8కోట్లు విడుదల చేసింది. 2022 జులై 29న అప్పటి మంత్రి ఎక్సైజ్ శాఖ శ్రీనివాస్ గౌడ్, అప్పటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి నీరా కేంద్రం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన తర్వాత ఏడాదిలోనే భవన నిరాణాలు పూర్తయ్యాయి. నీరా కేంద్రంలో నిల్వకు అవసరమైన వివిధ రకాల యంత్రాలు అమర్చారు. కానీ ప్రారంభం కాలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి చొరవ తీసుకొని నీరా ప్రాజెక్టును ప్రారంభించాలని గీత కార్మికులు కోరుతున్నారు.

**స్టోరేజీ, ప్యాకింగ్, రవాణా అన్నీ ఇక్కడే**

రాష్ట్రంలోనే తొలిసారిగా నీరా ఉత్పత్తి కేంద్రం నందనంలో ఏర్పాటైంది. ఇది అందుబాటులోకి వస్తే.. నీరాను ఉదయాన్నే చెట్టు నుంచి తీసి నందనం ప్లాంట్‌కు తీసుకొస్తారు. నీరా కల్లుగా మారకుండా ఇక్కడే ప్రాసెస్ చేస్తారు. రోజూ రెండు వేల లీటర్ల నీరా.. కేంద్రానికి వచ్చే అవకాశం ఉంది. ఇక్కడి నుంచే ప్యాక్డ్ నీరాను హైదరాబాద్ కేఫ్‌తోపాటు ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తారు. సేకరణ, స్టోరేజీలు, ప్యాకింగ్, రవాణా నందనం నుంచే జరుగుతుంది. నీరా అనుబంధ ఉత్పత్తులను కూడా తయారు చేసే వీలుంటుంది. తాటి బెల్లం, చక్కెర, చాక్లెట్లు, తేనె వంటి 18రకాల వస్తువులను తయారు చేసే అవకాశం ఉంది. దాంతో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

**వెంటనే ప్రారంభించాలి : వట్టిపల్లి పవన్ గౌడ్**

నందనం నీరా ప్రాజెక్టును వెంటనే ప్రారంభించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. పిల్లల బతుకులు బాగుపడతాయని చూశా. 1993లో ఒకసారి ప్రారంభం కాగా, కొన్ని రోజులు మూత పడింది.

**మా పిల్లలైనా ప్రాజెక్టు ప్రారంభాన్ని చూస్తారా? .. మట్ట బాలేశ్వర్ గౌడ్**

2022లో ప్రారంభిస్తారని అనుకున్నాం. ఇప్పటివరకు ప్రారంభించలేదు. మేము చూడకపోయినా మా పిల్లలైనా ప్రాజెక్టు ప్రారంభం చూస్తారా లేదో తెలియడం లేదు.

**ప్రభుత్వానికి నివేదికలు పంపాం : (ఎక్సైజ్ సూపరింటెండెంట్ తూక్యానాయక్**

నీరా ప్రాజెక్టుకు సంబంధించి వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే ప్రారంభిస్తాం. ఒకే ప్రాజెక్టుకు రెండుసార్లు శంకుస్థాపన : 1993 నవంబర్ 13న మాజీ మంత్రులు(గాదె వెంకట్‌రెడ్డి, కె.జానారెడ్డి నందనంలో రూ. 70లక్షల అంచనా వ్యయంతో తాటి ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రారంభించారు. కానీ అది ముందుకు కొనసాగలేదు. దశాబ్దాలుగా మూతబడిన నందనం తాటి ఉత్పత్తుల కేంద్రంలో నీరా ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు గత బీఆర్ఎస్ సర్కారు 2022లో ముందుకొచ్చింది. 8 కోట్లతో నిర్మాణం చేపట్టి, యంత్రాలు బిగించింది కానీ ప్రారంభించ లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి అక్టోబర్ 2026 నాటికి మూడేండ్లు పూర్తవుతుంది.

## యువత కన్నెర్ర

విద్యార్థులు, యువజనులపై విచక్షణారహిత దాడులు

సీపీఐ(ఎం) రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్‌పై దాడి..సొమ్మసిల్లిన

తరువాత రోడ్డు పక్కనే పడేసిన పోలీసులు

అనంతరం ఆర్ఎంఎల్ ఆస్పత్రికి తరలింపు..

పరామర్శించిన సీపీఐ(ఎం) నేతలు, ఎంపీలు

నిరసనలతో హోరెత్తిన ఢిల్లీ



**న్యూ ఢిల్లీ:** విరిగిన లాఠీలు, మూకుమ్మడి దాడులు, ఒక్కర్ని చేసి చుట్టుముట్టి ఒళ్లు హూనమయ్యేలా చావబాదిన దృశ్యాలు, ప్రజల్ని భయభ్రాంతుల్ని చేసేలా కేంద్ర భద్రతా బలగాల కవాతులు, ఎక్కడికక్కడ విద్యార్థి, యువజనుల అరెస్టులు, రాజకీయ నాయకులపైనా విచక్షణారహిత దాడులు, మూకుమ్మడి అరెస్టులతో దేశ రాజధాని ఢిల్లీ భీతిల్లింది. కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోడీ, హోంమంత్రి అమిత్‌షాల ఆదేశాలతో ఢిల్లీలోని బీజేపీ రాష్ట్ర ప్రభుత్వ డైరెక్షన్‌లో జరిగిన ఈ దమనకాండకు ఢిల్లీ పోలీసులకు కేంద్ర భద్రతా బలగాలు తోడయ్యాయి. నిరాయుధులైన నిరసనకారులపై దాడులతో రెచ్చిపోయారు. ఒంటిపై లాఠీదెబ్బలు పడుతున్నా, వీపులు చీరిపోతున్నా విద్యార్థులు, యువతరం వెన్ను చూపలేదు. ఎంత కొడతారో కొట్టండి...వెనక్కి తగ్గేది లేదంటూ లాఠీలకు ఒళ్లు అప్పగించి ధైర్యాన్ని ప్రదర్శించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాల్సిందేనని తేల్చిచెప్పారు. అప్పటి వరకు వెనక్కి తగ్గేది లేదని భీష్మించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న ఆందోళనకారులపైకి శత్రుమూకలపై దాడులు చేసినట్టే పోలీసులు, భద్రతాబలగాలు వ్యవహరించాయి. సీపీఐ(ఎం) రాజ్యసభ సభ్యులు జాన్ బ్రిట్టాస్‌ను ఒంటరిగా చుట్టుముట్టి లాఠీలతో కుళ్లబొడిచి, ఆయన సృహ తప్పాక రోడ్డుపక్కన పడేసి వెళ్లిపోయారంటే 'ఖాకీ క్రౌర్యం' ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో వెల్లువెత్తిన ప్రజాందోళనలు, నిరసనలను అణచివేసేందు కు కేంద్ర బలగాలు, పోలీసులు తీవ్ర నిర్బంధా నికి పాల్పడ్డారు. ఢిల్లీలోని ప్రధాన ప్రాంతాల్లో వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు మిన్నంటాయి. ఆందోళనకారులను అరెస్టు చేసి వాహనాల్లో కుక్కిన తరువాత కూడా వారిపై దాడులు కొనసాగించారు. ఒక్కొక్కరిని లక్ష్యంగా చేసుకుని పోలీసులు మూకుమ్మడిగా దాడి చేశారు. సీపీఐ(ఎం) రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్ మీడియాతో మాట్లాడుతుండగా ఆయనపై పోలీసులు దాడి చేశారు. అనంతరం రోడ్డుపక్కనే ఆగి ఉన్న వాహనం మెట్లపైనే పడేశారు. సొమ్మసిల్లిపోయిన ఆయ నను ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు చూసి ఆటోలో ఆర్ఎంఎల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయనను సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, కేరళం ఆర్థిక శాఖ మాజీ మంత్రి థామస్ ఐజాక్, ఎంపీలు వి. శివదాసన్, ఎఎ రహీంలు పరామర్శించారు. వైద్యులతో చర్చించిన నేతలు, జాన్ బ్రిట్టా స్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆదివారం ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ ఆందోళనలకు ప్రధాన కేంద్రంగా మారింది. విద్యార్థులు, యువకుల ను ఈడ్చుకుంటూ వెళ్లి పోలీసు వాహనాల్లో పడేయడంతో పాటు, వాహనాల్లోనూ దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనల్లో పలువు రు నాయకులు, కార్యకర్తలు గాయపడ్డారు.

**విద్యార్థులపై మూకుమ్మడి దాడులు**

సీజేపీ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు కన్నాట్ ప్లేస్‌లో నిరసన జరిగింది. రాజీవ్ చౌక్ మెట్రో స్టేషన్ రెండో గేటు సమీపం నుంచి జంతర్ మంతర్ వైపు కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరారు. పాలికా బజార్ ప్రాంతానికి చేరుకోగానే కేంద్ర బలగాలు, పోలీసులు ఒక్కసారిగా ఆందోళనకారులపై విరుచుకుపడ్డారు. నాయకులను, కార్యకర్తలను చుట్టుముట్టి కొట్టుకుంటూ పోలీసు వాహనాల్లోకి ఈడ్చుకెళ్లారు. ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు ఆదర్శ్ ఎం. సాజి, డీవైఎఫ్ఐ కేంద్ర కార్యవర్గ సభ్యుడు జైక్ సి. థామస్‌పై తీవ్రంగా దాడి చేశారు. ఆదర్శ్ కంటికి గాయమై రక్తం కారింది. జైక్ సి. థామస్, డీవైఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యుడు బాలేందర్ షాలను రోడ్డుపై ఈడ్చుకెళ్లారు. ఎస్ఎఫ్ఐ ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి సూరజ్ ఇళమణ్, కేంద్ర కమిటీ సభ్యుడు అభిజిత్ మణిలాల్, ఢిల్లీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సిమ్రాన్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు శరణ్య కూడా దాడుల్లో గాయపడ్డారు. ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేశ్ సీరంగరాజ్ దుస్తులను సైతం చించివేశారు. సీజేపీ నాయకుడు సుధీర్ సాంగ్వాన్, ఎస్ఎఫ్ఐ అఖిల భారత సంయుక్త కార్యదర్శి ఐషీఘోష్‌ను కూడా అరెస్టు చేశారు.

**సాయంత్రం వరకూ కొనసాగిన ఆందోళనలు**

మధ్యాహ్నం మూడు గంటలు దాటిన తరువాత ఆర్‌కె ఆశ్రమ్ మెట్రో స్టేషన్ సమీపం నుంచి ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎ కార్యకర్తలు మరోసారి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఏ అఖిల భారత అధ్యక్షురాలు నేహా బోరాతో పాటు పలువురిని అరెస్టు చేశారు. సాయంత్రం ఆరు గంటలు దాటిన తరువాత ఎస్ఎఫ్ఐ మహిళా కార్యకర్తలు జాతీయ పతాకాలతో కన్నాట్ ప్లేస్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ అఖిల భారత సంయుక్త కార్యదర్శి ఐషీ ఘోష్, ఢిల్లీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మెహినా ఫాతిమా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు సఖి బంధు తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. వారిని చీకటి పడిన తరువాత లైట్లు లేని వాహనాల్లో విద్యార్థినీలను తరలించారు. అందులో మగ పోలీసులను విద్యార్థినీలపై దాడి చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి.

## ఒక యూనిట్ విద్యుదుత్పత్తి వ్యయం రూ.5.61

సింగరేణి కొత్త ప్లాంటు నిర్మాణ ఖర్చు భారీగా పెరుగుదల



**హైదరాబాద్:** మంచిర్యాల జిల్లా పెగడపల్లిలో సింగరేణి సంస్థ కొత్తగా నిర్మాణం చేపట్టిన 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంటు(టీపీపీ) నిర్మాణ వ్యయం తొలుత వేసిన అంచనాలకన్నా భారీగా పెరిగింది. 2024–25 లెక్కల ప్రకారం నిర్మాణ వ్యయం రూ. 9,697 కోట్లకు చేరుతుందని, ఇందులో ఒక యూనిట్ విద్యుదుత్పత్తికి తొలి ఏడాదే రూ. 5.61 అవుతుందని డిస్కంలు స్పష్టం చేశాయి. విద్యుత్ లైన్ల కిరాయి వ్యయం యూనిట్‌కు మరో 60 పైసలు అదనం. సగటున మెగావాట్‌కు పెట్టుబడి వ్యయం రూ. 11.99 కోట్లు అవుతుందని అంచనా. గతంలో రూ. 10.80 కోట్ల వరకూ అవుతుందనుకున్నా 2024–25 నాటికే మరో రూ. కోటి అదనంగా పెరిగింది. నిర్మాణం పూర్తికావడానికి ఇంకా నాలుగేళ్లపాటు సమయం పడుతుందని తెలిపినందున మరింత వ్యయం పెరగవచ్చని అంచనా. మరోవైపు మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు సగటు వ్యయం రూ. 5.25కి మించరాదని జాతీయ సౌరవిద్యుత్ సంస్థ ఇటీవల నిర్వహించిన టెండర్లలో తేలడం గమనార్హం. సింగరేణికి మొదటి దశ కింద ప్రభుత్వం పెగడపల్లిలో 1,983 ఎకరాల స్థలాన్ని గతంలో కేటాయించింది. ఇందులో తొలిదశ కింద 1,200 మెగావాట్ల థర్మల్ ప్లాంటును కట్టగా, ఇప్పుడు రెండోదశ కింద 800 మెగావాట్ల యూనిట్ నిర్మాణాన్ని ప్రారంభించింది. మొత్తం పెట్టుబడిలో 75% సొమ్మును విద్యుత్ ఆర్థిక సంస్థల నుంచి రుణాలుగా తీసుకోవాలని నిర్ణయించారు.

**ఈఆర్‌సీలో డిస్కంల పిటిషన్:** ఇక్కడ ఉత్పత్తయ్యే కరెంటును తొలుత రాజస్థాన్‌కు ఇవ్వాలని యోచించారు. తాజాగా తెలంగాణ డిస్కంలు తామే కొంటామని విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్‌సీ)లో పిటిషన్ దాఖలు చేశాయి. దీనికి అనుబంధంగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను తెలంగాణ దక్షిణ డిస్కం ఈఆర్‌సీకి అందజేసింది. సింగరేణి కాలరీస్ కంపెనీ రూపొందించిన ఈ నివేదికలో నిర్మాణ వ్యయం, మెగావాట్‌కు అయ్యే ఖర్చు, విద్యుదుత్పత్తి వ్యయానికి సంబంధించిన వివరాలున్నాయి. ప్లాంటు నిర్మాణం ప్రారంభించిన తేదీ నుంచి పనులు పూర్తిచేసి విద్యుదుత్పత్తి ప్రారంభించడానికి 48 నెలల సమయం పడుతుందని అంచనా వేశారు. ఈ పిటిషన్‌పై ఈఆర్‌సీ ఈ నెల 29న బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు తెలిపింది. ప్రాజెక్టు వ్యయం పెరుగుదలతో వినియోగదారులపై ఏ మేరకు విద్యుత్ భారం పడుతుందనేది ఈఆర్‌సీ విచారణ చేయనుంది.

**ఒడిశా నుంచి బొగ్గు సరఫరా**

ఈ కొత్త ప్లాంటుకు ఒడిశాలోని నైనీ గని నుంచి ఏటా 40 లక్షల టన్నుల బొగ్గు సరఫరా అవుతుందని సింగరేణి తెలిపింది. 800 కి.మీ. దూరం నుంచి బొగ్గు రవాణా వ్యయం కూడా రానురాను మరింత పెరగొచ్చు. తెలంగాణలోని సింగరేణి గనులకు దగ్గరలోనే పెగడపల్లి ప్లాంటు స్థలం ఉన్నా, వాటిలో నాణ్యమైన బొగ్గు లేనందున నైనీ నుంచి తీసుకురావాలని నిర్ణయించినట్లు సమాచారం. షట్‌పల్లి వద్ద గోదావరి నది నుంచి ఒక టీఎంసీ, దేవులవాడ వద్ద ప్రాణహిత నది పంపుహౌస్ నుంచి మరో 2 టీఎంసీల నీటిని ఈ ప్లాంటుకు తీసుకోవాలని సింగరేణి సంస్థ ప్రతిపాదించింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల 2022–23 నాటికే ఏటా 5,325 మిలియన్ యూనిట్ల కరెంటు ఎత్తిపోతల పథకాలకే ప్రత్యేకంగా వినియోగం ఉంటుందని ఈ ప్లాంటు నిర్మాణం అవసరమని ప్రతిపాదించారు.

RNI No. APTEL/2008/23088
తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా విజన్
Epaper.Telanganapatrika.in



## నేటి నుంచి శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

శాస్త్రోక్తంగా అంకురార్పణ



**తిరుమల:** తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. భక్తులను ఆకట్టుకునేలా తిరుమల క్షేత్రాన్ని విద్యుత్, పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి అంకురార్పణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విష్వక్సేనులవారిని ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. గత నెలలో జరిగిన సాలకట్ల బ్రహ్మోత్సవాల తరహాలో ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలనూ వైభవంగా నిర్వహించనున్నారు. దసరా సెలవులతోపాటు పెరటాశి మాసం చివరివారం కావడంతో ఈ బ్రహ్మోత్సవానికి భక్తులు భా రీగా వస్తారనే అంచనాతో టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఇక, ఈ తొమ్మిది రోజులపాటు వివిధ వాహనాలపై ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చేందుకు శ్రీవారి వాహనాలను ముస్తాబు చేశారు. తొలి రోజు సోమవారం రాత్రి పెద్దశేష వాహనంపై స్వామివారు విహరిస్తారు.

**బ్రహ్మోత్సవాల్లో నేడు**

**ఉదయం:** 9–11 గంటల మధ్య బంగారు తిరుచ్చి
**రాత్రి:** 7–9 గంటల మధ్య పెద్ద శేష వాహన సేవ

## సుప్రీంకు మార్చ్!

'ఓటు చోరీ'పై నేడు ఇండి కూటమి ఆందోళన
'చలో ఢిల్లీ – ప్రజాస్వామ్యం కోసం మార్చ్' పేరిట
కనాట్‌ప్లేస్ నుంచి సుప్రీంకోర్టు వరకు భారీ ర్యాలీ
భారీగా తరలిరావాలని శ్రేణులకు కాంగ్రెస్ పిలుపు
యువత స్వరం మరింతగా ప్రతిధ్వనిస్తుంది: రాహుల్
దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోంది: ఖర్గే
ఢిల్లీలో భారీగా మోహరించిన భద్రతా బలగాలు




**న్యూఢిల్లీ/ బెంగళూరు:** దేశ రాజధాని ఢిల్లీలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా, 'సర్' ప్రక్రియ నిలిపివేత, బ్యాలెట్ పేపర్లతో ఎన్నికల నిర్వహణ డిమాండ్లతో ఇండి కూటమి సోమవారం భారీ ర్యాలీకి సిద్ధమైంది. 'చలో ఢిల్లీ – ప్రజాస్వామ్యం కోసం మార్చ్' పేరిట ఢిల్లీలోని కనాట్‌ప్లేస్ నుంచి సుప్రీంకోర్టు వరకు వెళ్లి.. చీఫ్ జస్టిసకు వినతిపత్రం అందజేస్తామని ఇండి కూటమి నేతలు ప్రకటించారు. కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలతోపాటు భారీ సంఖ్యలో యువత ఈ ర్యాలీలో పాల్గొంటారని తెలిపారు. దీనికి అనుగుణంగా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి ముఖ్యమంత్రులు, మంత్రులు, నేతలు, కార్యకర్తలు ఢిల్లీకి చేరుకోనున్నారు. అయితే తనను కలిసి, వినతిపత్రం ఇచ్చేందుకు ప్రతిపక్ష నేతలు చేసిన విజ్ఞప్తిని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ తిరస్కరించినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. మరోవైపు ఢిల్లీలో వేలాది మంది పోలీసు, పారామిలిటరీ బలగాల మోహరింపు కొనసాగుతోంది. ఎక్కడా చిన్న నిరసన కూడా కనిపించకుండా బారికేడ్లు, ట్రాఫిక్ మళ్లింపులు, బలగాల తనిఖీలతో కట్టుదిట్టం చేస్తున్నారు. ఆదివారం వామపక్ష విద్యార్థి సంఘాలు నిరసన ప్రదర్శనలు చేపట్టగా.. పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. సోమవారం ఇండి కూటమి ఆందోళనతో పరిస్థితి ఎలా మారుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. ప్రభుత్వం ఆదివారం కూడా ఢిల్లీలో భారీ ఎత్తున భద్రతా బలగాలను మోహరించింది. ఎక్కడ చిన్న నిరసన కూడా నిర్వహించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఊరేగింపుగా బయలు దేరిన వివిధ వామపక్ష విద్యార్థి సంఘాల కార్యకర్తలను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. కన్నాట్ ప్లేస్, జంతర్ మంతర్, మండీ హౌజ్, పటేల్ చౌక్, మధురా రోడ్, సుప్రీంకోర్టు ఆశ్రమం, లాజపత్‌నగర్ మెట్రోస్టేషన్ తదితర 30 ప్రాంతాల్లో బారికేడ్లు పెట్టారు. ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేశారు. దీనితో అనేక చోట్ల వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు.

**నేడు 'ఇండి' ర్యాలీ**

సోమవారం ఇండి కూటమి ఢిల్లీలో నిరసన ప్రదర్శనను చేపట్టనుంది. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కనాట్‌ప్లేస్ నుంచి సుప్రీంకోర్టు వరకు భారీ ర్యాలీ నిర్వహించి.. సీజేఐ సూర్యకాంత్‌కు వినతిపత్రం సమర్పించాలని కూటమి నేతలు నిర్ణయించారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది కార్యకర్తలు, ముఖ్యంగా యువత ఈ ఆందోళనలో పాల్గొనాలని కాంగ్రెస్ పిలుపునిచ్చింది. తెలంగాణ, కర్ణాటక, కేరళం రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి, డీకే శివకుమార్, సతీశన్‌తోపాటు పెద్ద సంఖ్యలో నేతలు ఢిల్లీకి రానున్నారు. మొత్తం పార్టీ ఎంపీలంతా ఢిల్లీ చేరుకోవాల్సిందిగా కాంగ్రెస్ నాయకత్వం ఆదేశాలు జారీ చేసింది. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెవీసతోపాటు ఇతర మిత్రపక్షాల నేతలు, కార్యకర్తలు కూడా ఢిల్లీకి చేరుకోనున్నారు. "సోమవారం పార్టీలకు, కులమతాలు, రాష్ట్రాలకు అతీతంగా భారతీయులుగా సుప్రీంకోర్టు వైపు పాదయాత్రగా సాగుతాం. యువత స్వరం ఇప్పుడు మరింత ప్రతిధ్వనిస్తుంది" అని రాహుల్ ఎక్స్‌లో పేర్కొన్నారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమల్లో ఉందని ఖర్గే విమర్శించారు.

**ప్రతిపక్ష నేతలతో భేటీకి సీజేఐ నిరాకరణ!**

సోమవారం తనను కలిసేందుకు సమయం కోరిన ప్రతిపక్ష నేతలు రాహుల్, ఖర్గేల విజ్ఞప్తిని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ తిరస్కరించినట్టు సమాచారం. చీఫ్ జస్టిస్ తన నిర్ణయాన్ని ప్రతిపక్ష నేతల అధికారిక ఈ–మెయిల్ చిరునామాలకు పంపారని, భేటీని నిరాకరించారని సంబంధిత వర్గాలు తెలిపాయి. తిరస్కరణకు కారణాలు వెల్లడించలేదు.

## ఇది ప్రజాపాలన కాదు.. రైతులను పీడించే పాలన: హరీష్‌రావు



**హైదరాబాద్:** పంటలు కాపాడుకునేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయాలని ఆందోళన చేసిన రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. ఇది ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' ఖాతా వేదికగా స్పందించారు. "కళ్ల ముందే ఎండుతున్న పంటలకు నీరివ్వమని అడిగిన రైతులపై కేసులు పెట్టడం సిగ్గుచేటు. రేవంత్ రెడ్డి పాలనలో రైతుల చేతులకు బేడీలు వేయడం, పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం పరిపాటిగా మారింది" అని హరీశ్ రావు విమర్శించారు. వారి చేతగానితనం వల్ల పంటలకు నీరందకపోతే, కడుపు మండి నిలదీసిన రైతులపై అక్రమ కేసులు బనాయిస్తారా? అని ప్రశ్నించారు. "ఇది ప్రజాపాలన కాదు. రైతులను పీడించే పాలన. తప్పు ప్రభుత్వం చేస్తే శిక్ష రైతులు అనుభవించాలా?" అని హరీశ్ రావు నిలదీశారు. రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# కేసీఆర్ రావాలంటున్నారే.. కేటీఆర్ కావాలంటున్నారే.. మళ్ళీ కారే రావాలంటున్నారే..!





పల్లెల నుంచి పట్టణాల దాకా మారుమోగుతున్న
కేసీఆర్, కేటీఆర్ పాటల సందడి
సారే రావాలంటున్నారే.. మళ్ళీ కారే
కావాలంటున్నారే..?
హోరెత్తుతున్న జానపదాలు
తెలంగాణ గుండెల్లో చెరగని ముద్ర..
గులాబీ బాస్ కేసీఆర్,
కేటీఆర్ పాలనా పరిమళాలపై ప్రజల చర్చ..!

**తెలంగాణ పత్రిక ప్రతినిధి, మెదక్ జిల్లా:** తెలంగాణ గడ్డపై పండుగ వచ్చిందంటే చాలు పల్లెల్లో జానపద పాటలు హోరెత్తుతాయి. వినాయక చవితి శోభాయాత్రలైనా, బతుకమ్మ సంబరాలైనా, డప్పు చప్పుళ్ల మోతలైనా తెలంగాణ సంస్కృతిలో పాట ఒక ప్రధాన భాగం. ఏ వేడుక జరిగినా అక్కడి వాతావరణాన్ని బట్టి కొత్త కొత్త పాటలు పుట్టుకొస్తుంటాయి, ప్రజలను విపరీతంగా ఆకట్టుకుంటుంటాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలోనూ, పల్లెల్లోనూ కొన్ని జానపద గీతాలు తెగ వైరల్ అవుతుండటం, అవే పాటలు పల్లెలు, పట్టణాల్లో మారుమోగుతుండటం గమనించదగ్గ విషయం. పల్లెల్లో మారుమోగుతున్న పాటలు.. గులాబీ నేతల జ్ఞాపకాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలైన పండుగల్లో ప్రజల మనసులోని భావాలను ప్రతిబింబించేలా సాగే పాటలకు ప్రత్యేక స్థానం ఉంది. పల్లెల్లో యువకులు వేసే నృత్యాలు, డప్పు బీట్లకు తగినట్లుగా వచ్చే పాటలు వేడుకల్లో ఉత్సాహాన్ని నింపుతాయి. ఇటీవలి కాలంలో వినాయక నిమజ్జనాలు, పండుగ వేడుకల్లో కొన్ని పాటలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. అందులో భాగంగా సారే రావాలంటున్నారే మళ్ళీ కారే కావాలంటున్నారే అంటూ సాగే పాట ప్రస్తుతం పల్లెలు, పట్టణాల్లో మార్మోగుతోంది. అభివృద్ధి, సంక్షేమం, శాంతిభద్రతలు, అన్ని వర్గాలకూ సమాన న్యాయం జరిగింది కాబట్టే కేసీఆర్, కేటీఆర్ ల పాలనా కాలపు మధుర జ్ఞాపకాలను ప్రజలు ఇప్పుడూ ఎంతో గొప్పగా నెమరువేసుకుంటున్నారు. పండుగ వేళ మారుమోగుతున్న ఆ పాటల ప్రతిధ్వని భవిష్యత్తులో తెలంగాణ రాజకీయాల్లో గులాబీ జెండా మళ్లీ ఎగరబోతుందనే బలమైన సంకేతాన్ని ఇస్తోంది. కేసీఆర్ నాయకత్వం, కేటీఆర్ చురుకైన కార్యాచరణే తెలంగాణను మళ్లీ ప్రగతి పథంలో నడిపిస్తాయనే నమ్మకం ప్రజల్లో బలంగా వేళ్లూనుకుందనడానికి ఈ పాటల ఘోషే ప్రత్యక్ష నిదర్శనం. ఈ పాటల హోరులో సహజంగానే రాష్ట్ర ప్రజలు గత బంగారు తెలంగాణ పాలనా రోజులను, ఉద్యమ నేత కేసీఆర్ పాలనను గుర్తుచేసుకుంటున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు ఎండిపోయిన మాగాణాలను కాళేశ్వరం ప్రాజెక్టుతో పులకరింపజేసిన కేసీఆర్ దార్శనికతను, రైతన్నల కళ్లలో ఆనందం నింపిన రైతుబంధు పథకాన్ని ఈ సందర్భంగా ప్రజలు కొనియాడుతున్నారు. కేవలం ఒక పాటగా ప్రారంభమైనా, అది నేడు తెలంగాణ ప్రగతికి ప్రతీకగా నిలిచిన గులాబీ బాస్ కేసీఆర్ నాయకత్వాన్ని గుర్తుచేసేలా మారుతుండటం విశేషం.

**ఉద్యమ నేతగా ప్రజల గుండెల్లో కేసీఆర్ స్థానం**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఆనాడు కేసీఆర్ చేసిన ఆమరణ నిరాహార దీక్ష, సాధించిన రాష్ట్ర సాధన చరిత్ర ఎప్పటికీ మరువలేనిది. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి తొలి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన కేసీఆర్ రాష్ట్ర ప్రగతిని దేశం మొత్తానికి ఆదర్శంగా నిలిపారు. కాళేశ్వరం జలాలతో ఎడారిలాంటి తెలంగాణను సస్యశ్యామలం చేసిన ఆధునిక భగీరథుడు ఆయన. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించిన ఘనత ప్రపంచ దేశాల ప్రశంసలందుకుంది. 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్ అందించి వ్యవసాయాన్ని పండుగ చేసిన నాయకుడిగా కేసీఆర్ పేరు ప్రతిష్టలు అశేష ప్రజానీకంలో చెరగని ముద్ర వేశాయి. అటువంటి జననేతను మళ్లీ రాష్ట్ర పీఠంపై చూడాలని ప్రజలు స్వచ్ఛంగా కోరుకుంటున్నారనడానికి పల్లెలు, పట్టణాల్లో మారుమోగుతున్న ఈ పాటలే ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నాయి. సంక్షేమంలో నంబర్ వన్ గా నిలిచిన కేసీఆర్ పాలనను, ఆయన అందించిన అద్భుతమైన సంక్షేమ ఫలాలను నేటికీ ప్రజలు గుర్తుచేసుకుంటూనే ఉన్నారు.

**యువతకు స్ఫూర్తి.. డైనమిక్ లీడర్ కేటీఆర్ పాత్ర**

ఇక కేసీఆర్ బాటలో నడుస్తూ తెలంగాణ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన డైనమిక్ లీడర్ కేటీఆర్ పాత్ర కూడా ఈ సందర్భంలో ప్రత్యేకంగా చర్చనీయాంశమవుతోంది. రాష్ట్రానికి ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రులుగా ఆయన చేసిన సేవలు అసాధారణం. హైదరాబాద్ ను ప్రపంచస్థాయి గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దడంలో, గూగుల్, అమెజాన్ వంటి దిగ్గజ కంపెనీలను రాష్ట్రానికి రప్పించడంలో కేటీఆర్ చూపిన దార్శనికత యువతను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రతి నిరుద్యోగ యువకుడికి, ప్రతి విద్యార్థికి అండగా నిలుస్తూ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా, ప్రజాక్షేత్రంలో గళం ఎత్తుతున్న తీరు గులాబీ శ్రేణుల్లో అపారమైన ఉత్సాహాన్ని నింపుతోంది. కష్టకాలంలో పార్టీని ధైర్యంగా వెన్నంటి నడిపిస్తూ, కేడర్ లో కొండంత బలాన్ని నింపుతున్న కేటీఆర్ నాయకత్వ పటిమను నేడు రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరూ ప్రశంసిస్తున్నారు. పల్లెలు, పట్టణాలు తలకిందులై పాడుకుంటున్నారంటే, దాని వెనుక కేటీఆర్ కష్టపడే తత్త్వం, ఆయన వాగ్ధాటి, యువతలో ఆయనపై ఉన్న అపారమైన అభిమానమే ప్రధాన కారణం.

**పాటల సందడి వెనుక ఉన్న ప్రజా ఆకాంక్ష**

తెలంగాణ సాంస్కృతిక జీవనంలో జానపద పాటలు ఎప్పుడూ ప్రజల నాడిని పట్టేస్తుంటాయి. పండుగ సమయాల్లో ఇలాంటి పాటలు మార్మోగడం ద్వారా పండగ శోభ మరింత పెరుగుతుంది. ప్రజలు ఎవరిని కోరుకుంటున్నారు, ఎవరి పాలనలో సుఖసంతోషాలతో ఉన్నారు అనేదానికి ఈ పాటల రూపంలో వస్తున్న ఆదరణే తిరుగులేని నిదర్శనం. అభివృద్ధికి చిరునామాగా నిలిచిన, అన్ని ప్రాంతాలనూ సమగ్రంగా అభివృద్ధి చేసిన గులాబీ నాయకత్వం వైపే తెలంగాణ సమాజం మళ్లీ ఆశగా చూస్తోందనే అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది. పండుగ వేళ పల్లెలు, పట్టణాల్లో మారుమోగుతున్న పాటల ఘోష ప్రజాస్వామ్యంలో ప్రజల ఆకాంక్షలకు, వారి నిజమైన మనోభావాలకు అద్దం పడుతోంది.

# సిరిసిల్ల సుభాష్ నగర్‌లో బతుకమ్మ సంబరాల జాతర

విఘ్నేశ్వర సంఘం ఆధ్వర్యంలో
అంగరంగ వైభవంగా వేడుకలు
పూల బతుకమ్మల చుట్టూ మహిళల ఆటపాటలు..
కోలాటాలతో మార్మోగిన వీధి



**సిరిసిల్ల, తెలంగాణ పత్రిక ప్రతినిధి:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్‌లో అంగరంగ వైభవంగా జరిగాయి. సుభాష్ నగర్‌లోని విఘ్నేశ్వర సంఘం ఆధ్వర్యంలో మహిళలు ఈ బతుకమ్మ వేడుకలను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల మధ్య మహిళలు సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై, ఆటపాటలు, కోలాటాలతో పండుగ సందడిని రెట్టింపు చేశారు. మహిళల కోలాటాల చప్పుళ్లతో సుభాష్ నగర్ వీధి మార్మోగిపోయింది.

**పూల పండుగకు పల్లె పరిమళం!**

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సుభాష్ నగర్ మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తంగేడు, గునుగు తదితర పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకల్లో పాల్గొన్నారు. మహిళల ఆటపాటలు, కోలాటాలతో విఘ్నేశ్వర సంఘం ఆవరణం పండుగ శోభను సంతరించుకుంది.

**సంప్రదాయాలకు ప్రతిరూపంగా మహిళల సందడి**

ఆధునిక జీవనశైలిలోనూ తెలంగాణ సంప్రదాయాలను మరచిపోకుండా మహిళలు బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవడం విశేషం. తరతరాలుగా వస్తున్న ఆచారాలను కొనసాగిస్తూ, చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొనడం పండుగ ప్రత్యేకతను చాటిచెప్పింది. బతుకమ్మ పాటలతో తెలంగాణ సంస్కృతిని స్మరించుకుంటూ, కోలాటాలతో పరస్పరం ఆనందాన్ని పంచుకున్నారు.

**ఐక్యతకు ప్రతీకగా బతుకమ్మ వేడుకలు**

బతుకమ్మ పండుగ మహిళల మధ్య ఆత్మీయతను పెంపొందించడంతో పాటు, కుటుంబాలు, కాలనీల మధ్య స్నేహసంబంధాలను బలోపేతం చేసే గొప్ప సాంస్కృతిక వేడుకగా నిలుస్తుంది. విఘ్నేశ్వర సంఘం ఆధ్వర్యంలో మహిళలు నిర్వహించిన ఈ సంబరాలు తెలంగాణ పూల పండుగ వైభవాన్ని చాటిచెప్పాయి. పూలతో పేర్చిన బతుకమ్మలు, సంప్రదాయ వస్త్రధారణలో మహిళల సందడి, ఆటపాటలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ నేల సంస్కృతిని ప్రతిబింబిస్తూ, ఆడపడుచుల ఆనందోత్సాహాల నడుమ సుభాష్ నగర్‌లో బతుకమ్మ సంబరాలు వైభవంగా కొనసాగాయి. మన సంస్కృతి, మన సంప్రదాయం, మన ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఐకమత్యంతో జరుపుకోవడం అందరిలో సంతోషాన్ని నింపింది.

## రూ.8.98 కోట్ల విలువైన బంగారం సీజ్..

ఇద్దరు అరెస్ట్



**హైదరాబాద్:** పుష్ప సినిమా తరహాలో బంగారాన్ని స్మగ్లింగ్ చేస్తుండగా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) అధికారులు విశాఖలో భగ్నం చేశారు. రూ. 8.98 కోట్ల విలువైన 5,832.90 గ్రాముల విదేశీ బంగారాన్ని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... కోల్‌కత్తా నుంచి హైదరాబాద్‌కు బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్నట్టు రహస్య సమాచారం అందడంతో విశాఖలో డిఆర్ఐ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బంగారాన్ని తరలిస్తున్న కారును హైవేపై ఛేజ్ చేసి శనివారం అర్ధరాత్రి పట్టుకున్నారు. కారు సీటు కింద ప్రత్యేకంగా రూపొందించిన రహస్య క్యాబిన్‌లో దాచిన బంగారాన్ని కస్టమ్స్ చట్టం కింద సీజ్ చేశారు. ఇద్దరిని అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. బంగ్లాదేశ్ సరిహద్దు నుంచి హైదరాబాద్‌కు బంగారాన్ని చేరవేసే స్మగ్లింగ్ వ్యవస్థలో భాగంగా ఈ రవాణా జరుగుతున్నట్లు సమాచారం. డిఆర్ఐ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

## మూడు సంఘాల గుర్తింపు రద్దు చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్:** పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజినీర్స్ అసోసియేషన్, ఏపీ హోమియోపతిక్ మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఏపీ అసిస్టెంట్ అగ్రికల్చరల్ ఆఫీసర్స్ అసోసియేషన్‌ల గుర్తింపును రద్దు చేస్తూ ప్రభుత్వం వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం, గత పదేళ్లుగా వార్షిక సమాచారాన్ని ప్రభుత్వానికి అందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. సివిల్ సర్వీసెస్ నిబంధనలు–2001 ప్రకారం గుర్తింపు పొందిన ప్రతి ఉద్యోగ సంఘం ఏటా జులై 1లోపు తమ సంఘంలోని మొత్తం సభ్యుల వివరాలు, కార్యవర్గ జాబితా, బైలాస్, ఆడిట్ నివేదికను ప్రభుత్వానికి అందించాల్సి ఉంటుంది. గత పదేళ్లుగా ఈ సంఘాలు ఈ సమాచారాన్ని సమర్పించడంలో విఫలమైనట్లు ప్రభుత్వం పేర్కొంది.

## సిరిసిల్లలో శాశ్వత క్యాంపస్ నిర్మాణం చేపట్టండి: కేటీఆర్



**హైదరాబాద్:** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి.. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. 2021లో రూ. 402 కోట్ల పరిపాలనా అనుమతులతో మంజూరైన జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణం ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నదని పేర్కొన్నారు. మండేపల్లి గ్రామంలో 20 ఎకరాల భూమిని కేటాయించినప్పటికీ, నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో కళాశాల ప్రస్తుతం అగ్రహారంలోని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో తాత్కాలికంగా కొనసాగుతున్నదని తెలిపారు. కళాశాలను ప్రస్తుత ప్రాంగణం నుంచి మరో ప్రైవేటు భవనానికి తరలించే ప్రతిపాదనలు విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి ఇబ్బందులు కలిగించే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మండేపల్లిలో కేటాయించిన స్థలంలో శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి పనులను వేగవంతం చేయాలని కోరారు. అలాగే.. కొత్త క్యాంపస్ పూర్తయ్యే వరకు కళాశాలను ప్రస్తుత ప్రాంగణంలోనే కొనసాగించేందుకు అనుమతించాలని పేర్కొన్నారు.

Editor, Printer, Publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1, Auto Nagar, village Bommakal, Mdl and District: Karimnagar - 500001. Telangana State, Published at H. NO. 9-10/7A Krishna Nagar, Bommakal Village Mdl and District Karimnagar 505001, Telangana State, Editor : B. VENKATESHAM Cell : 8341110143